
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



11 జనవరి **సంక్రాంతి సంచిక** 1950


ప్రాణాయామం పట్టి
ముళ్ల పరుపు మీద పడు
కోవడం సన్యాసికి చేతనయితే
లోధ్ర
సేవించి ఆరోగ్య ***
సౌందర్యాలు పెంపొందించు
కొంటూ ఉత్సాహంగా వుండ
డము ఆమె చేతనవును.
"లోధ్ర" ఋతు దోషాలను
పారద్రోలి ఆరోగ్య సంతోష
సంతానములను సంప్రాప్తింప
జేయును
Lodhra
UTERINE TONIC
కేసరి కుటీరం లిమిటెడ్,
రాయపేట, మద్రాస్.



జనవరి 14 నుంచి విడుదల
విజయవాడ . శ్రీ మారుతీ సినిమా
బరంపురం . శ్రీ సీతారాంవిలాస్ టాకీస్
విజయనగరం . మినర్వా టాకీస్
విశాఖపట్టణం . మినర్వా టాకీస్
కాకినాడ . మినర్వా టాకీస్
రాజమండ్రి . మినర్వా టాకీస్
ఏలూరు . శ్రీ కేసరిపిక్చర్ పాలెస్
తెనాలి . శ్రీ సత్యనారాయణ టాకీస్
గుంటూరు . శ్రీ రాధాకృష్ణ టాకీస్
భీమవరం . స్వామీజీ టాకీస్
నెలూరు . మణి టాకీస్
బళ్ళారి . ప్రభాత్ టాకీస్
చిత్తూరు . శ్రీ గురునాథ టాకీస్
అనంతపురం . శ్రీ శారదా టాకీస్
నంద్యాల . నేషనల్ టాకీస్
సికింద్రాబాద్ . పారమౌంట్ టాకీస్
వరంగల్ . జై భారత్ టాకీస్
కడప . రౌనఖ్ పిక్చర్ పాలెస్
రాయచూర్ . శ్రీ విజయ టాకీస్
జెమినీ వారి
అపూర్వ సహోదరులు
భానుమతి – ఎం.కె.రాధా,
నాగేంద్రరావ్ – నారాయణరావ్
వగైరాలు నటించినది.........
తెలుగు

విషయానుక్రమణిక

జనవరి 11-1950

గమనిక

సంక్రాంతిపండుగ సెలవులపురస్కరించుకొని పైవారము (18-1-50) వారపత్రిక వెలువడదు. మరుసటిపత్రిక 25-1-50 న వెలువడగలదు.

సంపాదకులు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
అణాలు 0-4-0


ప్రతిబుధవారము ప్రకటింపబడును.

సంపుటము 42
సంచిక 20

ఒరులేయవియొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO.

విరోధి సంవత్సర పుష్య బహుళ అష్టమి బుధవారము




సంక్రాంతి బసవన్న చిందులు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిపత్రిక అణాలు 0-4-0	ప్రతిబుధవారము ప్రకటింపబడును. ఒరులేయవి యొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)	సంపుటము **42** సంచిక **20**

Founder : K. NAGESWARA RAO.

విరోధి సంవత్సర పుష్య బహుళ అష్టమి బుధవారము



సంక్రాంతి బసవన్న చిందులు

భావము, ప్రజలలో జీర్ణించిపోయినది. ఆ కారణముననే రాజ్యాంగమునందలి రాష్ట్రముల జాబితాలో ఆంధ్రను కూడ చేర్చవలెనని కాంగ్రెసు కార్యవర్గముకూడ కేంద్రమునకు సూచించినది. ఇప్పుడు కేంద్రప్రభుత్వము వాస్తవికదృష్టివలనగాని అవాస్తవికదృష్టివలనగాని తద్భిన్నముగ వ్యవహరించినచో రాష్ట్రము వచ్చునన్న ఆశకన్న, అసలు రాదేమో నన్న సందేహామే ప్రబలము కాగలదు.

ఈ సంశయనివృత్తికై, పాతచట్టముప్రకారము గవర్నరుజనరల్ హయాములోనే, రాష్ట్ర నిర్మాణమునకు తేదీ నిర్ణయించుచు గవర్నరుజనరలుఉత్తర్వు రావలెననియు, దాని ననుసరించి నూత్న రాజ్యాంగమునందలి రాష్ట్రముల జాబితాలో ఆంధ్రరాష్ట్రమును చేర్చవలయుననియు అనేకపర్యాయములు సూచించియుంటిమి. కేంద్రప్రభుత్వము ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకభాగోళికప్రాంతముగ పరిగణించుటకు సమ్మతించి యున్నది. గాన, తన పూర్వనిర్ణయముప్రకారము జనవరి 26 లోపుననే రాష్ట్రస్థాపనఉత్తరువును జారీచేయుటకు అవసరమైన ప్రాతిపదికచర్య లన్నింటిని పూర్తిచేయుటయు, తదనుగుణముగ రాజ్యాంగ చట్టములోని షెడ్యూలును తన్నిబంధనలను సవరించుటయు, కేంద్రప్రభుత్వమునకు విధాయకమై ఉన్నది.

అధికారరీత్యా ఇంతవరకు రాష్ట్రనిర్మాణమునకు తేదీ నిర్ణయించనంతమాత్రమున "జాప్య మొనరించుట వాయిదావేయుటకాద"ని కేంద్రప్రభుత్వము వాదించుటకు వీలు లేదు. అధికారవర్గములో, అనధికారవర్గములో, దేశనాయకులో, రాష్ట్రనాయకులో, ఎవరైననేమి 1950 జనవరి 26 నాటికి రాష్ట్రము వచ్చితీరునన్న భావము విస్తృతముగ ఏర్పరిచియున్నారు. నేడెట్టివైనను సాధ్యముకాని అడ్డంకు లున్నవని జాప్యముచేయుట, ప్రమాదకరమగు ఫలితములను చేజేతుల సృష్టించుకొనుటే యగును. నూత్నప్రభుత్వస్థాపన, ప్రభుత్వవిభజన, పనులకు అవసరమగు వ్యవధితప్ప, నిర్హేతుక కాలహరణమున కింక స్థానము లేదు. ఆ నమ్మకము కలిగించుకొనుటకు 1950 జనవరి 26 లోపుననే ఆంధ్రరాష్ట్రనిర్మాణపు టుత్తరవును జారీచేసి, భారతప్రభుత్వము తన సంకల్పశుద్ధిని ధృవపరచుకొనవలసి యున్నది. ఉత్తరువు అమలుజరుగుటకు వ్యవధి యుండవచ్చును తప్ప, ఉత్తరువు జారీఅగుటకు అభ్యంతరముండరాదు. ఇట విలంబన అనివార్యము కాదు. వాంఛనీయమూ కాదు.

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౪

అభిషేకమండపమున పేరోలగము మహాప్రభావముతో జరుగుచునే యున్నది. సూర్యభగవానుడు ఉదయాదిగా ఆ మహోత్సవమును చూచి చూచి అలసి విశ్రమింప బోవుచున్నాడా అనునట్లు చరమాద్రి కొరగుచుండెను. ఆకాశమున చెదరుచెదరుగా గాడిద మబ్బులు తిరుగుచు సంధ్యారంజితములై దిగంగనను అరుణారుణము గావించుచుండెను. అది అనురాగకృతమో కోపకృతమో ఊహింప శక్యమా?

ఆ సమయమున ఓరుగంటి ప్రాచీద్వారముముందుగల విశాల ప్రదేశమున చనుప యొక్కటి వచ్చి యాగెను. అందలి సార్థవాహులు ప్రాచీసముద్రతీరములనుండి యమూల్యము లగు సరకులు తెచ్చియుండిరి. ఆవైపులనుండి సార్థములు వచ్చి యిప్పటికి రెండు మూడు నెలలు దాటిపోయినది. తూర్పుసముద్రప్రాంతము శాంతముగా లేదు. కొన్నియెడల జటావర్మసుందరపాండ్యుని సేనలును మరికొన్నియెడల కొప్పెరుంజింగని పల్లవసేనలును ఇంకను గొన్నియెడల చోళసేనలును సంచరించుచు ప్రజాపీడ గావించుచుండెను. స్థానికు లగు వీరభద్రులును వీరముష్ఠులును ఆ యలజడి నరికట్టజాలకుండిరి. దారిదోపిడిగాండ్రు ప్రబలిపోయిరి. అట్టివారి కెల్ల గొంటూరుమాండలికు డగు నాగదేవరాజు ప్రాపుగా నుండి వారిని రెచ్చగొట్టుచుండెను.

ఇట్టి స్థితిగతులలో కృషీవలులు తమ క్షేత్రములు దున్నుటకు గాని అందితరవ్యవసాయకార్యములు ప్రారంభించుటకుగాని వెనుకాడుచుండిరి. గ్రామములోని రచ్చచావడి కొక నా డొక భటతండము వచ్చును. వారి నాయకు డొక యాజ్ఞాపత్రము గ్రామాధికారులకు చూపించును. రెడ్డియు కరణమును అది చూచి ఏమి చేయుటా యని యాలోచించుచుందురు. ఆ యాజ్ఞాపత్రములో ఇన్ని సజ్జలు ఇన్ని జొన్నలు ఇన్ని చోళ్లు—అట్లే ఇతరవస్తువులు పంపు డని యుండును. దాని మూల్యము భటులతో పంపియుండ లేదు. ఇంతమూల్యమునకు పంపు డని యైన నం దుండదు. మూల్యమెట్లు తా మప్పగింతురో తెలియరాదు. ఆ గ్రామాధికారులు తమ గ్రామములోని పొలిపొలములనుండి యా సంవత్సరము చెల్లింపవలసిన 'పుట్టిపహిండి' అంతకుమున్నె తమ పైవా రగు స్థలాధికారులకు పంపియుండిరి. మరి ఎట్లు ఇది పంపుట? ఈ పత్రము మొదలు పంపిన దెవరు?

ఇట్లా గ్రామాధికారు లాలోచించుచుండగనే వచ్చిన నాయకుడు తొందరించును. ఏమి చేయను దోపక వారు తలవరులను గ్రామములోని సంపన్నులయొద్ద కంపి ఎట్లో కష్టపడి వారు కోరిన ద్రవ్యములు సేకరించి యప్పగింతురు. ఆ నాయకుడును తృప్తుడై ఇన్ని వస్తువులు తాను పుచ్చుకొంటి నని పత్రము లిఖింపజేసి యా గ్రామోద్యోగుల కీయగా వారు కొంత తృప్తి నొందుదురు. కాని ఇది ఇట్లేల జరిగిన దని గ్రామాధికారులును గ్రామములోని పెద్దలును మథనపడుచుందురు.

ఆ మథన పూర్తి కాకముందె ఆ సాయంత్రమున చీకటిపడిన కొద్దిసేపటికి దివ్వెలు వేసికొని మరి యొక సైనికతండ మా గ్రామము ప్రవేశించును. దీని నాయకుడు తన యిచ్చవచ్చినచో తిష్ఠ వేసి తన యొద్దకే గ్రామోద్యోగులను పిలిపించుకొని ఏ యాజ్ఞాపత్రముకూడ చూపకయే సజ్జలు జొన్నలు చోళ్లే గాక వేయిమాడలుకూడ నిమ్మని యాజ్ఞాపించును. గ్రామోద్యోగుల కీమారు ఆలోచించుకొను నవకాశముకూడ నుండదు. ఏదైన చెప్పికొనబోయిన నా నాయకుడు కొట్టవచ్చువానివలె కేకలు వేయును. తుద కెట్లో ధైర్యముచేసి గ్రామకరణము ఆ నాయకునకు వంగివంగి దండములు పెట్టి తా మా మధ్యాహ్నవేళ నాయకున కిచ్చి పొందిన ద్రవ్యముల పత్రము చూపించును. ఈ నాయకు డది చదివికొనగలుగునో లేదో గాని యా పత్రముచూచినంతనే మిన్నెత్తున లేచి మండిపడి యసభ్యముగా ఆ మధ్యాహ్నము వచ్చిన నాయకుని దిట్టి ఆ గ్రామోద్యోగులను గూడ నట్లే తిట్టుచు చేతి కిచ్చిన పత్రము చింపివేయును. తుదకు ప్రహరణములు సిద్ధము కానుండగా నా గ్రామోద్యోగులు ఎట్లో ప్రయత్నించి సామాన్యగృహస్థులు ఇండ్లలో దాచుకొన్న ధాన్యమును వర్తకులయొద్దను గ్రామపంచాయతీలోనను నిలువయున్న వేయిమాడలును వానికి సమర్పించుకొందురు. ఈ నాయకు డవి చేకొని మరల పదితిట్లు గ్రామస్థులను తిట్టి స్వీకారపత్రమైన నీయక వచ్చినదారిం బోవును.

ఆరాత్రియే వేగరులచే నీవార్త స్థలాధికారులకు వారు నివేదించి కొందురు. ఇట్లే ఇతరగ్రామములనుండికూడ జరిగిన వార్తలు అప్పటికే స్థలాధికారులకు చేరియుండును. స్థలాధికారులు తమకు వచ్చిన యలజడివార్తలు అశ్వికులచే సీమాధికారులకును, సీమాధికారులు నాడియధికారులకును, వారు మండలాధిపతులకును దెలిపి

కొందరు. వాని విచారణ ప్రారంభించునవకాశము కలుగకముందె మరెన్నియో ఇతరగ్రామములను స్థలములందును సీమలలోనను కాక మొదటిగ్రామమందే తిరిగి యట్టిది సంభవించును. ఒక్కొక్కచో గ్రామీణులు ధైర్యము వహించి కూడుకొని యా వచ్చిన భటులను పారద్రోలుదురు. ఒకానొకయెడ రాత్రులందు ఆయుధహస్తులై భటులు గ్రామముపై బడి గృహములు దహనము కావించి స్త్రీబాల వృద్ధులగూడ నానాహింసలపాలు చేసి చిత్రవధ లొనర్తురు. అందులో పలువురు రెడ్లును కరణములును కాలుసేతులును కన్నులును నాలుకలును ప్రాణములును గోల్పోయిరి. పలువురు పారిపోయిరి. కొందరు ఈయదను కనిపెట్టి యలజడిమూకలలో చేర సంచరించుచు లాభములు గడింపజొచ్చిరి. గ్రామములలో ప్రారంభించిన యాలజడులు నెమ్మదిగా స్థలములు సీమలు నాడులు ముఖ్యస్థానములకే ప్రాకినవి. గొంటూరుమండలాధిపతియే వీనికంతటికి మూలకారణుడను వార్తయు నెమ్మదిగా ప్రవర్తిల్లెను. దానితో భయ మావహిల్లెను.

ఇట్టి స్థితిలో జానపదుల యవస్థ లేమని వర్ణింపగలము? వారు తమ యిండ్లు వాకిండ్లు గొడ్డు గోద విడిచి పోలేరు. విడిచినను ఎక్కడి కేగుదురు? ఎట్లుపోదురు? పోయియేమిచేయుదురు? ఎట్లు జీవింతురు? ఆ సంవత్సరము జీవనోపాధికి నిలువ యుంచుకొన్న ధాన్య మిట్లు దొరలపాలో దొంగలపాలో ఐనది. విత్తనములకై యేరి వేరుగా నుంచుకొన్నది కొంత భార్యాశిశువుల యాకలి తీర్చుటకు వ్యయపడినది. కష్టకాలముల నక్కరకు వచ్చునని నేలలో భద్రముగా దాచుకొన్న ధనము పైకి తీసినను దానితో ధాన్యము వచ్చు తావేది యున్నది? అట్లే ఒకప్రక్క కడుపులో మాడుచున్నను, అలవాటుపడియున్నందున వదలలేక, తన భూమినంతయు గాకున్న నొక డొక మఱుభూమిని మరియొక డొక పుట్టిభూమిని ఇంకొక డొక గడభూమిని గున్ని విత్తనములు చల్లి పైరు పెంచుచుండును. దహించెడి యాకలిబాధను, ఇంకను సర్వసమృద్ధముగా నున్న గోవులక్షీరములు త్రావియో మహిషీక్షీరము సేవించియో, కొంతకొంత చల్లార్చుకొనుచుండును. గొడ్డుమాంసములు తినుట కలవాటుపడినవా రింకను ఆంధ్రభూమిలో స్థిరముగా ప్రవేశింపలేదు. గ్రామములం దెల్లెడల పచ్చికబీళ్లు సమృద్ధముగా నున్నవి. వాన లున్నంతకాలము వానికి తరుగు లేదు. పశుసంపద యింకను క్షీణింపలేదు. దొరలుగాని దొంగలు తోడుబోతులు గాని గడ్డి తినరుగదా! వారివెంట వచ్చిన యాశ్వికులు గజములు ఉష్ట్రములు ఒకటిరెన్నాళ్లింత మేసినను గ్రామములోని గ్రాసమునకు కరవు రాదు.

కాని యిట్టి పశుసంపద యున్నను పశుపతులకు ఆ క్షీరము లైనను పూర్తిగా త్రావగలుగుదు మను నిశ్చయబుద్ధి లేదు. ఒకనికి గోష్ఠమునుండి కడవలలో పాలు వచ్చును. మరి యొకనికి గేదెల పాలు చేరును. ఇంకొక పేదవానియింటికి మేకపాలో గొఱ్ఱెపాలో వచ్చియుండును. ఇండ్లలోని స్త్రీలు కొందరు అవి కాచి తోడు వేసి యుందురు. మరికొంద రింకను కాచుచుందురు. ఇంకొకచో నవి కాచు ప్రయత్నములో నుందురు. మఱొక్కచో నారంభములు వాకిటనే యుండును. వేరొకయెడ పాలింకను తీయుచునే యుందురు.

అంతలో నొక భటతండ మా గ్రామము వచ్చును. వారి యాజ్ఞచే తోడుకొనుచున్న పాలును కాగినపాలును కాగుచున్న పాలును కాగబోవుపాలును వాకిట నున్న పాలును తీయుచున్న పాలును అన్నియు కలసి యా వచ్చిన భటులపాలగును. ఆ పాలతో పాటు గ్రామములో గల కొన్ని వేటలుగూడ వారిపాలే యగును.

ఇట్లు సంక్షోభము పొందుచున్న ప్రాక్సముద్రతీరమండలములలో చీకటిలో వెలుగువలె గ్రుడ్డిలో మెల్లవలె బ్రాహ్మణాగ్రహారములు అపవాదములై విరాజిల్లుచుండెను. దేవబ్రాహ్మణద్రవ్యములన్న నవి ముట్టుటకు జన మందరలో తీవ్రమగు భయము కలదు. బ్రాహ్మణులును విసారముగా స్వధర్మము విడువలేదు. వేదశాస్త్రాధ్యయనములు యజనములు నింకను వారు పుష్కలముగా సాగించుకొనుచుండిరి. వారి కెట్టి భయమును లేదు. విద్వాంసులైనవారికి జీవన మెట్లు గడచునను చింత లేదు. అగ్రహారములలో పాడి పంటలు సమృద్ధిగా కలవు. అవి ఎవరికి రావలసిన భాగము వారు న్యాయముగా తీసికొనుచుండిరి. ధన మున్న విద్వాంసుడు పరులను ధనమునకై యాచించుట నేర్చుకొనలేదు. యాచనమే నికృష్టమైనది. దరిద్రు డగు విద్వాంసుడు తనకు దాతగా నుండగల సంపన్ను డితడని నిర్ధారణ చేసికొని యతనియొద్ద కరిగి తన యవసర మెరిగించును. ఆ సంపన్ను డాయనకోరిక తీర్చుటచే తానును తన సంపదయు ధన్యమగు నను నిశ్చయబుద్ధితో నాతనికి కావలసినదానికంటె అధికముగా నీయబోవును. ఆ విద్వాంసు డందులో తన కవసరమైన దానికంటె నొక చిల్లిగవ్వ యైన నెక్కువ ముట్టడు. ఇట్టి స్థితిలో బ్రాహ్మణాగ్రహారములలో పాడిపంటలకు తరుగేల యుండును?

మరియు నా యగ్రహారములలోని స్త్రీపురుషులు కేవల కుక్షింభరులు కారు. అతిథులు అభ్యాగతులు ఆతురులు దీనులు ఆపన్నులు అనాథులు—ఎవరు వచ్చినను అగ్రహారికులు నిర్లక్ష్యభావ మూనరు. వచ్చినట్టివారికి శుష్కవేదాంతవాక్కు లుపదేశించి పంపివేయరు. స్త్రీలు ఇండ్లలో పనులు చేసికొనుటకు గాని, వచ్చిన పైవారికి వండిపెట్టుటకు గాని ప్రాల్మాలరు.

'వండ నలయదు వేవురు వచ్చిరేని
అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి'

అని వర్ణింపబడిన ప్రవరుని గృహిణి వంటివారే బహుళముగా నా కాలమందలి ఇల్లాండ్రు. అగ్రహారములో ధాన్యగ్రాసము లున్నంతవరకు వచ్చినవారక్కడనుండి క్షుధార్తులై వెనుదిరిగి పోరు. వేళ తప్పిపోయివచ్చిన దోపిడిమూకలకుకూడ అగ్రహారికు లన్నదానము చేయ వెనుకాడరు. మున్యాశ్రమములలో సహజశత్రువులగు మృగశార్దూలాదులు వైరములు దక్కి యొక్కచో సంచరించెడివని పురాణములలో చదువువాక్యము లానాటికి మనుష్యరూపులగు మృగశార్దూలములకు మాత్రమైనను ఇంకను ఆ యగ్రహారములలో ననువర్తించుచుండెను. ఆ దోపిడిగాండ్రు తెల్లవారువేళ ఆ గ్రామము వదలి పోవుదురు. అట్లు పోవునప్పు డందులో నొకకొందఱెవ్వరో అచ్చటి మేకనో గోవునో హరించి వెంట తీసికొనిపోవుదురు. ప్రొద్దు పొడిచినతర్వాత ఆ గుంపులోని తక్కినవారది గుర్తించి వెంటనే ఆ తస్కరుల శిక్షించి యాద్రవ్యము మరల నగ్రహారమునకు చేర్చుదురు.

ఒక్కొక్కచో సాహసించి యొక నాయకుడు కతిపయభటులతో నగ్రహారము ప్రవేశించి యగ్రణిని సమీపించి నమస్కరించును.

(57 వ పేజీ చూడుడు)

మనరాష్ట్రం, మనదేశం:

★ రిపబ్లిక్ అధ్యక్షపదవికి డా. రాజేంద్రప్రసాద్ ★

★ ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి తిరిగివాయిదాపడే సూచన ★

భారతీయ రిపబ్లిక్ ప్రథమాధ్యక్షునిగా శ్రీ రాజేంద్రప్రసాద్ గారిని ఎన్నుకోవడానికి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్ణయించారని వార్త వచ్చింది. సమాజ జీవనంలో అనేక శతాబ్దాలుగా ఉత్కృష్టమైన విశిష్టత సాధించుకున్న భారతీయుల ప్రజారాజ్యానికి అధిపతిగా ఉదాత్తగుణ సమున్నతమైన వ్యక్తిని నిర్ణయించుకుని కాంగ్రెసువారలు భారతజాతీయతకు శోభ చేకూర్చారు.

రాజ్యాంగ పరిషదధ్యక్షుడుగా శ్రీ రాజేంద్రప్రసాద్ ప్రదర్శించిన కార్యదక్షత, నిష్పక్షపాతవైఖరి, నిష్కళంక రాజనీతిజ్ఞతల్లు సర్వపక్షాల గౌరవాదరాలు వారికి ప్రాప్తింపచేయి. నూతన రాజ్యాంగ నిర్మాణంలో ఎంతైనా తోడ్పడ్డారు. నూతన రాజ్యాంగ హృదయం వారికి అవగతమే. అందువల్ల ఈ రాజ్యాంగ ఆశయాలను సాధించడానికి ఆరంభదశలో రిపబ్లిక్ అధ్యక్షపదవికి అన్నివిధాలా వారికే అధికార్హత ఉందని చెప్పక తప్పదు.

రిపబ్లిక్ అధ్యక్షపదవి ఇప్పటి గవర్నర్ జనరల్ పదవివంటిది కాదు. గవర్నర్ జనరల్ చేయవలసిన కార్యకలాపమంతటినీ, నిర్వహించవలసిన సర్వాధికారాల్నీ, మంత్రివర్గమే నెరవేరుస్తుంది. గవర్నర్ జనరల్ అధికారముద్రను మంత్రివర్గానికి పూర్తిగా అప్పగించాలి. కాని రిపబ్లిక్ అధ్యక్షుడి మాదిరి నామమాత్రపు అధికారి కాదు. కొత్తరాజ్యాంగంలో అధ్యక్షునికి అనేక అధికారాలివ్వబడినాయి. ఈ అధికారాల నిర్వహణలో సత్సంప్రదాయాల్ని ప్రచారంలోకి తెచ్చి మాతృప్రపంచ గౌరవప్రపత్తుల సాధించవలసిన కర్తవ్యం ప్రథమ రిపబ్లిక్ అధ్యక్షునిదైన ఉంటుంది. అందువల్లనే చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి, సదసద్వివేచన విచక్షణాశక్తి, నిష్పక్షపాతబుద్ధి, కార్యదక్షత సహృదయత కలిగి ఉండి, నూతన రాజ్యాంగం పట్ల అచంచల విశ్వాస ఆదరాలు కల వ్యక్తిని ప్రథమాధ్యక్షుడుగా నిర్ణయించుకోవలసిన అగత్యం ఉంది. ఈ పరిణామదశలో నూతన రాజ్యాంగప్రతిమకు ప్రాణప్రతిష్ఠ చేసి చిరాయువు గావించగలిగే వ్యక్తులు ఈనాడు రాజేంద్రప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్ మాత్రమేనన్న విషయం నిర్వివాదాంశం. ఈ ముగ్గురికీ ఉన్న ఉన్నతి ఈనాడు మరెవ్వరికీ లేదు. అందువల్లనే ముస్తరిలో రాజ్యాంగ పరిషదధ్యక్షుడుగా రాజ్యాంగ నిర్మాణ కార్యభారాని కార్యాధిపత్యం వహించిన రాజేంద్రప్రసాద్ ను రిపబ్లిక్ అధ్యక్షపదవికి నిర్ణయించడంలో ఔచిత్యం గోచరిస్తుంది.

రిపబ్లిక్ అవతరణతో పాటు లాంఛనప్రాయంగా మంత్రివర్గం పునర్నిర్మాణమౌతుంది. మంత్రివర్గంలో పెద్దమార్పు లేవీ ఉండవు. దాదాపు ఇప్పటి మంత్రులే ఉంటారనుకుంటున్నారు.


రిపబ్లిక్ నూతన మంత్రివర్గంలో ప్రధానిగా పండిట్ నెహ్రూ, ఉపప్రధానిగా సర్దార్ పటేల్ తోపై రాజేంద్రప్రసాద్ నూతన ప్రజాప్రాతినిధ్య పరిపాలనను నిర్వహించి ప్రపంచంలో భారతదేశానికి ఉచితగౌరవస్థానాన్ని లభింపచేయగలరని భారత ప్రజానీకం పూర్తిగా విశ్వసించవచ్చును.



ఆంధ్రరాష్ట్రం:

ఆంధ్రరాష్ట్ర నిర్మాణం జనవరి 26 వ తేదీలోగాగాని ఏప్రిల్ 1 వ తేదీకిగాని సాధ్యపడదని భారత ప్రధాని పండిట్ నెహ్రూ మద్రాసు విమానాశ్రయంలో ఆదివారంనాడు స్పష్టంగా చెప్పారు. అయితే భారత ప్రభుత్వ పరిశీలనం పూర్తికాగానే ఒక్కరోజైనా జాప్యం చెయ్యజోరని

(60 వ పేజీ చూడుడు)



పెద్దకథ :

అడవి కాచిన వెన్నెల

శ్రీ 'బుచ్చిబాబు'

మొదటినుంచీ అడవిలో సంచారం, జంతువుల్ని వేటాడ్డం అంటే ఎంతో సరదా నాకు. ఎఱగా చెట్టుకి మేకని కట్టేసి, చెట్టుమీద తెల్లవార్లూ కాచివుండడం, వొక ముసిలి పులి రావడం, దాన్ని తుపాకితో కాల్చడం, అది గాయపడి కుంటుకుంటూ పోవడం - మామయ్య చెప్పిన యీ అనుభవం నేనెప్పుడూ మరిచిపోను. కొద్దో గొప్పో, నాగరికజీవనానికి అలవాటుపడ్డ అందరికీ, యీ అడివి జీవితంపై, మోజుంటుందనుకుంటాను. ప్రాచీనత్వం, అనాదివాసుల బ్రదుకుపోకడలు, అడవిజాతులకుండే వేటతృష్ణ - యివన్నీ మనందరిలోనూ జీర్ణించివుంటాయి కాబోలు; యీ ప్రాచీనత్వాన్ని ప్రకటించే అవకాశం వొస్తే వొదులుకోము; ఆటలపై మోజు దీనికి తార్కాణం; కుస్తీ, 'బాక్సింగ్' చూడ్డం సరదాలనుంచి, యుద్ధంలో పాల్గొనడంవరకూ, రకరకాల అనుభవాల్ని సృష్టించుకుంటాం. పట్నాలలో టార్జాన్ చిత్రాలకి వొచ్చినంత డబ్బు, మరే చిత్రానికీ రాదు.

నా స్నేహితుడు చంద్రారెడ్డికి అటవిశాఖలో పని; మరికొందరు ఆఫీసర్లూ తనూ కలసి, వొక పెద్ద అడవికి నాలుగైదు మైళ్ళ దూరంలో క్యాంప్ చేస్తున్నారట; వీలైతే—వేసంగి శెలవలుగా—తనతో వో వారంరోజులు గడపడానికి రమ్మని వ్రాశాడు. పరిసరాలనీ, వాళ్ళ జీవితాన్నీ, విపులంగా వర్ణించాడు; వొచ్చేటప్పుడు పెద్దసైజు టార్చిలైటూ, కాలక్షేపానికి వో అరడజను పుస్తకాలూ తీసుకు రమ్మంటూ: "నీకు పెళ్ళీ పెడాకులూ లేదు. మా అల్లుణ్ణి పులి పొట్టనెట్టుకుందని వాపోయ్యే అత్తగారు లేదు. ఈ చుట్టుప్రక్కల, పులులు, చిరతపుల్లు, వున్నా, అవి బ్రహ్మచారుల జోలికి పోవుగనక నువ్వు నిర్భయంగా రావొచ్చు—మళ్లా క్షేమంగా యింటికి పంపించే పూచీనాది." అని వుత్తరం ముగించాడు రెడ్డి.

రెండుమూడు డిటెక్టివ్ నవల్సు,—ఆ రోజుల్లో అవంటే నాకు పిచ్చి—ఆఫ్రికా, అడవుల్లో యాత్రికుల అనుభవాల గ్రంథాలు, రెండు పొడుగాటి టార్చిలైట్సు తీసుకుని ఫలానా రైల్లో వొస్తున్నానని రెడ్డికి వుత్తరం వ్రాసి ప్రయాణంకట్టాను. రాత్రంతా రైల్లో పెద్దపులుల్ని గురించిన కథలు చదివి, మధ్యలో ఏ పులేనా కంపార్ట్‌మెంట్లోకి దూకుతుందేమోనని చూశాను కానీ అల్లాగేం జరగలేదు.

ఆవూరి ప్లాట్‌ఫారమ్‌మీద రైలు నిలిచేటప్పడికి తెల్లారింది. నాకు వూరు కనబళ్ళేదు—అన్నీ కొండలు, చెట్లు—మనుషుల అలజడి తక్కువ. చంద్రారెడ్డి వున్న చోటనే బండి నిలిచింది. సామాన్లు బైటకి తీసి బంట్రోతు నెత్తిన పెట్టాడు. ప్లాట్‌ఫారమ్ మీదికి దిగి అటూయిటూ పరీక్షగా చూశాను. నేను తప్ప అక్కడ యింకెవ్వరూ దిగినట్లు లేదు—ఐదారుగురు మట్టుకు, ఏవో బస్తాలతో రైల్లో కెక్కారు. ఇంజన్ వైపునుంచి, మాకేసి, వొకాయనా, వొకావిడా రైలుపెట్లని పరకాయిస్తూ నడిచి రావడం చూశాను. ఆయన ఎత్తుగా, లావుగా వున్నాడు; కాకీ ట్రౌజర్, డబుల్ బ్రెస్ట్ కోటు, కండ్లజోడు, చేతులో హంటర్ వున్నాయి; మధ్యపాపిడితీసి, పక్కలకి అణిచి దువ్వేసిన పొట్టిక్రాఫ్, సన్నటి మీసం, వొత్తుగా కనుబొమ్మలు, ఆకృతి కొంచం భీకరంగా కనబడ్డా దగ్గర్నుంచి చూస్తే మొహం లేతగా కనబడింది; వయస్సు పాతిక, ముప్ఫైలోపుగానే వుండాలనిపించింది. ఆవిడ మరీ లేతగా కనిపించింది; యిరవైలోపు—సన్నంమీద పొడుగ్గా కనిపించినా, అంత పెద్ద పొడుగూ కాదు. చాలా పల్చని మొహం,—సూర్యుడి కిరణాల్లో, కరుగుతున్న బంగారంలాగ, మెత్తగా మెరిసిపోయ్యే శరీరఛాయ—జీలుగుబెండుతో నిలబెట్టిన ఓడకొయ్యల్లాగ

వెండిరేకు తెరచాప ఎత్తిన దృశ్యం స్ఫురిస్తుంది. తెల్లచుక్కల, ఆకుపచ్చ సిల్కు మఫ్లర్ తలకి చుట్టింది. అందులోంచి సన్నటి వొంకులజుట్టు పుట్టలోపలికి కదులుతున్న పాముతోకలా, నుదుటిమీద జారుతోంది.

కొంతదూరం మాకేసి నడిచి, మళ్లా యిద్దరూ వెనక్కి తిరిగి ఇంజన్‌వేపు నడుస్తున్నారు. చివరదాకా నడిచి, వెంటనే వెనక్కి తిరిగి మాకేసి నడిచివొస్తున్నారు. దగ్గరకొస్తుంటే తెల్లటి సిల్కుచీరపై, పసుపుపచ్చ పూలడిజైను, చాకలెట్‌కలర్ బోర్డరూ, ప్రరటిజాకెట్టు, స్ఫుటంగా కనిపించాయి. ఎన్నటి నాజూకైన ముక్కు, పైకగుపించే సల్లరంధ్రాలు, చెవలకి ఆకుపచ్చ గుండ్రటి రాయి—ఆమెలో ఆకర్షణ ఎందులో వుందా అని ఆలోచిస్తుంటే: "ఆవిణ్ణి తరవాత చూద్దువుగాని సావకాశంగా, ముందు బైటకెడదాం, నడు." అంటూ చంద్రారెడ్డి, నాబుజాన్ని నెట్టాడు. నే వులిక్కిపడ్డాను; గేటుకేసి నడుస్తున్నాం.

"ఆయనెవరు రెడ్డీ?" అని అడిగాను.

అతను సమాధానం చెప్పేలోపలే వారిద్దరూ వొచ్చేసి మాముందు నిలబడ్డారు. రెడ్డి, నన్ను ఆయనతో పరిచయం చేశాడు.

"మా ఫారెస్ట్ఆఫీసర్, ప్రేమానంద్."

ఆయన లల పంకించాడు.

"నా స్నేహితుడు,—పట్నంనుంచి వొచ్చాడు—" అన్నాడు రెడ్డి.

నేను నమస్కారం పెట్టాను.

"మా తోడల్లుడి అన్నగారు బెంగుళూర్ నుంచి యీ బండిలో వస్తానన్నాడు. ఏదీ, రాలేదే." అన్నాడు ప్రేమానంద్, రైలు వంక కోపంగా చూస్తూ.

"బెంగుళూర్ కేసి సైక్లోన్‌ట—అంచేత రాలేదేమో." అన్నాడు రెడ్డి.

"అవును. మరిచాను. నిన్ననే మనం ఆవిషయం మాట్లాడుకున్నాం కూడాను. సరే, యిహ నేందుకూ—వెడదామా." అని ప్రేమానందం నాకేసి తిరిగి: "మళ్లా కలుసుకుందాం బంగ్లాలో—యింకా వుంటారుగా." అన్నాడు.

"ఏదో రెండుమూడు రోజు లుంటాను." అన్నాను.

"ఈలోగా ఏ పులీ తినకుండా వుంటే వారం వుంటాడు. అవునా?" అని చంద్రారెడ్డి, నవ్వాడు. కాని ప్రేమానంద్ మొహంలో నవ్వు లేదు. భీకరంగానో, దిగులుగానో వున్నట్లుంది అతని మొహం. పెద్ద ఆఫీసర్ కనపర్చవల్సిన అమానుషత్వపు ధోరణి కాబోలు ననుకున్నాను. ఆయన వెళ్లబోతూ, వొక్కక్షణం నిలిచిపోయి:—

"మరిచాను. మై వైఫ్." అని, ఆమెని పరిచయం చేశాడు. ఆవిడ, చుట్టూ కప్పుగున్న చీరకొంగులోంచి చేతులు బైటకి తీసి నమస్కారంలాంటిది చేసి, అగమ్యగోచరంగా నవ్వింది. స్త్రీకి నమస్కారం పెట్టడం నా కలవాట్లేదు. నేనూ అల్లాంటిదే చేసి, ఆవిడ కళ్ళల్లోకి చూశాను. నా కప్పుడర్థమైంది. ఆమె ఆకర్షణ కళ్ళల్లోది. మహారణ్యంమధ్యలో కదలికలేని లోతుకొలనులాంటి నేత్రాలవి; ఆ చూపువెనక, ఆఘాతాల ప్రతిబింబాలు మెదుల్తున్న అలజడి, వెనకచూపుల్లోని తీక్షణమైన చాంచల్యం, అన్నింటినీ తాళంతో బిగించిపారేసినట్లు, నిశ్చింతగా బిగించుకున్న సన్నటి పెదవులు, చీకటి నిండు చంద్రుణ్ణి బంధించినట్లు వెన్నెలని కప్పుకుని ప్రాణాలని రక్షించుకుంటున్న కారడవి—యివన్నీ కలిసి, ఆ ఆకర్షణని వ్యక్తపరుస్తాయేమో నాకు తెలీదు.

వారిద్దరూ గేట్‌లోంచి వెళ్లిపొయ్యారు. ఫర్లాంగవతల నిలిచివున్న కార్లో ఎక్కారు. కారు కదిలి, జువ్వలాగ బైలు దాటి కొండల వెనక అంతర్ధానమైంది.

మాకోసం, టాపులేని పెట్టెబండి సిద్ధంగా వుంది. ముడి విప్పితే జారిన సిల్కు తెరలా, సూర్యుడికాంతిలో మంచు, కొండలమీద నుంచి జారుతోంది. పచ్చరిబ్బన్‌లా రోడ్డు మెలికెలు తిరిగింది. చంద్రారెడ్డి ఫ్లాస్కు తీసి మూతలో టీపోసి తాగడాని కిచ్చాడు. బండి కదిలింది. వాళ్ల కాంప్‌దగ్గరకి షుమారు మూడుమైళ్లదూరం వుందిట. గుట్టలు, బైలు, కొండలు దాటి, కాంప్‌సమీపంలో కొచ్చాం.

"అదిగో అదే మా ఆఫీసర్‌గారి బంగాళా" అని చూపించాడు రెడ్డి. రోడ్డు కుడివైపున దూరంగా చెట్లమధ్య బంగాళా కనిపించింది. దానిముందు, రెండుమూడు పాకలున్నాయి; వెనక ఎత్తుకొండ కింద, చెఱువులాంటిదుంది.

"ఆవిడొక్కత్తే ఎల్లా వుండగల్గుతోంది?" అని అడిగాను. చంద్రారెడ్డి కొంటెగా నవ్వాడు. రెడ్డి చిన్నప్పుడు క్లాసులో తెలివైనవాడుగా పేరుపడలేదు; కాని చమత్కారంగా, హాస్యంగా మాట్లాడేవాడు. అటవీశాఖలో ఐదేళ్లుగా పనిచేస్తున్నా, సంస్కృతి అంతగా దెబ్బతినలేదు.

"వొక్కత్తే వుండే ఖర్మమేం—మొగుడున్నాడుగా!" అన్నాడు. "మీ ఆఫీసర్లందరూ, భార్యలతో కాపరం వుంటున్నారా యీ కాంపులో?"

"లేదు, లేదు—మేం అందరం వొంటిగానే వుంటున్నాం. ఆయనొక్కడే, భార్యని తీసుకొచ్చింది. కొత్తపెళ్లాం. మరిచాను, ఆవిడపేరు నిర్మల. ఆ గుడిసెల్లో బంట్రోతు లిద్దరుంటున్నారు వాళ్ల ఆడాళ్లు ఆవిడకి సాయంగా వుంటున్నారు."

వాళ్లంతా కాంప్ ఎందుకు చేశారో చెప్పడం మొదలెట్టాడు రెడ్డి. కొంత సర్వే పనుందిట; కొంతభాగం అడివి ధ్వంసంచేసి, వొక అటవీపరిశోధనాలయం నిర్మించాలిట; అన్నింటికంటె ముఖ్యం, ఆ అడవిలో రెండుమూడు నెలలుగా, నరమాంసానికలవాటైన ముసిలిపులి తిరుగుతూ నష్టం కలగచేస్తోందిట; దూడల్ని, మేకల్ని, కాకుండా, యిద్దరు కట్టెలుకొట్టేవాళ్లనికూడా పొట్టపెట్టుకుందిట. దాన్ని వేటాడి పట్టుకోడంకూడా, వాళ్ల పన్లలో వొకటిట. ఆ పులికి "రాయలకేసరి" అని నామకరణం చేశారుట—రాయలసీమలో వుంటోంది గనక.


"ప్రేమానందం యిదివరలో ఎన్ని పులుల్ని వేటాడాడు?" అని అడిగాను.

"ఆయన్నిగురించి నన్నేమీ అడగొద్దు; నాకేమీ తెలీదు. ఆయన యీ డిపార్ట్‌మెంట్‌లో చేరి వో సంవత్సరమైంది; పైగా యీ డివిజన్‌కి బదిలీ అయి, నెలకూడా కాలేదు. ఈ కాంప్‌లో నాలుగురోజుల్నించే, మా పరిచయం. చాలా మితభాషి; చనవు కనబర్చడు. తగినట్లుగానే మేం అందరం ముభావంగానే వుంటున్నాం" అన్నాడు.

బండి కాంప్‌దగ్గర నిలిచింది—అంతా, చదునుగా కనబడే పచ్చగడ్డిబైలు; మధ్య నాలుగైదు పెద్ద చెట్లున్నాయి; వాటి మధ్యలో అక్కడక్కడ, టెంట్లు వేశారు. గడ్డితో వో పాకేశారు. అది ఆఫీసుట. చెట్లకింద, చల్లటి విశాలమైన నీడలు—అక్కడ రెండు కాంప్ టేబిల్సు, కుర్చీలు వేశారు. అరబైటే, వొంటలు, భోజనాలూ.

"ఇవి తప్ప, యింకేవీ యిళ్లు లేవా?"

"లేకేం. మనం బంగాళా చూశామే—దానవతలగా, ఫర్లాంగుదూరంలో వో చిన్ని కాలనీ వుంది,—వో అరడజను కొంప లుంటాయి. వర్క్‌మెన్, మేస్త్రీ, కంట్రాక్టర్



—వొకరిద్దరు ఆఫీసర్లూ వాళ్లంతా అక్కడుంటారు. మేం నలుగురం మాత్రం, సరదా పడి, టెంట్లు వేసుకున్నాం. ఇదుగో, రాఘవులు—నిద్రాదేవి కీ ప్పాట విడాకులిచ్చి వొస్తున్నాడు—" అంటూ, రెడ్డి, రాఘవుల్ని పరిచయంచేశాడు.

"గరనా—టీ తగలెట్టరా." అని కేకేశాడు. గురవడు, వొక ట్రేలో, గోధుమ రొట్టెల దొంతర తెచ్చి బల్లమీద పెట్టాడు. అవి తిని, మళ్లా కొంచం టీ తాగి, స్నానాలకి బైలుదేరాం. పందగజాలమూరంలో, చిన్ని కొలనుంది—లోతు లేదు—అడుగున ఎఱ్ఱగా కంకరసొంపు కనబడుతుంది—నీళ్లు తేటగా మధురంగా వున్నాయి. మేం వెళ్లేటప్పటికి, అందులో యిద్దరు వ్యక్తులు స్నానాలు చేస్తున్నారు. వాళ్లనికూడా రెడ్డిపరిచయంచేశాడు. ఒకతను శ్రీహరి,—మా రెడ్డి సహాధ్యాయుడు; రెండో అతను, మధుసూధనం,—రెడ్డికంటె కొంచం తక్కువ గ్రేడు వుద్యోగి—డిపార్ట్మెంట్లో ప్రవేశించి, ఏడెనిమిది నెలలైంది. — యిక్కడికి కొత్తగా బదిలీ అయి, రెండు వారాలైందిట. మధుసూధనం, నాజూకుగాను, తెలివిగాను కనిపించాడు. సన్నటి, పల్చటి కోలమొహం, మెత్తటి నుదురు, విశాలంగా, చక్రాలలా కనబడే అందమైన కళ్లు—వీటికి యవ్వనం కొత్త వెలుగు నిచ్చింది. అతను అందమైనవాడని, పురుషులుకూడా అనుకోవల్సిందే; కాని వొకటిరెండు లోపాలున్నట్లు నాకు తోచింది; పళ్లు వొకటో, రెండో—కొద్దిగా వంకర. మొహం మృదువుగా, కోమలంగా వున్నా, పెదవులు గుండ్రంగా బలంగా వుంటాయి—నవ్వినప్పుడు, మొహం వింతగా ముడతలుపడి,—యవ్వనం సిగ్గుతో వొణుకుతున్నట్లు—బుగ్గ మీది నొక్కులో దాక్కున్నట్లుగా వుంటుంది ఆ నవ్వు. నడుం సన్నంభుజాలాన ఛాతీ వెడల్పుగా కనబడుతుంది—ఛాతీ వెండ్రుకలులేకండా, నున్నగా వుంది.

శ్రీహరి మోటుగా కనిపించినా, వయస్సు. పాతికలోపేఅనుకున్నాను. మోటుతనానికి కొంత కారణం, నెత్తిమీద వెండ్రుకలు పల్చబడటమే; వెడల్పుముక్కు, చిన్ని కళ్లు, కోసేసినట్లు కనబడే నుదురు—యివన్నీ పెద్దవాడిగా కనబడేటట్లు చేస్తాయి.

"ఇక్కడ నీళ్లు చూశారా ఎంత నిర్మలంగా వున్నాయో." అన్నాడు శ్రీహరి.

"నిర్మలన్న పదం రోజూ కొకసారేనా వాడకుండా వుండలేడండి మావాడు." అన్నాడు మధుసూధనం శ్రీహరిని వుద్దేశించి.

"పెండ్లికావల్సినవాడవు—మేం కాపరాలు చేస్తున్నాం—వేళాకోళం భరించి వూరుకోకూడదు ?" అన్నాడు శ్రీహరి. వాళ్ల స్నానాలు ముగిసినై; బట్టలువేసుకుని కాంప్లోకి పొయ్యారు. వాళ్లు వెళ్లిం తర్వాత చంద్రారెడ్డి నాతో. చెప్పాడు; కుర్రాడు. పచ్చపచ్చగా వున్నాడనీ, బ్రహ్మచారి కావడంవల్లనూ, అందరూ మధు

సూదనాన్ని వేళాకోళం చేస్తుంటారుట.

"ప్రేమానందాన్ని గురించి ఏవేవో వింతగా చెబుతుంటారు, వ్రాసి పోక." అన్నాడు చంద్రారెడ్డి.

కింద వుద్యోగులందరూ కలిసి, పైవుద్యోగినిగురించి కాస్తంత నిరసనగా మాట్లాడడం సహజంగానే వుంది. అతనిలో లోపాలన్నీ తవ్వితీస్తారు; లేకపోతే సృష్టిస్తారు; శీలంలోనూ, నైతికప్రవర్తనలోనూ లోటు కనబడకపోతే, అతని తెలివితేటలకి విలువ కడతారు; అందులోనూ ఏమీ దొరక్కపోతే, అతని భార్యనిగురించేనా గుసగుసలకి అవకాశంవుంటే కథా వస్తువుని అల్లుకుని తృప్తి పడతారు కాబోలు—అనిపించింది నాకు.

"అతనిలో ఏమట్టి విశేషం?" అని అడిగాను.

"నే నేమీ నమ్మననుకో — వాళ్ళనడం, అతను నపుంసకుడని."

"అల్లా అనుకోడానికి ఆధారం?"

"నాకేమీ కనబడలేదు. నాలుగైదేళ్ళుగా కాపరంచేస్తున్నా సంతానం లేదుట."

నాకు నవ్వొచ్చింది. సంతాననిరోధక సాధనాలు యత్నిస్తున్నారనుకోకూడదు? రెడ్డికి నా వాదము అంత రుచించలేదు.

"ఎందుకు చెయ్యాలి? వాళ్ళు పిల్లల్ని పోషించలేని బీదస్థితిలో లేరు. పైగా వొకరిద్దరు సంతానం కలిగింతర్వాత, అరికట్టడం జరుగుతుందేమో." అన్నాడు.

"నిర్మలఅందం చెడకుండా వుంచాలని సంకల్పించారేమో." అన్నాను.

ఈసారి రెడ్డి నవ్వాడు.

"నువ్వంతా ఊహాప్రపంచలో విహరిస్తుంటావు; భావకవిత్వం యింకా రాస్తున్నావా?" మ్యా స్నానాలూ ముగిసినై, కాంప్‌దగ్గరకి చేరుకున్నాం." తొమ్మిదైంది. చెట్లకింద చల్లటి నీడలమధ్య సూర్యరశ్మి తివాచీలో అల్లికగా వెలిగిస్తోంది. చల్లదనానికి స్పృహతప్పినట్టు, చెట్లమీదనుంచి ఆకులు కిందికి రాలిపోతున్నాయి. సర్వీచెట్లు దూరంగా రోదిస్తున్నాయి.

"ప్రేమానందాన్ని గురించి మీ అనుమానాలు యీ పూట చర్చించండి, మావాడు విని తీర్పుచేస్తాడు—మానసికశాస్త్రం అంటే చెవికోసుకుంటాడు, మా వాడు." అంటూ రెడ్డి నన్ను మళ్లా వాళ్ళకి పరిచయం చేశాడు. రాఘవులు ప్రారంభించాడు.

"ఆయనలో ఏదో తిరకాసు లేకపోతే, ఆవిడ ఆపని ఎందుకు చేస్తుందోయి?"

"ఏపని?" అని అడిగాను ఆత్రుతతో.

"ఆత్మహత్య తలపెట్టింది. పట్టపగలు; మధ్యాహ్నం మూడింటికి,—మాట్లాడవేం శ్రీహరీ—నువ్వు వాళ్ల చుట్టానివేగా." అన్నాడు రాఘవులు. శ్రీహరి, ప్రేమానందానికి చాలా దూరపు చుట్టంట, అంచేతే కాబోలు, ప్రేమానందాన్ని గురించి మాట్లాడంలో అంత వుత్సాహం కనబర్చడంలేదు. నేను చెబుతాను పట్టు అంటూ రాఘవులు, నిర్మలజీవితంలో వొక ఘట్టం చిత్రించాడు.

నిర్మలతండ్రి స్థితిపరుడు, ఎస్టేట్లలో తాశీల్దారుగా చాలా డబ్బు పలుకుబడి సంపాదించాడు; ప్రభుత్వవుద్యోగులలో పెద్దవాళ్ళందరితో పరిచయం వుంది. తల్చుకుంటే ఏపనైనా, ఎంతటి పనైనా చేయించుకోగల్డు; నిర్మలకి అక్కయ్యా, చెల్లెలూ వున్నారు; అప్పగారు మనోరమని—భాగ్యవంతుల కుటుంబంలో యిచ్చి పెండ్లి చేశాడు; భర్తకి బోలెడు వ్యవసాయం కాకుండా, వ్యాపారంకూడా వుంది. వ్యాపారం అతనన్నగారు చూస్తూ, బెంగుళూరులో వుంటాడు. అతన్ని రిసీవ్ చేసుకునేందుకే వుదయం ప్రేమానందం స్టేషన్‌కెళ్ళాడు.

నిర్మలఅత్తవారు అంత స్థితిపరులు కాకపోయినా, కుర్రాడి తెలివి, చదువూ చూసి, వివాహం చేశాడు. పెండ్లినాటికి నిర్మలకి పదిహేడేండ్లుంటాయి; స్కూల్ ఫైనల్ కాన్వెంట్‌లో చదివింది. పెండ్లి కాగానే అత్తవారింటి కొచ్చింది. ప్రేమానందం చదువు ముగిసింది కాని వుద్యోగం లేదు; మామగారి ప్రోద్బలంమీద, ఐదారు నెలలు అటవీశాఖలో తర్ఫీదుపొందాడు: ట్రైనింగ్ ముగిసిన నాలుగునెల్లలో మామగారి ధర్మమా అంటూ, యిప్పుడు చేస్తున్న పెద్ద వుద్యోగంలో మొదట్లోనే ప్రవేశించాడు.

భర్త ట్రైనింగ్ కెళ్ళిన ఐదారు నెలలూ, నిర్మల అత్తవారింట్లోనే వుంది; విచిత్రమైన వ్యాధికి గురైంది. భోజనం చెయ్యదు. అందరూ బలవంతం చెయ్యగా ఏదేనా అంటే, డోక్కొంటుంది; మనిషి క్షీణించిపోతోంది; డాక్టర్లు పరీక్ష చేశారు; వాళ్ళకేమీ లోటు కనబళ్లేదు; మందు లిప్పించారు; ఏమీ ఉపయోగించలేదు. భోజనం మట్టుకు లేదు. కాసిని పాలో, ఓవల్టినో, ఎప్పుడేనా బ్రెడ్, బిస్కట్స్ మాత్రం తీసుకుంటుంది. అసలు ఆకలే లేదంటుంది. అత్తగారు భూతవైద్యం చేయించింది; లాభం లేకపోయింది; హిస్టీరియా అన్నారు, గాలన్నారు; ఎవరో మందెట్టారన్నారు. తండ్రి, కూతుర్ని తనతో తీసుకెళ్లాడు.

ప్రేమానందం, భార్యని చూడ్డంకోసం అత్తవారింటి కెళ్ళాడు. కార్యం చేస్తే వ్యాధి కుదురుతుందన్నారు; తాశీల్దారు వీల్లేదన్నాడు; "కార్యం చెయ్యడం ఏమిటీ—ఎప్పుడో అయింది" అన్నారుట. భర్త వారంరోజులుండి వెళ్లిపోయ్యాడు. ఆనాడు ఆదివారం. తాశీల్దారు కాంప్ కెళ్ళాడు; తల్లి పడుకుంది; చెల్లెలు హాల్లో వుయ్యాల వూగుతూ రేడియో వింటూ కూర్చుంది. మనోరమబావగారు మట్టుకు ముందుగదిలో పేపర్ చదువుకుంటున్నాడుట. ఫీ మని పెద్ద చప్పుడైంది. పక్కింటి కృష్ణయ్యగారు—ఆయనికి టెలిగ్రాఫ్ ఆఫీసులో పని—లేచాడు. నిర్మల నూతులో పడిందని కేక లేశాడు. నలుగురూ పోగయ్యారు; నిచ్చెనలు దింపి, ఆమెని పైకి లేవదీశారు. అదీ ఆమె ఆత్మహత్యకి చేసిన మొదటి యత్నం. కారణం ఏమీ లేదు. తల్లి తండ్రి, ఎందుకో చెప్పమని రహస్యంగా ఎంతో బ్రతిమలాడారు. నిర్మల సమాధానం చెప్పదు. 'ఊరికినే' అందిట.

ఆ సాయంత్రం యీ వార్త తెలీగానే శ్రీహరి చూడ్డానికి వెళ్లాడు—అప్పుడు శ్రీహరి ఆ వూళ్లో చదువుకుంటున్నాడు. చీకటిపడింతర్వాత మధుసూధనంకూడా చూడ్డాని కెళ్లాడు—అప్పుడతను, ఆవూరు, స్నేహితుడి పెండ్లి కొచ్చాడుట.

ఈ కథ వింటే ఆశ్చర్యంకలిగింది. అకారణంగా, వుత్తిపుణ్యానికి, ఎవరైనా ఆత్మహత్య తలపెడతారంటే నేను నమ్మలేకుండా వున్నాను. అట్లాగన్నాను.

"మతిభ్రమ కాకూడదా?" అన్నాడు రాఘవులు.

"మతిభ్రమ కావొచ్చు— దానికేనా ఏదో కారణం వుండాలి. నిర్మలకి వివాహం యిష్టమేనా?" అని అడిగాను.

"నిర్మలపెండ్లి నే చూశాను. అయిష్టత వున్నట్టు ఎవ్వరూ అనుకోలేదు. మహావైభవంగా జరిగింది పెండ్లి. నిర్మల సంతోషంగా,

సరదాగా వుందనే మేం అనుకున్నాం. ఏం మధూ, నువ్వూ చూశావుగా?" అన్నాడు శ్రీహరి.

"ఏమోనోస్కీ—పీటమీద కూర్చున్న వ్యక్తులు దిగులుగా వున్నారా, హుషార్‌గా వున్నారా కనుక్కుందామన్నంత పరీక్షగా చూళ్ళేదు. నా కళ్లకది అన్ని పెళ్లిళ్ల మాదిరిగానే వుంది. పైగా పెండ్లినాటి సాయంత్రమే నే వెళ్ళిపొయ్యాను. తరవాత రెండుమూడు రోజులు దాకా అక్కడే నువ్వున్నావుగా—నీకే బాగా తెలియాలి." అన్నాడు మధు.

"అవును. ఉన్నాను. ఎక్కడా, పేచీలు, మాటపట్టింపులూ వొచ్చినట్లు లేదు. ఆరు వేలు కట్నం చదివించారు; అమ్మాయికి నాలుగైదు వేల ఖరీదైన వెండిబహుమతులొచ్చాయి...ఊరేగింపునాడు, ముత్యాల ఓడ కట్టించారు—ఆ దీపాల్లో నిర్మల, బంగారు జరీ చీర, ఎఱ్ఱరంగుది..." శ్రీహరి వర్ణన పూర్తి కాకుండానే మా చెంద్రారెడ్డి, అడ్డుకున్నాడు. "బాబూ, యీ వర్ణన మాకక్కర్లేదు—వో ఇరవైసార్లు విన్నాం. అసలు విషయానికి రండి" అన్నాడు

నేను వూరేగింపునాటి నిర్మలను వూహించుకుంటూ మౌనంలో పడ్డాను. నా కొకటి రెండు అనుమానాలు కలిగాయి.

"ఆ ఆదివారంనాడు, తాశీల్దారుగారింట్లో ఎవరెవరున్నదీ, వుదయంనుంచి, నూతులో పడేవరకూ, ఏమేమి జరిగిందీ, విపులంగా ఎవరేనా చెప్పగల్రా?" అని అడిగేశాను, ఏ వొక్కర్నీ వుద్దేశించకుండా.

శ్రీహరి సమాధానం చెప్పాడు. "నేనంతా ఆ పూటే అరాతీశాను. నిర్మల వుదయం లేచింది. తల్లితో కలిసి కాఫీలు అవీ యిచ్చింది. బావగారు అన్నగారు—ఆయన పేరు కుటుంబరావు—కాఫీ తాగి వూళ్లో కెళ్లాడు. నిర్మల కాస్సేపు రేడియో పెట్టుకుందట. తర్వాత స్నానం చేసి వంటింట్లో పనిచేసింది. మధ్యాహ్నం భోజనాలైంతర్వాత వో గంట నిద్రపోయింది. లేచేప్పటికి రెండైంది. అప్పుడు నే వెళ్లాను—ఏమో తోచక కాసేపు రేడియో విందామని—"

"కాయ్యకోయ్—కాసేపు నిర్మలని చూద్దామని వెళ్ళావ్!" అన్నాడు రాఘవులు.

శ్రీహరికి కోపం వొచ్చింది. కాని దిగమింగుకున్నాడు—మొహం వుద్రేకంతో వుబికింది.

"తప్పా? అదీ వో వుద్దేశమే. నా కేమీ దురుద్దేశం లేదు. పైగా ఆమె భర్తతో కాపరం చేస్తోంది."

"దురుద్దేశం వుందని మేం అనలేదు. నీ కెందు కంత భయం...?" అన్నాడు రాఘవులు.

"అసలు విషయం చెబుదురూ—మధ్యలో యివన్నీ ఎందుకు..." అని మా రెడ్డి సణిగాడు.

మళ్ళా శ్రీహరి ప్రారంభించాడు.

"కాసేపు నిర్మల నాతో మాట్లాడింది. చెల్లెలు తనూ కాఫీలకోసం వంటింట్లో కెళ్ళారు. కాసేపు ముందుగదిలో పేపర్ మాసి, కాఫీ తాగి, నేను వెళ్లిపొయ్యాను. ముందుగదిలో కుటుంబం నిద్రపోతున్నాడు. నిర్మల అతన్ని లేపి కాఫీ యిచ్చింది. నేను రోడ్డుమీద ఫర్లాంగుదాకా వెళ్లిపోయి వెనక్కి తిరిగాను. కుటుంబం గబగబ నడిచి రావడం చూశాను. అంతే, నాకింకేమీ తెలియదు—ఆరింటికి, నిర్మలని నూతులోంచి తీశారన్న వార్త మధుసూదనం చెప్పాడు" మధుసూదనం తన విషయం మొదలెట్టాడు.

"నేనా వుదయం తొమ్మిదింటికి వాళ్లింటికెళ్ళాను. బి. ఎ. పూర్తిచేసి వుద్యోగం లేని రోజు లవి. తాశీల్దారుగారు, మా నాన్నగారు స్నేహితులట—దూరపు చుట్టరికం వున్నా, కలిసిమెలిసి వుండటం పడలేదు—అబ్బాయిని నాదగ్గరకు పంపు, ఎందులో నేనా వుద్యోగం చూస్తానని, తాశీల్దారు మానాన్నకి వ్రాశారు. ఆవిషయమై, తాశీల్దారుగార్ని చూడ్డాని కెళ్ళాను. ఆయన ఆరోజున లేడు. కాంప్ కెళ్ళాడుట. ఆసంగతి నిర్మలచెల్లెలు చెప్పింది. వెళ్లిపోబోతుంటే, నిర్మ లప్పుడే వొచ్చింది. స్నానం చేసి, భోజనాని కుండమంది. తాశీల్దారుగారొచ్చింతర్వాత వస్తానని వొచ్చేశాను. నే నక్కడ మొత్తం నలభై నిమిషాలు గడిపుంటాను. ఐదుగంటలకి కాఫీహోటల్లో నిర్మలఆత్మహత్యవిషయం ఎవరో అనుకుంటుంటే విని, చూడ్డానికెళ్లాను. దోవలో శ్రీహరితో చెప్పాను. అప్పటికి జనం చుట్టూ మూగేశారు. నేను నిర్మలని చూళ్లేదు. ఎవ్వరితో మాట్లాడలేదు."

నిర్మలచేసిన ఆత్మహత్యవిషయం ఆలోచించినకొద్దీ చిత్రంగా కనబడుతోంది. కారణం ఏదో వుండాలి. అది తెల్సుకోవాలన్న నిశ్చయం నాలో అప్పటికి బలపడింది.

"మరొక్క ప్రశ్న. ఆరోజున పోస్టుజవానొచ్చి, వుత్తరా లేవన్నా యిచ్చాడా?"

శ్రీహరి జవాబిచ్చాడు.

"వెధవమందమరుపు నేనూ—! అవును. నే వున్నప్పుడే, పోస్టుబంట్రోతొచ్చాడు. నిర్మలచెల్లెలు వెళ్లి తీసుకుంది. రెండు కార్డులు వొక కవరు కాబోలు. నిర్మల చెల్లెలిదగ్గర్నుంచి, వాటిని తీసుకొని, గదిలో కెళ్లింది. అవునవును ఐతే మీ అనుమానం ఏమిటి?"

కాసేపు నిదానించి, నాకు తోచింది చెప్పాను.

"నా అనమానం ఏమిటంటే, ఆవొచ్చిన కవరు భర్తదగ్గరనుంచి. అందులో నిర్మలకి కష్టల తోపించే సంగతులు వుండివుంటాయి. ఆ వుత్తరం వొచ్చిన గంటలోనే ఆత్మహత్య చేసుకుంది."

మా రెడ్డి యిల్లాగన్నాడు.

"ఆత్మహత్య, పట్టపగలు, బహిరంగంగా తలపెట్టడం చూస్తే తనకి నిజంగా చావాలన్న సంకల్పం లేదనిపిస్తోంది. రెండో యత్నంకూడా పగటివేళే చేసింది. ఆకర్షణ, జాలి పొందుదామని తప్ప, నిజంగా చనిపోవాలని వుద్దేశం వుంటే, విఫలమయ్యే యత్నాలెందుకు చేస్తుంది?" రెడ్డి అన్న మాటలు ఆలోచించతగ్గవే. ఈ మాటలతో నన్ను రెండుప్రశ్నలు ఎదుర్కొన్నాయి. మొదటిది: ఆత్మహత్య ఎందుకు తలపెట్టింది? రెండోది: నిజంగా మరణించాలన్న యత్నమేనా?

కథ పూర్తిగా విన్నతర్వాత ఆలోచించడం మంచిదనుకుని- ఆ రెండో యత్నం వివరాలు చెప్పమన్నాను. రాఘవులు అమిత వుత్సాహంతో చెప్పబోతుండగానే, ప్రేమానందం, బంట్రోతు కాగితాలుకట్టలు, రావడం చూసి విరమించాడు. వాళ్లు ఆఫీసు పని చూసుకోవా లన్నారు. రెండుగంటల సేపుట. ఈలోగా అల్లా షికారుగా తిరిగి రమ్మని, రెడ్డి నాకో తుపాకీ, టెలెస్కోపు యిచ్చి సాగనంపాడు.

నేను, నాలుగైదు ఫర్లాంగులు నడిచి, అక్కడ వో చిన్న కొండ కనబడితే, దాని పైకి యెక్కి వెళ్లాను. టెలెస్కోపులోంచి, చుట్టుపక్కల పరకాయించి చూశాను. దూరంగా మా వాళ్ళ టెంట్లో, చెట్లు కనబడ్డాయి. కొండకి వుత్తరంగా చెట్లు—, దానివెనక అడివి కాబోలు—

దక్షిణంగా పాతిక గుడిసెలు, వాటి వెనక చెఱువు కనిపించాయి. చెఱువుకి అవతల గట్టున, ప్రేమానందం బంగ్లా—దాని ముందుగా వొంకర్లు తిరిగి కొంతదూరం వెళ్లాక చిక్కబడ్డ జుట్టులో పాపిటలా గమాయమైన ఎఱ్ఱరోడ్డు—అన్నీ అగుపడు తున్నాయి. ప్రేమానందం బంగ్లాముందు పెద్ద పెద్ద చెట్లు నాలుగైదున్నాయి. వాటిల్లో వొకదానికి వుయ్యాల వ్రేళ్లాడుంది. ఆ వుయ్యాలపై నిర్మల కూర్చుంది. ఎవరో ముసిల్ది వుయ్యాల వూపుతోంది.

నిర్మలనుగురించి అక్కడ జనం వింతగా చెప్పుకుంటున్నారంటే ఆశ్చర్యమేముంది! అక్కడందరూ మొగాళ్లు,-- పైగా బ్రహ్మచారులుగా వుంటున్నారు. నిర్మల ఎంతో అందమైంది. శరీరం పల్చగా, నీరసంగా కనబడ్డా, అందులో యవ్వనం అపాదించిన వికాసం, బలంకూడా వున్నాయి. బలుపుతో స్ఫుటంగా కనబడనివి రొమ్ములొక్కటే. మొహంలో—ముఖ్యంగా కళ్లల్లో—అలుముకున్న విషాదచ్ఛాయలు యవ్వనాన్ని కొంత వరకూ కప్పిపుచ్చాయనక తప్పదు. సంధ్యకోసం వేచివున్న శరీరఛాయ నిర్మలది. వెన్నెలని కాంక్షించి అలిసిపోయిన వెర్రి తృష్ణ; అడివంతా అల్లుకుపోయిన జీవజ్వాల; ఆమె కను విప్పితే జ్వాల నిల్చిపోతుంది; వెన్నెల నక్షత్రాలని ప్రదర్శించి బుర్ఖా వేసుకుంటుంది. నిర్మల వొంటిదై, ఆకలి దప్పులు తీరక అల్లాడిపోయి, వెన్నెల వెలుగు, అడివిబలం తనే శరీరంలో సృష్టించి, పొంగించి, ఎదుర్కునే శక్తి సృష్టిలేక, తనే హతమౌతుంది. అడివికాచిన వెన్నెల. వెన్నెలనే కాల్చిన అడివిమంట నిర్మల.

నా మనస్సు ఎల్లాగో ఐపోయింది. తన సౌందర్యం ధ్వంసం చేసి, హరింపచేసేవారు లేక తను ఆత్మహత్య తలపెట్టిందా అనిపించింది. సౌందర్యం తన మెరిసిపొయ్యే నేత్రాలని వుంచుకోలేదా? ఇవన్నీ భ్రాంతులని తెలుస్తోంది. మానవుడి ప్రవర్తనకి మల్లేనే, మానవుడి వూహకూడా చిత్రమైంది. వూహలే యథార్థాలైతే, మానవుడి హృదయం, ఆశ్చర్యంతో పగుల్తుంది. సౌందర్యం నిర్మలలో యథార్థమైంది. తన శరీరం పగలగొట్టుకుంటోంది—ఆమెశరీరమే హృదయం గనక.

ఈ భావాలతో నాకళ్లు చెమ్మగిల్లినై. అది ఏడ్పురాని బాధ; కన్నీరు లేని కారుణ్యం; సజీవమైన జాలి. ఇది మావాళ్లతో చెబితే నవ్వుతారు. నన్ను పిచ్చివాడికింద కడతారు; నామీద గురి తప్పుతుంది; నన్ను గౌరవించరు; హేళన చేస్తారు. ఒక విషయం తేలిపోయింది. నిర్మలెప్పుడూ మరణించదని. ఆమె వొక్క సంవత్సరమో, నెలో, వారమో, గంటో, క్షణమో, ప్రజ్వరిల్లి జీవించడానికి సంకల్పించింది. ఒక్కసారి ఆ వేదనలో, సర్వశక్తులు ధారపోసి, ఆనందంలో హతమౌతుంది నిర్మల జీవించడం అంటే మరణించడం. ఆత్మహత్యాయత్నాలు అల్లా జీవించడానికి ఆమె చేసే యత్నాల చిహ్నాలు.

కొండదిగి క్యాంప్ వేపు నడవడం సాగించాను. ప్రేమానందం, బంట్రోతు వెడుతున్నారు. మావాళ్లు అలిసిపోయి, రెండోసారి స్నానాలకి సంసిద్ధులౌతున్నారు. అందరం చెఱువుకెళ్లి స్నానాలు చేశాం. చెట్లనీడలమధ్య నీళ్లు చల్లగా వున్నాయి. శరీరాల్ని కడిగి పవిత్రంచేసే, నిర్మలజలం. మళ్లా నిర్మల!

భోజనాలదగ్గరే, నిర్మల చేసిన రెండో యత్నంగురించి రాఘవులు ప్రారంభించాడు. కాని నాకు తప్ప, యితరులెవ్వరికీ వినేటందుకు వోపిగ లేదు. కాసేపు పడుకుని లేద్దామన్నారు. సరేనన్నాను. టెంట్ లో హోల్డాల్ విప్పుకుని పడుకున్నాను.

నేను లేచేటప్పటికి నాలుగైంది. అప్పటికప్పుడే మామిత్రులందరూ ఆఫీసుపనిలో పడ్డారు. ఆ చెట్లకిందే ఆఫీసు. కాగితాల కట్టలు, ఫైల్స్, ట్రేలు, డవాలిబంట్రోతులు అటూ యిటూ తిరగడం - నాకు నవ్వొచ్చింది. ఆ వుద్యోగిబృందాన్ని చూస్తూ కూర్చున్నాను. ఇంతలో పెట్టిబండి రావడం, టపాల్ అందుకోడం - వారి జీవితంలో అదొక చరిత్రాత్మకఘట్టం. వార్తాపత్రికలు, మాగజీన్స్ వొచ్చాయి. నాముందు వో పత్రిక పడేశారు. గురవడు బ్రెడ్, స్లైసెస్ కింద తరిగిపెడుతుంటే, నేను వొక్కొక్కటే టీలో ముంచుకుని తింటూ చదువుకుంటున్నాను. గంట జరిగింది, ప్రేమానందంతోబాటు మిగతవారందరూ లేచారు.

"ఏమండీ, మీ కిక్కడెట్లా వుంది?" అని అడిగాడు ప్రేమానందం.

"చాలా బాగుందండీ— అప్పుడప్పుడు నాగరికతలోంచి యిట్లా పారిపోకపోతే, జీవితంపై విరక్తి పుడుతుంది." అన్నాను.

"మీ విషయంలో అంతే అనుకోండి. మేం మట్టుకు, అప్పుడప్పుడు, యీ అడివిలోంచి నాగరికతలోకి పారిపోతూండాలి." అని నవ్వాడు. మిగత వుద్యోగులందరూ అతని 'జోక్'కి నవ్వడం సాగించారు.

"పులివేటకోసం యిక్కడ మీరందరూ మకాం చేశారుటగా. మీ రిదివరలో, పులుల్ని వేటాడారా?" అని అడిగాను.

"నేను నీలగిరి ప్రాంతంలో కొత్తగా పనిలో ప్రవేశించిన రోజుల్లో వేటకి వెళ్లాను గాని, పులిని ఎదుర్కోడం జరగలేదు" ఆయన యింకా చెప్పబోతుంటే మధ్యలో రాఘవులు అందుకున్నాడు.

"అవును, మధుసూదనంకూడా అప్పుడు అక్కడ వారివద్దే పనిచేస్తూ ట్రైనింగ్ అయ్యాడు. మధుసూదనం పులిని పొదల్లో నిద్రపోతుంటే చూశాట్ట. నిద్రపోతున్న పులిని చంపడం ధర్మంకాదని, వొచ్చేశాడు. అవునా మధూ?"

"అవుతే మధుసూదనం అసాధ్యుడన్న మాటే" అన్నాను. మధుసూదనం అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు మౌనంలో పడ్డాడు.

అప్పుడు అతన్ని వుద్దేశించి శ్రీహరి యిల్లా అన్నాడు.

"మధుకేం—మధు ఎంతకేనా తెగించగల్డు. పెళ్లాం పిల్లలు లేరుగనక."

అందరూ నవ్వారు. మధుసూదనంపై ఛలోక్తులు ప్రయోగించి వినోదించడం, వారందరికీ పరిపాటైపోయింది.

"అదేవన్నమాట, పెండ్లిండ్లు జరిగిన మేం అందరం సాహసులం కామంటావా? సంసారం అంటే పులినోట్లో తల దూర్చడం కాదూ?" అన్నాడు మా రెడ్డి.

అందరూ బిగ్గరగా నవ్వారు. ప్రేమానందం నవ్వడానికి యత్నంమాత్రం చేసి విఫలుడయ్యాడని నా అనుమానం.

"చీకటి పడకముసుపే, మా యిల్లు చూద్దురుగాని రండి." అని ప్రేమానందం నన్ను ఆహ్వానించాడు.

నేనంగీకరించాను. రెడ్డి, నేను, ఆయన, వారి బంగళాకేసి నడవడం సాగించాం. మిగతావాళ్లు వెనక దిగడ్డారు.

"మధుసూదనం పులిని చూసినట్లు నాతో చెప్పలేదు. చిత్రం. ఇప్పుడు మీరందరూ వింటుంటే వినడమే" అన్నాడు ప్రేమానందం.

(46 వ-పేజీ చూడుడు)



పారిశ్రామికులు - భూమిదార్లు

శ్రీ వేలూరి సహజానందం

ఇటీవల ఒక కొత్తసిద్ధాంతం బయలుదేరింది. యుద్ధానికి పూర్వం ధనికులుగా ఉన్నవారు ఇప్పుడు నిర్ధనికులయ్యారని, అప్పటి బీదసాదలు ధనికులపతనంమూలంగా ధనికులయ్యారని; పారిశ్రామికులు, పెట్టుబడిదార్లు ధనహీనులై, రైతాంగం ధనాఢ్యులయారని ఈసిద్ధాంతులు నిర్వచిస్తున్నారు. ఈ గాలి ప్రభుత్వపు వెపులకు కూడా సోకింది. గవర్నరు జనరల్‌నుంచి మంత్రులదాకా ఈ రహస్యాన్ని ఈ మధ్య బట్టబయలు చేస్తున్నారు. ఈ కొత్తసూత్రం మీద ఆధారపడి, ఆర్థికవిధానాలను ఏర్పరుస్తున్నారు. ఇందుకు ఉదాహరణ, మద్రాసు ప్రభుత్వంవారు రు 10 లు, ఎక్కువ శిస్తు ఇచ్చే రైతాంగంనుంచి నిర్బంధంగా వారిచ్చే శిస్తుకు సమానమైన డబ్బును అప్పుగా తీసుకోవాలని సంకల్పించటం. ఇలా వారాశించే డబ్బు, రు 6 కోట్లు.

యుద్ధకాలంలో పారిశ్రామికులు, పెట్టుబడిగార్లు పొందిన లాభనష్టాలు చూస్తే, వారు నిర్ధనికులయ్యారో, కుబేరులయ్యారో గ్రహించవచ్చును.

ఇంక గడచిన పదేళ్లలో ఎగవేసిన పన్నుల బాపతు సుమారు రు 500 కోట్లు అని కొంతమంది, ఇంకెక్కువ అని మరికొంతమంది లెక్క వేస్తున్నారు.

గడచిన సంవత్సరం వస్త్రవ్యాపారులు పాకిస్తానుతో చేసిన 'బ్లాక్‌మార్కెటు' వ్యాపారంద్వారా రు 100 కోట్లు సంపాదించారని ఒక అంచనా.

ఇటీవల పంచదారసందర్భంలో బ్లాకు-మార్కెటువారు రు 17కోట్లు సంపాదించారని ఒకరి లెక్క.

1948 మార్చిలో, 1949 మార్చిలో పారిశ్రామికులకు ప్రభుత్వం ఒనగూర్చిన పన్నుతగ్గింపులమూలంగా, ప్రభుత్వానికి రు13.72 కోట్లు ఆదాయం తగ్గింది.

ఈ సందర్భంలో ఒక విషయం మరువకూడదు; పరిశ్రమలకు ఆదినుంచి ప్రభుత్వం చేస్తున్న సహాయం. స్వదేశీ ఉద్యమఫలితంగా పరిశ్రమలు బలపడినయ్. 1924 నుంచి ఇనుము, ఉక్కు, 1926 నుంచి వస్త్రపరిశ్రమ, 1931 నుంచి పంచదార, 1925 నుంచి కాగితం, 1928 నుంచి నిప్పుపెట్టె పరిశ్రమలు ప్రభుత్వపు 'రక్షణ' సంపాదించటం ఆరంభమైంది. ఈ 'రక్షణ' భారమంతా ప్రజలు చెల్లించుకుంటున్నారన్నమాట.

కాబట్టి స్వదేశీపరిశ్రమలని ప్రజలు ప్రభుత్వం చేసిన, చేస్తున్న సహాయానికి బహుమానంగా పెట్టుబడిదార్లు, పారిశ్రామికులు విపరీతమైన లాభాలద్వారా, ఎగవేసిన పన్నులద్వారా ప్రజలను, ప్రభుత్వాన్ని దోపిడీచేశారు.

పెట్టుబడిదారు నిర్ధనికులయ్యారో, కుబేరులయ్యారో అనే ప్రశ్నినింతతో విడిచి ఇంక రైతాంగపరిస్థితి చూద్దాం.

బాంకింగు ఎంక్వైరీ కమిటీ అంచనా ప్రకారం, 1928 కి దేశంలో రైతాంగపు ఋణభారం మొత్తం—రు 1000 కోట్లు.

పరిశ్రమల లాభాలు:— * పరిశ్రమలు.

(1928 లో లాభాలు 100 అనే ప్రమాణం ప్రకారము)

సంవత్సరం.	1) పత్తి.	2) పంచదార.	3) ఇనుము, ఉక్కు.	4) బొగ్గు
1939	154.5	179 4	289 3	139.1
1940	220.1	180.0	300.7	140.2
1941	489 1	247.3	387 3	114.9
1942	758.6	227.5	402.2	112.9
1943	988.6	283.1	323.8	134.1
1944	760.5	232.4	341.4	316.8
1945	681.1	193.1	348.3	360.6
1946	680.5	175.0	324.7	278 8

(ఇతరవిధాలుగా వచ్చిన లాభాలుకాక).

* (ఆర్థిక సమీక్ష. అ. భా. కాం. క. ఢిల్లీ).

లాభాల వృద్ధి:—

యుద్ధంనాటికి.	54.5%	79.4%,	3 రెట్లు,	39.1%
1946 కు. (1939 లో కంటె)	$4\frac{1}{2}$ రెట్లు. (41-'44)	50%	12%.	2 రెట్లు

తర్వాత వచ్చిన 'డిప్రెషన్' ఫలితంగా, ఈ మొత్తం ఇంకా వృద్ధి చెంది ఉండాలి.

మద్రాసురాష్ట్రంలో రైతాంగపు పరిస్థితిచూద్దాం.

సంవత్సరం	ఋణంకోట్లు
1935	204
1939	271.9
1945	217.7

(పి. సత్యనాథన్, డా. బి. నారాయణ స్వామి నాయుడురిపోర్టుల ప్రకారం)

1935 లో కంటె 14 కోట్లు పెరిగింది. 1939లో కంటె 54.2 కోట్లు తగ్గింది. 1939, 1945 మధ్య (టోకు) మొత్తం తగ్గింపు, రు. 81,56,00,000. ఈ తగ్గింపు ఎలా జరిగిందో పరిశీలించాలి.

1. ప్రభుత్వపు అప్పు తగ్గింపుచట్టప్రకారము	9,95,07,022
2. పొలాల అమ్మకం వలన	46,86,97,000
3. పంటల అధికధరల మూలంగా	24,73,99,978
మొత్తం తగ్గింపు	81,56,00,000

పంటల ధరలు పెరగటంమూలంగా, మొత్తం తగ్గింపులో $\frac{1}{3}$ వంతు కూడా తగ్గలేదు. ప్రభుత్వచట్టం మూలంగా $\frac{1}{3}$ వంతు మాత్రమే తగ్గింది. ఉన్న పొలాలను అమ్మబట్టి సగంపైన తగ్గింది.

కాబట్టి అధికధరలమూలంగా సామాన్య రైతాంగపు ఆర్థిక స్థితి అనుకొన్నంతగా చక్కబడలేదు. ఇంక ఈ రైతాంగంవద్ద డబ్బు మూల్గుతోందని అనుకోటం భ్రాంతి కాదూ?

ఈ సందర్భంలో ఒక విషయం గమనించాలి. 25 ఎకరాలు, ఇంకెక్కువ ఉన్నవారు బాగా బాగుపడ్డారు.

భూస్వాముల నికరాదాయం
(సగటుకుటుంబానికి)

	నికరాదాయం 1939 రు.	నికరాదాయం 1945 రు.
1. 25 ఎకరాలు ఇంకెక్కువ ఉన్నవారు	652.7	1118.9
2. 25 ఎకరాలకుతక్కువ, 5 ఎకరాలకు ఎక్కువఉన్నవారు	121.4	117.2
3. 5 ఎకరాలకు,తక్కువ ఉన్నవారు	7.9	0.9

(సగటుకుటుంబఆదాయం ఖర్చులుపోను)

ఈ తరగతులవారి సగటువ్యక్తిఅప్పు:—

	1939 రు.	1945 రు.	తగ్గింపు %
1.	188.5	113 3	40
2.	78 8	59 4	24 6
3.	42.8	37.6	12.3

కాబట్టి 1939-45 మధ్య మొదటి తరగతివారి అప్పు 40% తగ్గి, నికరాదాయం 71% పెరిగింది. మిగతా తరగతులవారి ఆదాయం తగ్గి, అప్పు ఇంకా 75% నెత్తిమీద ఉంటోంది.

(ఈ విషయాలకు డా. బి. వి. నారాయణ స్వామినాయుడురిపోర్టు ఆధారం)

రాష్ట్రంలో మొదటితరగతివారి అప్పు, రు 28.5 కోట్లు; మిగతా తరగతులవారి అప్పు రు 173.5 కోట్లు. అంటే ఋణంలో అత్యధికభాగం 25 ఎకరాలకు తక్కువఉన్నవారిదే. కాబట్టి రైతాంగంలో 25 ఎకరాలకు, ఎక్కువ ఉన్నవారివద్దనే డబ్బు ఉండిఉండాలి. 100 కి 96 గురు 25 ఎకరాలకు తక్కువఉన్నవారే.

25 ఎకరాలకు, ఎక్కువఉన్నవారివద్ద కుటుంబానికి సగటున రు 250 చొప్పున రు 6 కోట్లు ప్రభుత్వం అప్పుగా తీసుకోవచ్చు.

ఇప్పుడు జమీందార్లకివ్వనున్న (కనీసం) రు 12 కోట్లలో కనీసం మూడోవంతు అంటే రు 4 కోట్లు ప్రభుత్వానికి 'లోను'గా ఏర్పరుచవచ్చు.

× కాబట్టి రు 10 లు శిస్తును ప్రమాణంగా తీసుకోక, ఎకరాలను లెక్కలోకి తీసుకోవాలి.

× రాష్ట్రరైతాంగం అన్ని ప్రాంతాల్లోనూ సమపరిస్థితుల్లో లేరు. ఒకచోట ఆదాయం హెచ్చు. మరొకచోట తగ్గు. ఈ వ్యత్యాసాలనుకూడా గమనించాలి. డబ్బు వచ్చే పంటలు పండించేవారు రైతుల్లో ధనికులు.

ఈ పై పరిశీలనబట్టి రైతాంగంలో 100కి 96 గురు అధికధరలమూలంగా ఇంకా అప్పులుకూడా ఎక్కువభాగం తీర్చుకోలేకపోయారని, వారివద్ద నిల్వధనం లేదని స్పష్టమవుతోంది.

మన రాష్ట్రంలో ప్రభుత్వం తమ మొత్తపు ఖర్చులో 4% మాత్రమే వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. (రు 1.36 కోట్లు)—ఆహారసమస్యకే అత్యధికప్రాముఖ్యత ఇస్తున్నామన్నప్పటికీ. (ఎకానమిక్ వీక్లీ—బొంబాయి).

మనరాష్ట్రంలోని భూమిదారులస్థితి ఇంచుమించు ఇతరరాష్ట్రాల్లోనూ ఉంటోంది. 100కి 96 రైతులు మొత్తం రైతాంగపు అప్పులో దాదాపు 88% తో కుంగికృశిస్తుంటే, వారివద్ద డబ్బు ఎలా మూల్గుతోంది?

మన రాష్ట్రంలోని పెట్టుబడిదార్లవద్ద, వ్యాపారులవద్ద 100 నుంచి, రు 400 కోట్ల దాకా గుప్తధనం ఉందని ఒక అంచనా.

గడచిన ఏడాదిలో ప్రభుత్వం (కేంద్రం) నియమించిన 'డివిడెండు' ప్రమాణందాటిన లాభాలు వచ్చినయ్-కొన్ని పరిశ్రమల్లో.

రైతాంగం ఎక్కువగా ఉన్నరాష్ట్రం సంయుక్తరాష్ట్రాలు (యు. పి.) అచటి రైతాంగస్థితికూడా పరిశీలిద్దాం:—

ఎకరాలు.	మొత్తంభూమిదార్లలో 100 మందికి	మొత్తంభూమిలో %
0—1 ఎకరం వరకు ఉన్నవారు	37.8	6.2
1—3 ఎకరాలు	29.6	16 8
3—6 ,,	18.0	22 8
6—12 ,,	10 2	24.8
12 ఎకరాలకుపైన	4.4	29.4

100 మందిలో 4.4 మందికే 12 ఎకరాలకెక్కువ ఉన్నయ్. 100 కి 67 గురు 3 ఎకరాల, లోపు ఉన్నవారు. భూమిలో దాదాపు మూడోవంతు పెద్దభూమిదార్ల అధీనంలో ఉంది. రైతుల్లో అధికసంఖ్యాకులు ఖర్చులు పోను అప్పేతీరని పరిస్థితుల్లో

(43 వ పేజీ చూడుడు)

తేదీలోగా ఆంధ్రరాష్ట్రం వచ్చే సూచన ఉన్నదా? ఆశాకిరణం ఏమైనా ఉన్నదా? అని అడిగితే, "ఆశాకిరణం ఏమిటి? ఆశాజ్యోతి కన్పిస్తోంది" అన్నారు. ప్రకాశంగారికంటె, ప్రకాశంగా చెప్పిన కళా వారికీ జై! అన్నారు.

ఆ ప్రకాశంలోని అంశగా ఆ జ్యోతిలోని అంశగా ఆంధ్రకళావికాసం పెంపొందవలసి ఉంది. ఏనాడో ఎల్లోరా అజంతా గుహలను అలంకరించిన ఆంధ్రకళ నేడు కొండగుహలలో దాగిఉంది. ఇటీవల హైదరాబాదుసంస్థానంలోని ఔరంగాబాదుకు వెళ్లి యీ అద్భుతశిల్పములను ఈ అద్భుత చిత్రములను చూచి గవర్నరు జనరలు సి. రాజగోపాలాచారిగారు కూడా ముక్కుమీద వేలువేసుకొన్నారు. ఇటువంటి ఆంధ్ర ప్రతిభను ఆశీర్వదిస్తూ, హైదరాబాదుసంస్థానం "స్థిరోభవ! వరదోభవ!" అన్నారు. ఈ సంస్థానంలోనుంచి తెలింగాణా విడిపోతే, సంస్థానం చెడిపోతుందని ఆచార్యులవారి ప్రవచనం

ఆచార్యదేవో భవ అనే రోజులుమాత్రం పోయినవి. కాని, తాతాచార్యులవారి ముద్ర బుజం తప్పినా వీపు తప్పదని ఆంధ్రులు చిరకాలంనుంచీ అంటున్నమాట. ఆఖరుకు ఆ ప్రకారంగానే జరిగింది. మద్రాసునగరం ఆంధ్రులు వదలుకోవలెనని ఆచార్యవాక్యంగా ఆంధ్రదేశమంతా కర్ణార్ణికగా న్నవి దా లేదా! కాదుకూడదని ఆంధ్రలోకం ఆర్భాటం చేసిందా లేదా? "మద్రాసు నగరం మాదే" అని ఆంధ్రులు భారతదేశం అంతా చాటించి మద్రాసు వీధులలో నేభరత నాట్యంచేశారా లేదా? ఆఖరుకు ఏమైందివీ యీ భాగవతమంతా? "రంగా! రంగా! ఏదీ గతి మాకు" అని మద్రాసు మహానగరంవిడిచి, ఎక్కడరామా ఆంధ్రుల రాజధానీ నగరం? అనిదిక్కులు నిక్కి చూచుచు, చెన్నగరాంధ్రులు కాందిశీకులుగాను, రాష్ట్రేతరాంధ్రులుగాను అయినారా లేదా? "మద్రాసునగరం మాది! మాది కూవంనదీతీరం!" అని చిందులు త్రొక్కడం కంటె, చిరకాలంనుంచీ మన వీధిభాగవత రంగస్థలంలో అన్నట్లుగానే "మాది కూచిపూడి అగ్రహారం. మాది కృష్ణాతీరం" అని చిందులుత్రొక్కి తధికిణతోం అన్నట్లయితే, అరవవాళ్లు కూడాఆనందించేవారు. మన కూచిపూడి భాగవతులే, తంజావూరువరకు వెళ్లిఅచటి అరవవారికి మన భామకలాపములను నేర్పినట్లుగాను వారు మనలను గురుతుల్యలనుగా భావించి నేర్చుకొన్నట్లుగాను సాక్ష్యాధారాలు స్పష్టంగా ఉన్నాయి. మాది కృష్ణాతీరం అన్నంతకాలమూ, మన గౌరవం మనకు ఉంది. అటువంటి సందర్భంలో మాది కూవంనదీతీరం అనడంకంటె కృష్ణార్పణమని కూవంనదీతీరం విడిచి కృష్ణాతీరం చేరడమే ప్రశస్తం.



అయినా, "అనువుగానిచోట అధికుల మనరాదు" అని మన రెడ్డిగారు, అనగా వేమన రెడ్డిగారు, ఉపదేశించిరి. అందులో చాలా అంతరార్థం ఉంది. అనువుగానిచోట అధికుల మనరాదు అనే మాట నిజమే. కాని, అధికులము కానిచోటకూడా మనకు అనువు కాదు అని గ్రహించాలి. చెన్నపురిలో ఎవరు అధికులో ఎవరు హెచ్చుగా ఉన్నారో లెక్కలుచూచి మరీ మీసం దువ్వాలి. మనం మీసములు దువ్వినా దువ్వకపోయినా మీ సములము మేము అని అరవవారికి లెక్కలు చూపడం కష్టం. బ్రహ్మపురి మొదలు చెన్నపురి వరకు మనదే అన్నాం. కాని చెన్నపురి అరవలకు పోయింది. బ్రహ్మపురి (బరంపురం) కళింగులకు పోయింది. తెలుంగులకు మిగిలింది ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసోర్వీతలము మాత్రమే. "అరవలు కోరిన దర్పించంగా, ఓఢ్రులు మింగిన దుచ్ఛిష్టంబై, మిగిలినదే మన తెలుగు సీమరా!" అనే బాణిలో మన ఎల్లలు తేటతెల్లమైనవి. ఇంకా హైదరాబాదుసంస్థానంలో ప్రస్తుతం ఇమిడియున్న తెలింగాణా మనకు చేరవలెననే కోరిక లీరికలెత్తుచున్నవి. అప్పుడు హైదరాబాదునగరం మన భాగ్యవశమున మన నగరమే అయితే తొల్లింటి నామకరణమే చేసి, భాగ్యనగరం అని అల్లారుముద్దుగా పిలుచుకోవచ్చు. కాని, ఆ తెలింగాణా మనకు యింకో సంక్రాంతికైనా సంక్రమించే భాగ్యం ఉన్నదో లేదో! ఉత్తరకుమారప్రజ్ఞ లెన్ని పల్కినను ఉత్తరక్షణం మనది కాదు.



ఉత్తరాయణపుణ్యకాలం ప్రవేశించిన తర్వాతనైనా మన కోరికలు ఉత్తవగునా? అనే ఉల్లాసం ఉన్నది. ముందున్న వాంధ్ర వికాసవిలాసవిశేషముల్ అని ఉప్పొంగని ఆంధ్రుడు లేడు. కృష్ణవేణీతరంగిణి ఆన

పొంగళ్లు



"మీ పాలు పొంగుతాయి. మీ పంట పండుతాది. మీ మాట జయమౌతాది. మీ రొక పెద్దకోరిక కోరుతుండారు. ఏడుకొండలవాడు మీ పాలిట ఉన్నాడు. కొండంత కోరిక కొండెక్కుతాది. అంబా పలుకవే జగదంబా పలకవే." అని తెల్లవారుజామున వాకిలిగుమ్మం లోనికి వచ్చి ధనుర్మాసంలో ధన్యవాదములు పల్కిన బుడబుడక్కలవాని జోస్యం హుళక్కి కాదని వీనుల విందుగా విని మననం చేసికొనెడి ఆంధ్రుడు కొంచెం పొంగి గుప్పెడు బియ్యం వానికి వెయ్యక మానడు.

"హరిలోరంగ హరి! హరిలోరంగ హరి! పరాకు సేయుట పాడిగాదురా, పరమపురుష వరదా! సాధులపాలిటి సౌభాగ్యంబని చాల నమ్మినారా! పరాకుసేయుట పాడిగాదురా!" అని ఒకచేత చిరుతలు పుచ్చుకొని రెండవ చేతిలో పెద్ద రంగులవిసనకర్ర పుచ్చుకొని గజ్జెలుకట్టిన కాళ్లతో చిందులు త్రొక్కుతూ తిరుమార్ణంతో ద్వాదశోర్ధ్వపుండ్రములు ధరించి, గండభేరుండంచుగల ధోవతీ, లాగూ తొడిగినట్లుగా. రెండువైపుల విరిచి కట్టి, గుమ్మడికాయఆకారంగా వుండే యెర్రని రాగిఅక్షయపాత్రను తలమీద కుదురుగా పెట్టి, ధన్యాసిరాగంలో ఆ సాతాని వైష్ణవవిరాగి భజన చేస్తూ గుమ్మంలోనికి వస్తే ధన్యోస్మియని ఆ ధన్యాసి కీర్తనకు చెవులొగ్గి, దోసిలొగ్గి, బియ్యము తెచ్చి భిక్ష

శ్రీ దాసు వామనరావు

పెట్టని ఆంధ్రుడైనను ఆంధ్రహరిజనుడైనను నూటికి కోటి కొక్కడుండు నేమో!

"బసవన్నా అలుగుతుండావా? డూ! డూ! బసవన్నా! దొరవారి జరీకండువా కావలెనా? ఏదీ! ఒక్క సలాము చెయ్యి ప్రభువులకు బసవన్నా! కాళహస్తికి పోతావా బసవన్నా? తిరుపతికి పోతావా బసవన్నా? పట్నంలోనే ఉంటావా బసవన్నా? దొరవారు మేలైన దుప్పటీ కప్పుతారు చెప్పు బసవన్నా!" అని గంగిరెద్దుచే త్రాడు లాగి తల యాడించి ఆ బాలగోపాలమును ఆనందింపజేసి వీధిగుమ్మములో పండుగపూట మంగళ వాద్యములు వాయించెడి గంగిరెద్దుల వాని సంబరముతీర అంబరదానముచేసి పంపెడి ఆంధ్రకుటుంబి ఆ బసవనాయకుని ఆశీస్సు లందుకొనుచుండును.

వాకిట గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడి పూలతో తల్లి గొబ్బెమ్మను, బంతి పూలతో పిల్ల గొబ్బెమ్మలను అలంకరించి, యింపు సొంపుగా ముగ్గులువేసి, రాసక్రీడావలయమువలె గొబ్బెమ్మలను ఆ రంగవల్లులపైన అమరించి ఆనందించెడి ఆంధ్రబాలికల కానందడోలికలు యీ సంక్రాంతి దినములు.

"వస్తాడే మా బావ! వస్తాడే" అని ఆనందించి ఆహ్వానించగల ఆడపడుచుగా ఆంధ్రమాత ఎదురుచూస్తోంది అని చెప్పవచ్చు. మా ఊళ్లో ఒక అమ్మాయి యీపాట సరిగ్గా అర్థంకాకపోవడంచేతనో, మాటలు ముద్దమాటలగుటచేతనో, లేక కొంటితనంచేతనో, మరే కారణం చేతనోగాని వాళ్ల బావను చూచినప్పుడు "వస్తాడే మాబావ వస్తాడే" అని పాడుతూఉండేది. వాళ్ల బావ వస్తాడైనా, కాకపోయినా పండుగకు బావ వస్తాడంటే మరదలుకు ఉత్సాహం ఉల్లాసం తప్పకుండా ఉంటుంది. బొమ్మలపండుగలో తానుకూడా చక్కని బొమ్మలాగు తయారై తన చక్కదనం తలపోసి తన భావికాలమున. కెదురు చూడడం మానవస్వభావం. "రేపో మాపో వస్తాడే, ఢిల్లీనుంచి వస్తాడే" అని ఎదురుచూచెడి ఆంధ్రహృదయానికి సంక్రాంతి కానుకగా, ఆంధ్రరాష్ట్రం తప్పకుండా లభిస్తుంది అని శ్రీ కళావెంకట్రావుగారు అన్నారు. బళా బళీ! కళావెంకట్రావుగారు బలే వెంకట్రావుగారు. 1950 సం॥ జనవరి 26



కట్టసుదాటి తన ధాటిచూపినట్లుగా, గోదావరీప్రవాహము రామపాదసాగరమై ప్రవహించునట్లుగా ఆంధ్రహృదయము యీ ఉత్తరాయణపుణ్యకాలములో తన ఉత్తరగతిని గుణించుకొని పొంగి యుప్పొంగి తన వీరులకు పొంగలి పెట్టుచున్నది.

ఈ సంక్రమణ కింత సంబరం ఎందుకు? మనకు సంక్రమించేది ఏమిటి? మనది మన కిచ్చుటే మడిమాన్యము లిచ్చుట యన్నట్లుగా ఉంది. అయినా, ఆంధ్రులు అల్పసంతోషులు. "తక్కువేమి మనకు మన రాముడొక్కడుండువరకు?" అని ఆ సీతారాములమీదనే భారంవేసి, జై! సీతారాం! అని మద్రాసు వదలకోమంటే వదలుకొన్నారా లేదా! పట్టాభి సీతారామయ్యగారు ఆమాట కాదని అనలేరు. "మీ మాటలు మంత్రంబులు" అన్నట్లుగా వారి నోటి వెంటవచ్చిన పదములే వేదప్రమాణములుగా విజయవాడలో స్వీకరించి మనకు ప్రియమైన మద్రాసునగరాన్ని గయలో వదలిపెట్టినట్లుగా వదలుకోమని ఉపదేశించిన జేవిపి రిపోర్టును జేపరతుగా శిరసాగృహ్ణామి అపి ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు అన్నది. డాక్టరుగారిచ్చిన చేదుమాత్రలైనా వైద్యోనారాయణో హరిః అని ఆంధ్రులు మ్రింగినారు. ప్రాచీనావీతి చేసికొని చెన్నపురికి స్వధానమస్తర్పయామి అన్నారు. ఈ తర్పణ విడిస్తే జనవరి 26 తేదీలోగా మన పెద్దలందరూ తరిస్తారనే నమ్మకం లేకపోతే, ఇంత శ్రద్ధ ఎందుకు? మనం చేసిన కర్మకాండ అశ్రాద్ధం కాదు. "పాల ముంచినా నీటముంచినా, నీదు, పదములే గతి రమా!" అని వారి పదములే పరమపదసోపానములుగా స్వీకరించడమైనది. "నమ్మినవారి కెన్నటికి నాశము లేదిక యాంధ్రసోదరా!" అనే ధైర్యంతో ఆంధ్రులు వ్యవహరించారు.

మద్రాసు లేని ఆంధ్రరాష్ట్రమైనా దక్కితే చాలు ఎట్లాగైనాఅని, తల్లిప్రాణం ప్రధానంగా చూచుకున్నాము. పిల్లప్రాణం ప్రధానం కాదని డాక్టరుగారు అన్నారు. ఆంధ్రరాష్ట్రం వస్తే చాలు ఏడుకొండల వెంకన్నా అని మనస్సులో ఆవేదన పడ్డవాళ్లున్నారు. రాష్ట్రం రాగానే తిరుపతికి వెళ్లవలెననే సంకల్పం ఆంధ్రప్రముఖులకు కలిగింది. ఆ క్షేత్రం అటువంటిది. "కోరిక నీ దీరితే, కొండెక్కి తలమీది-కురులిచ్చి తీరాలి." మొక్కులు చెల్లించనివారు చిక్కులపాలవుతారు. మాటసందర్భం వచ్చిందిగనుక మా ఊళ్లో కన్పించిన దృష్టాంతరం ఒకటి విన్నవిస్తాను.

మా ఊళ్లో ఇట్లాగే ఒకసారి ఒక ఆంధ్రమిత్రుడు కొండెక్కి కురులివ్వక తప్పించుకొని తిరిగాడు. ఆయన బాగా గడించిన డి. పి. డబ్లియు. కంట్రాక్టరు. కాని పరమ లోభి. అయితేనేం? యుద్ధం రోజులలో యుద్ధఋణనిధికోసం యమయాతనపడి అష్టకష్టాలుపడి అపారంగా వసూలుచేసి జిల్లా కలెక్టరును మెప్పించాడు. అప్పటి బ్రిటిష్ అధికార్లకు ఆ కంట్రాక్టరు పేరు సిఫార్సు చేసి ఉత్తరాయణం వచ్చేనాటికి, అనగా కొత్త యింగ్లీషుసంవత్సరాది ఆరంభమై జనవరినెల వచ్చేటప్పటికి, ఒక మంచి బిరుదు యిప్పిస్తానని ఆశ పెట్టాడు. "ఏడుకొండలవాడా! ఏమి బిరుదు యిప్పిస్తావో నీ దయ! నీ లాలు నీకిచ్చి నీ మొక్కు చెల్లిస్తా"నని ముడుపు కట్టుకున్నాడు. కొత్త ఇంగ్లీషుసంవత్సరం వచ్చేసరికి పత్రికలో ఆయనపేరు కన్పించింది. రాజారావుగారికి రావుసాహెబు బిరుదు యిచ్చారు. కాని అంతకన్నా పెద్దబిరుదు 'రావుబహదూరు' వస్తుందని రాజారావుగారు ఆశపడ్డారు. కాని, ఎక్కడికక్కడికే సంతోషపడే ఆంధ్రుడుగనుక చేయునదిలేక 'రావుసాహెబు'తోనే తృప్తిపడ్డాడు. కాని, ఏడుకొండలవాని మొక్కు ఎందుకు చెల్లించడం అని అశ్రద్ధచేశాడు. ఇక చూచుకోండి— క్రమేణ ఆయన తలలో చుండువ్యాధి ప్రవేశించి తలవెంట్రుకలన్నీ తినివేసింది. సాఫ్ చీదాగా బట్టతల అయింది. ఆ బట్టతల అయినా అందంగా లేదు. అక్కడక్కడ బ్రహ్మజెముడు కంచెలవలె దుబ్బులు దుబ్బులుగా జుట్టు మిగిలివుంది. మిగిలిన ప్రదేశాలలోని జుట్టు ఔషధసేవవల్ల పెరుగుననే ధైర్యంతో ఉన్నవాడై ఆ జుట్టుదుబ్బులను ఉన్నవి ఉన్నట్లుగానే ఉంచాడు. మా ఊళ్లో వున్న సులేమాన్‌గారు మంచి యూనానీ హకీం. ఘనవైద్యుడు. రాజారావుగారికి ఎన్ని మందులిచ్చినా లాభం లేకపోయింది. ఎటువంటి కేశవర్ధనియైనా లవలేశమైనా పని చేయక వ్యర్థమైనది - అందువల్ల "ఇక నీకు వెంట్రుకలురావు సాహెబ్!" అని రాజారావుగారితో హకీం అన్నాడు.

అక్కడ ఉన్న మరికొందరు పెద్దమనుష్యులు "వెంట్రుకలు రావు సాహెబ్" అనే మాట విని, ఆయనకు రావుసాహెబ్ బిరుదు ఎందుకువచ్చిందో అప్పుడు గ్రహించారు. ఏడుకొండలవాని మొక్కు యేవిధంగానైనా చెల్లింపక తప్పదు.


అంతేకాదు. ఆబిరుదుకు అప్పుడున్న విలువ, అప్పుడున్న గౌరవంకూడా యిప్పుడు రాలిపోయింది. ఇప్పుడు రావుసాహెబ్బు అన్నా, అత్తరుసాహెబ్బు అన్నా, ఒక్కటే కాలచక్రం తిరిగిపోయింది.

"డామిట్! కథ అడ్డం తిరిగింది" అన్నట్లయింది. గౌరవార్థంగా "డీలిట్" బిరుదు యిచ్చినా డామిట్ అనే రోజులుకూడా వస్తాయి - కాని, యిటీవల పూరీజగన్నాథంలో గవర్నరుజనరలు రాజగోపాలాచారిగారికి కొత్తబిరుదు యిస్తామన్నారు. పూరీ పండితబృందం అంతాకలిసి ఆయనకు జ్ఞానభాస్కరుడు అనే బిరుదం ఇస్తామంటే ససేమిరా వద్దని నిరాకరించారు. ఆబిరుదు యిచ్చేటటువంటి హిందూపండితపరిషత్తుకు ఆబిరుదుదానంచేసే అధికారం లేదన్నారు. కాని, ఇచ్చేవారికి అధికారం లేదో, పుచ్చుకొనేవారికి అధికారం లేదో ఆజగన్నాథునికే తెలియాలి. అయినా, ఆయనకు భాస్కరబిరుదం ఇచ్చినంత మాత్రంచేత ఆయనను స్మరించి మరొక భాస్కరశతకం వ్రాసే కవి యీకాలంలో ఉంటాడని తోచదు. రాయనమంత్రి భాస్కరుడు గుణింతములు నేర్చుకొనెడి బాల్యదశలోకూడా "ల"కు ఏత్వమివ్వ నేరడు. "ద"కు కొమ్మిచ్చి ఎరుగడు. కాని, శ్రీమాన్ రాజగోపాలాచారిగారు విశాఖపట్నంలో ఉపన్యసిస్తూ నాచేతిమీదుగా ఆంధ్రరాష్ట్రమును మంజూరు చేస్తూ ఫర్మానా జారీచేయవలెననే ఉబలాటం తనకు లేదు అని స్పష్టంగా చెప్పారు. ఆయన కటకంలో ఉపన్యసిస్తూ భాషారాష్ట్రములేర్పరచుట బుద్ధితక్కువ పని అన్నారు. మనలను రాష్ట్రంకోసం తత్తరపడవద్దన్నారు. నెలలునిండనిదే బిడ్డకావా

(38 వ పేజీచూడుడు)



"హరిలో రంగహరి" సంక్రాంతి జియ్యరు



తంబుర దాసరి



పాలవిద్య చేస్తున్న గంగిరెద్దుల బాలుడు




పంబజోడు

మన పల్లెపట్టుల

సంక్రాంతి దృశ్యాలు



వరిధాన్య మెంత ఉపయోగమో, వరిగడ్డికూడా అంతఉపయోగమే!





కొత్త పనలు

కథానిక:



విలయము

శ్రీ వి. డి. ప్రసాదరావు

★

(సముద్రపు హోరు సన్నగా వినబడుతూంటుంది. మధ్య మధ్య ఒక చిన్న ఉరుము.)

రామదాసు: శ్రీరామ, శ్రీరామ, రామా! రాజీవలోచనా! పుండరీకాక్షా! రామా! ఆహా రామచంద్రా.. ...

(భక్తిపారవశ్యంలో ఉన్న లబ్జులతో అంటూ వుంటాడు.)

పరదేశి: అయ్యా! మూడురోజులనుంచీ మా దంపతులను ఇల్లాగే అట్టేపెట్టి ఉంచారు. ఇవాళైనా యోగిగారి దర్శనం చేసికొని వెళ్ళిపోదామనుకొన్నాం. మీరు కటాక్షించరైతిరి. మబ్బులూ ముసురూ అంతకంతకూ ఎక్కువౌతున్నాయి.

రామ: (వినిపించుకోకుండా) రామా! దశరథరామ! జానకిరామ! శ్రీరామ!

పరదేశి: బాబూ, దాసుగారూ!

రాజారావు: హుష్! ఆగవయ్యా పరదేశీ. దాసుగారు భక్తిపారవశ్యంలో ఉన్నారు. ఇప్పుడు వారి ధ్యానానికి భంగం తేకండి.

రామ: ఆహా. ఆహా ధన్యుణ్ణిచేశావా రామా. దర్శనమిచ్చావా? ఓహోహో!

రాజా: (గారంగా) ఏమిటి దాసుగారూ? మాకు కూడా ఆ భాగ్యం కల్పించరూ.

రామ: ఎవరు, రాజారావుగారా? అడుగో, అడుగో. చూడండి. నీలమేఘశ్యాముడు, శ్రీరాముడు. ఎంత ప్రసన్నుడయి కనబడుతున్నాడో. చూడండి చూడండి. ఆహాహా చూడండి. వీరెవరూ, చూడండి బాబూ మీరు చూడండి. అడుగో అడుగో రాముడు! ఆఁ. ఆఁ! అయ్యో స్వామీ! అంతర్ధానమౌతున్నావా!

రాజా: ఔనండీ. ఏదో, లీలగా కనుపించినట్టే అయాడు. అయినా మాబోటి పాపాత్ములకు అంతకన్నా కనబడడేమోలెండి. ఏదో మీ సహవాసభాగ్యంవల్ల ఆ మాత్రమయినా లీలగా కనుపించాడు. మీరు చూడలేదండీ పరదేశిగారూ.

పర: బాబూ! మీ గురువుగారైన యోగిగారి దర్శనమే మాకింతవరకూ లభించలేదు, అల్లాంటి పాపాత్ములకు మాకు భగవంతుడు కనబడతాడా. మా పాపం ఇంకా పండందే. మీకు పుణ్యముంటుంది. ఈనాడైనా మాకు యోగిగారి దర్శనం చేయించండి.

రాజా: పరదేశిగారూ. మీరు వట్టిపిచ్చిని పడిపోతున్నారు. పేరుమాత్రానికి యోగిగారి శిష్యులన్నమాటే కానీండి, మా రామదాసుగారు యోగిగారికన్నా ఎన్నోరెట్లు మహత్యం కలవారు. వీరికి శ్రీరామచంద్రుడు ప్రత్యక్షదైవం. కో, అంటే పలుకుతాడు. అంతటివాడిని ఎదుటపెట్టుకొని, యోగిగారో, అంటూ వాపోతారేమండీ?

రామ: (ముసిముసినవ్వులు నవ్వుతూ) నిజానిజాలెల్లా ఉన్నా, మనం, ఆ మాట అనటం అపరాధమే రాజారావుగారూ. మాటవరుసకు చెప్తా. యోగిగారే నాతో ఒకసారి అన్నారుగదా— 'రామదాసూ, నువ్వు నాకన్నా ఎంతో పుణ్యుడవోయి. నీకు రాముడే ప్రత్యక్ష దైవమాయెను. ఎవరి బాధలు నివారణ చేయాలన్నా, ఆ ఆశ్రితజనరక్షకుణ్ణి నువ్వు ఇట్టే తలుస్తే చాలు. నాకో ఇంతవరకూ భగవంతుడు కనిపించనేలేదు. నా కర్మ ఇంకా పండలేదు. నిజానికి నువ్వే గురువ్వి, నేను శిష్యుణ్ణి కావలసింది. అంత గొప్పవాడవుసుమా నువ్వు.' అన్నారు. అంటే నేను అన్నానూ— 'తమ అనుగ్రహం తప్ప అంతమాటా. మీకూ ఎప్పుడో ప్రత్యక్షం కావల్సిందనే నా రాముణ్ణి కోరి గురుకట్నం చెల్లించుకుంటాను' అన్నాను. మనకు, లోకానికి సేవజేయటానికి తప్ప భగవంతుని అనుగ్రహం మనకోసమటండీ! ఏమంటారు?

రాజా: ఆహాహా. రామదాసుగారూ. నిజంగా ఎంత మహాత్ములండీ మీరూ. నా మాట నిజమైంది చూశారా. మహాత్యంలో యోగిగారూ మీకు చాలరన్నమాటే. చూశారయ్యా పరదేశిగారూ. ఎదురుగుండా ఉన్న నిక్షేపాన్ని వదులుకొంటున్నారు మీరు.

పర: బాబూ నమస్కారం. నేను పామరుడిని. ఏ పుట్టలో ఏ పామున్నదో గ్రహించగల సత్తా నా కెక్కడిది? ఈ సముద్రపు ఒడ్డున యీ యోగిగారి దర్శనం చేసికొంటే సర్వబాధలూ నివారణ ఔతాయని లోకమంతా అంటున్నారు. నా భార్యకు రోగమో, గాలో, పాడో, ఏవో తెలియటంలేదు. పిచ్చవాగుడూ, మంచి వాగుడూ కలిసిఉంటాయి. అల్లాగే నీరసించిపోతూంది. ఆ నీరసమ్మీద మొండితనం. రాజవైద్యాలు చేయించాను, భూతవైద్యాలు

చేయించాను. ప్రతి చెట్టుకూ పుట్టకూ మ్రొక్కాను. తీర్థక్షేత్రాలన్నీ తిరిగాను. ఇప్పటికి పదివేలు ఖర్చయాయి. ఇక్కడికి వచ్చాక మూడురోజుల్లో మీ యోగిమందిరంలో బసకూ, చందాలకూ, ముడుపులకూ మామూళ్లకూ, మూడువందలు చెల్లించుకొన్నాను. ఇంకా...

రాజా : (మట అడ్డుతూ) మందిరానికి మూడు వందలిచ్చారా? సరే. సరే. ఇక్కడికి వచ్చే బీదా బిక్కీ అందరికీ సదుపాయాలకోసం ఎవరిసత్తానుబట్టి వారు దైవకార్యానికి ధనం ఇయ్యటంగాని, ఏదో మాకోసం ఖర్చుపెట్టినట్టుగా మీరంటే ఎల్లాగండీ. మిమ్మల్ని ఇయ్యమని ఎవరన్నా నిర్బంధపరిచారా?

పర : నిర్బంధం లేదనుకోండి. కాని ఇయ్యక తప్పనిసరి ఔతూవచ్చింది. అయినా దానికోసం నేననడం లేదు. ఎన్ని వేలు ఖర్చయినాయిగాదు! నా భార్య మామూలుమనిషిగా అయితే నాకదే పది లక్షలు.

రామ : శ్రీరామ. శ్రీరామ. పరదేశిగారూ మీ భార్యగారికి నయమౌతుందనే నాకు శ్రీరాముడు చెప్తున్నాడు. అయినా మీరు యోగిగార్ని చూడాలనుకొంటున్నారు కాబట్టి, రేపు ప్రొద్దున్న మీకు వారిదర్శనం అయేట్టు ప్రయత్నం చేస్తాను. ఈలోపుగా ఈ రాత్రి మీ ఇద్దరిచేతా ఒక హోమంకూడా చేయించాలి.

పర : అల్లాగే చేస్తాను బాబూ. హోమానికేం కావాలి; ఎంత ఖర్చవుతుంది ?

రామ : మీరేం చెయ్యక్కర్లేదండి. ఉదయం స్నానాలు చేసి మడిగా తయారయిఉండండి. హోమానికి కావలసినదంతా రాజారావుగారు సమకూర్చిపెడతారు.

రాజా : అల్లాగేనండీ అల్లాగే. ఇంకేం పరదేశిగారూ, మీరు నిశ్చింతగా వెళ్లి మందిరంమేడమీద పడుకోండి.

పర : అయ్యో. ఖర్చులు వారు పెట్టుకోటం ఎందుకండీ.

రామ : (మందహాసంచేస్తూ) అహ్హహ్హా. అల్లా అన్నారూ! మా ఋణాన్న పడిపోవటం ఎందుకంటారు. అదీ నిజమేలెండి. సరే అయితే ఒక వందరూపాయలు వారి కియ్యండి. బహుశా సరిపోవచ్చును. కాకపోయినా ఫర్వాలేదు.

పర : (ఆశ్చర్యంతో) వందరూపాయ లవుతుందండీ !

రామ : (వికటంగా నవ్వి) చూశారా! డబ్బంటే అల్లా ఉంటుంది. అందుకనే మీరు ఇవ్వక్కర్లేదని ముందే చెప్పాను. ఏమంటారు రాజారావుగారూ. (రామదాసు, రాజారావు వికటంగా నవ్వుతారు.)

పరదేశి : అబ్బే అందుకు కాదండి. సరే ఇదిగో వందరూపాయలూ తీసికోండి. రేపు యోగిగారి దర్శనానికికూడా సెలవిప్పించండి. నమస్కారం వెళ్లివస్తా. (నిష్క్రమణము.)

రామ : శ్రీరామ. సుఖంగా వెళ్లిరండి.

రాజా : శహబాస్ దాసుగారు. ఇదిగో మీ సగం ఏభైరూపాయిలూ మీదగ్గిర ఉంచండి.

రామ : ఏదో భగవత్కృప ఎంతకు అంతే మాడండి. రామచంద్రపాహి.

(ఉరుములు ఇందాకటికన్నా కొంచెం ఎక్కువగా వినబడ్తాయి. గాలి జోరౌతుంది.

రామ : ముసురు బాగా పట్టిందే.

రాజా : బాగానే పట్టింది. పొద్దు తెలీటంలేదు.

(సంగి చీపురుతో ఊడుస్తూ ప్రవేశం)

సంగి : ఏమయ్యో గడ్డపాయనా, కాసింత ఒత్తిగిలండి ఊడుస్తా.

రామ : (కోపంతో) ఆ. ఏమన్నావ్. నీకు గడ్డపాయన్నా. (హుంకరిస్తాడు)

రాజా : ఏయ్ సంగీ, నీకు మరీ ఒళ్లూపై తెలియకుండా పోతోంది. ఇంత పొద్దెక్కాక ఇప్పుడు చీపురుచ్చుకొని తయారయి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతావ్! ఆఁ!

సంగి : ఏమిటయ్యా ! తప్పుకోమంటే తప్పుకోక ఇద్దరూ రంకె లేస్తారు. గడ్డముంటే గడ్డపాయనకాదా? పొద్దెక్కిందట పొద్దు, చాలుచాలు, ఆబొంత తియ్యవయ్యా గడ్డపాయనా, బాసింపట్టేసుకొని కూర్చున్నావు గాని లేలే.

రామ : (ఉగ్రంగా) నిన్నేం చేస్తానో చూడు. భ్రష్టాకారి...

(నారాయణవెంట కుయ్ మంటూ కుక్క)

నారాయణ : ఏమిటి సంగీ. అప్పుడే రామదాసమహర్షి గారికి కోపం తెప్పించావ్. నమస్కారం మహర్షి గారూ, ఇవాళ మా కుక్కకు పాపాలు పోగొట్టడానికి మీదర్శనానికి తీసుకువచ్చాను. ఒరేయ్ భైరవా, మీ బాబుగారికి నమస్కారం చెయ్యరా. (కుక్కను బొంతమీదికి తోస్తాడు. కుక్క కుయ్ కుయ్ మంటూ ఉంటుంది. ఛీ ఛీ ఛీ అంటూ రామదాసు అడావుడిగా లేస్తాడు.)

సంగి : (పకపకనవ్వుతూ) భలే భలే, గడ్డపాయన బొంతతో కూడా ఇట్టే లేచాడు (పకపక నవ్వుతుంది)

(ఉరుముల శబ్దం కొద్ది కొద్దిగా ఎక్కువౌతూంటుంది.)

రామ : (ఉగ్రంగా) మీ ఇద్దరి పనీ మహా ఇదిగా ఉంది. మీ రోగం కుదురుస్తాను. మిమ్మల్ని భస్మీపటలం చేస్తాను.

రాజా : ఎంత ఆగడం. యోగిగారికి మంచిచెడ్డలు ఏమీ తెలియవు. భ్రష్టాకారులూ, లుచ్ఛాలూ, ఎల్లాంటి పరమపాపులు చేరినా కిమ్మనడు. ఆ అలుసు మాసుకొని వీళ్లు మరీ పేట్రేగిపోతున్నారు.

రామ : (కోపంతో) పేట్రేగుతారు, పేట్రేగుతారు చూస్తానుగా!

నారా : (నవ్వుతూ) శాంతం. శాంతం. దాసుగారూ. అయినా మిమ్మల్ని గడ్డంపెంచవద్దని ఎంత బతిమాలాను. బతిమాలానా లేదా చెప్పండి? గడ్డాలు పెంచితే ఋషులకులాగా కోపాలూ, శాపాలూ అలవాటౌతాయండీ—రాజారావుగారూ, మీరు ఒక్కటిమాత్రం నిజంచెప్పారు. ఈ యోగిగారి అసలుసంగతి ఏమోగాని, వారి చుట్టూమాత్రం పరమలుచ్ఛాలూ, ఆషాఢభూతులూ చేరినమాట వాస్తవం! ఏమంటారు ?

రాజా : అబ్బాయి నారయాణా! మంచీ, చెడ్డా, పిన్నా పెద్దా కాస్త తెలుసుకొని నడుచుకో. మరీ అంత మిడిసిపడకు.

నారా : రామరామ. నాకెందుకండీ మిడిసిపాటు? యోగివర్యులకి ప్రథమశిష్యులూ, ఆయన్ని మించిపోయిన దైవభక్తులూ మీరంతా ఉండగా—ఎంతటి భక్తులు కాకపోతే, యోగిగార పేరిట మీ కింతంత ధనరాసులు చేరుతాయి?

రామ : (ఛీత్కారంగా) ఛీ. ఛీ. ఈ బొంతా కాపీనం, తప్ప నాదగ్గర డబ్బుందట, లుచ్ఛా అని–లుచ్ఛామాటలూ! చూడండి రాజా రావుగారూ! నన్నెంత మాటంటున్నాడో ఈ నారిగాడు.

నారా: అయ్యా నారాయణా అనటం అలవాటుచేసుకోండి. అజామిళుడికిలాగా మోక్షమన్నా వస్తుంది. అంతగా జ్ఞాపకం రాక పోతే, ఒక్క నారపాయా, ఒకఅణా మెళ్ళో కట్టుకోండి. అప్పటికీ పీచుపీచు అనేరు జాగ్రత్త!

సంగి: (పకపక నవ్వుతూ) సరేలెండి. లెండయ్యా, ఈ ముంగిలి కాస్తా ఊడ్చి ఉన్న వారందరికీ ఫలారాలు ఇచ్చి తమ దగ్గరకు తీసుకురమ్మన్నారు యోగిబాబు. ఇప్పటికే వేళయింది. లెండి.

రామ: (కోపంతో దీర్ఘాలుతీస్తూ ఆక్షేపణతో) యోగి గారి దర్శనం చేయించటానికి నీకన్నా పవిత్రులు యోగిగార్కి దొరకలేదేం? మేమంతా మట్టిగొట్టుకుపోయామట! నానాతిరుగుళ్లూ తిరిగి, ఎందరికొంపలో తీసి, వృద్ధనారీ పతివ్రతా అని, భక్తురాలివై ఇక్కడచేరి, యోగిగారికి మహాఅంతరంగికురాల నన్నట్లు నటి స్తున్నావ్! నోరు మూసుకొని అవతలికి కదులు. నీచేతి ఫలారాలు కూడా తింటాడూ? మర్యాదఉన్నవా డెవడైనా? ఆ భ్రష్టత్వం కూడా కావాలా? చాల్చాలు నడు.

సంగి: ఏమయ్యోయ్ గడ్డపాయనా! మాటలు సరిగా రానియ్యి. నే చెడ్డదాన్నే కావచ్చును. ఒకళ్లవల్ల నేను చెడ్డాను గాని, నేను ఎవరికీ చెరుపు చెయ్యలేదు. అయినా, నేనేమీ నీకులాగా పవిత్రురాలి నని చెప్పుకోటంలేదు. ఎన్ని ఘాతకాలు చేసి, ఇక్కడికి వచ్చి, ఆ బాబు పేరిట ఎంత సొమ్ము గడిస్తున్నావో, అంతా నా కెందుకని ఊరుకొంటున్నా కానీ, నీ బండారం బైటపెట్టా లంటే నిమిషం పట్టదు.

రామ: (హుంకారము) ఇప్పుడే యోగిగారితో చెప్పి నీపని పట్టిస్తా నుండు. హుం!

(సముద్రపు హోరూ, గాలిహోరూ ఇంకొంచెం ఎక్కువౌ తుంది.)

సంగి: ఈ గుమ్మంలోంచి ఇప్పుడు లోపలికి వెళ్లటానికి వీల్లేదు. కదిత్తే మాట దక్కదు. యోగిబాబు ధ్యానంలో ఉన్నారు. ఆయనధ్యానం చెడగొట్టేందుకు ఇక్కడచేసిన అల్లరి చాలు. అవ తలికి నడవండి ముందు! (ఉరుముల శబ్దం కొంచెం తగ్గుతుంది. గాలి హోరు హెచ్చుతుంది.)

నారా: హుష్, హుష్. సంగమ్మా! వారు మహాఋషులు. వారికి కోపం వస్తే నువ్వూ నేనూ, యోగిగారూ అందరం భస్మం అయిపోతాం. అప్పుడే చూడూ, ఆకాశం అంతా ఉరుములు ఎల్లా తెప్పించేశారో చూడు! ఇక వారు తలచుకొంటే ఉప్పెనే. వద్దు బాబూ, వద్దు శాంతించండి! రామదాసుగారూ, సంగిలాంటి నీచపు మనిషితో మీలాంటి మహాత్ముల కేమిటి చెప్పండి? అయినా మీ అంతివారు మీరు. మళ్ళీ, ఆయన యెవరో యోగితో పితూరీలా? శాం తించండి. సంగమ్మా ముందు అందరికీ ఫలారాలు తీసుకురా పో.

రామ: (కోపంతో) హు! చాలులే నోర్ముయ్! తిరుగుబోతు గాడిదవి. నీ బతుక్కి నువ్వూ మధ్యవర్తిలా వచ్చి అవాకులూ చెవా కులూ వాగాలట.

నారా: అయ్యయ్యో. నేనేమన్నానండి. ఇంకా నా కుక్క సాక్ష్యం. ఏమంటావే చెప్పవే. (కుక్క కుయ్ కుయ్ మంటుంది.) పోనీ అంతకన్నా ఘరానాసాక్ష్యం రాజారావుగా రున్నారు. గురుదర్శనంకోసం వచ్చే యాత్రికులకు మందిరాలూ, హోటళ్లూ కట్టించి, కాంట్రాక్టుల్లోనే కైంకర్యంచేసిన ఘరానామనిషి ఆయన. ఇప్పటికీ గురువుగారి పేరిట పచ్చకాగితాలు చూస్తూనేఉంటాడు. ఏమంటారు రాజారావుగారూ?

రాజా: నీతో మాట్లాడటంకన్నా ఆ కుక్కతో మాట్లా డటం నయం. రండి రామదాసుగారూ, మందిరానికి పోయి, తర్వాత మళ్లీ వద్దాం.

రామ: ఛీ, ఛీ, ఛీ, నా శాంతం అంతా పాడు చేశారు ఈ దగుల్బాజీలు. పదండి పోదాం, మనస్సు శాంతిపడ్డాక మళ్లీ రావచ్చు.

(ఇద్దరూ వెళ్తారు.)

నారా: అయ్యయ్యో, ఫలహారాలు పుచ్చుకోకుండా వెళ్ల కండి. (నవ్వుతూ) పోయా రిద్దరూ! పోనీలే సంగమ్మా! నా కుక్కకు పెడుదువుగానిలే.

సంగి: అదే కొంత నయం, ఈ లుచ్చాల కన్నా.

నారా. సంగమ్మా కుక్కకు కాస్త పాలు పోస్తూ ఉండు. నేను లోపలికి వెళ్లి యోగిబాబును చూసివస్తా. (లోపలికి కెళ్తాడు)

(కుక్క కుయ్ కుయ్ మంటూ మూల్గుతుంది)

సంగి. ఇదుగో, ఈ పాలు తాగవే. తాగమ్మా తాగూ. దూ! దూ!

(కుక్క మోర ఎత్తి పెద్ద ఏడుపు ఏడుస్తుంది. గొలుసు తెంపుకుపారిపోతుంద)

సంగి: అయ్యయ్యో, ఇదేమిటి పారిపోతూంది. నారా యణా, నీ కుక్క పారిపోతూంది. పాలు వాసన అన్నా చూడలేదు.

నారా: (లోపల్నుంచి ప్రవేశించి తొందరగా) సంగమ్మా బాబు లోపలికి అర్జెంటుగా పిలుస్తున్నారు. కుక్క పారిపోయిందా. ఆఁ, ఎక్కడికి పోతుందిలే. తర్వాత చూద్దాం. పద, నన్ను వెళ్లి ఇక్కడున్న యాత్రికులందరినీ ఒకసారి ఇప్పుడే పిలుచుకు రమ్మ న్నారు. నేను వెళ్లి వస్తాను, నువ్వు లోపలికిపో. (సంగి లోపలికి వెళ్తుంది)

పరదేశి: భార్య కేకలు వేస్తూ, పరదేశి సముదాయిస్తూ ప్రవేశం)

పర: పడిపోతావే, ఇల్లా రాకూడదు. ఏమిటా కేకలూ! యోగి గారిని తెగబడి చూడకూడదే! రామదాసుగారూ వారు పర్మిషన్ ఇవ్వాలి. లేకపోతే మనకు వికటిస్తుంది.

భార్య: అంత పర్మిషన్ ఉన్న యోగిని చూడనే అక్కర్లేదు.

నారా: నిజమమ్మా. ఆ మాట నిజం?

భార్య: ఏయ్? ఎవరయ్యా నువ్వు, నన్ను యోగిగార్ని చూడనియ్యనిది నువ్వేనా.

నారా: యోగిగార్ని ఒకళ్లు చూడనియ్యకపోవట మేమి టమ్మా, పద. లోపలికి పోయి నీ అంతట నువ్వే నమస్కారం చెయ్యవచ్చు.

భార్య: ఏమిటే. మరింత తేలికగా చూడగల్గితే మా ఆయన ఇన్నాళ్లూ ఆ మాలకూడుమఠంలో పడేసి చంపా రెందుకూ నన్ను, ఇంతకూ ఈయనలో ఏమున్నా మహత్యం ఉందా. నా జబ్బు నయం చేస్తాడా?

నారా: (నవ్వి) ఆయన ఎవళ్ళజబ్బూ నయం చేస్తానని చెప్పడమ్మా. అదంతా మీ నమ్మకంలోనే ఉంటుంది.

(35 వ పేజీ చూడుడు)


సంక్రాంతిసంచిక
బాలానందం

సంక్రాంతి సందేశము

శ్రీ "టి. యల్. నారాయణ"

పాపాయిలూ! ఈనెల 14 వ తారీఖున "సంక్రాంతి"పండుగకదూ! ఈరోజున మన మంతా చక్కా తలంట్లు పోసికొని కొత్తబట్టలు కట్టుకొని ఎంతో ఉల్లాసంగా ఉంటాము. క్రిందటి రోజున భోగిపండుగ జరుపుకుంటాము. హాయిగా భోగిమంటలు వేసికొని చలి కాచుకుంటాము. వళ్లీ మరుసటిరోజున కనుముపండుగ జరుపుకుంటాము. మన చిట్టిచిట్టి చెల్లాయిలూ, అక్కాయిలూ అందరూ బలేబలే బొమ్మలూ అవీ పెట్టుకుంటారు. పేరంటాలు చేసికుంటారు. పొద్దున చక్కాగా చీకటితోనే గొబ్బెమ్మలు పెట్టుకుంటారు. రకరకాలుగా కన్నుల పండువుగా ముగ్గులు వేస్తారు. మధ్యాహ్నానికి "సంక్రమయ్య"డి ప్రతిమ చేసికొని పూజ చేసికుంటాము. మన అమ్మా వాళ్లూ గొబ్బిపిడకలతో అయ్యాతియ్యాగా పొంగలి వండిపెడితే జురుకుంటాము. మన నాన్నావాళ్లూ మనకు కనపడే దేవుడైన సూరలీ దేవుడికి అర్ఘ్యం ఇస్తారు. పల్లెల్లో రైతులు వాళ్లు చక్కాగా ఎద్దులకు నాగళ్లకు పసుపుకుంకుమలు పెట్టి పూజ చేసికుంటారు. ఎంత బలే పండుగ! దేశంలో ఉన్న పెద్దవాళ్లకూ చిన్నవాళ్లకూ ఆడవాళ్లకూ మొగవాళ్లకూ అతిముఖ్యమైన పండుగ!

అసలు ఇది సూర్యభగవానుడికి సంబంధించిన పండుగ. సూర్యభగవానుడు మనకు గొప్పస్నేహితుడు. కనుకనే ఆయన్ను "మిత్రు" డని కూడా అంటారు. నిజంగా, ఆయనే లేడనుకోండి, లోకం అంతా చీకటిమయంగా రాత్రిపూటలా ఉండేది కాదూ? సముద్రాల్లో, నదుల్లో నీళ్లు సూర్యుడి వేడికి ఆవిరై మేఘాలుగా మారి వర్షాలు కురిసేవా? వర్షాలు లేకుండా మనకు పంటలు పండుతాయా? అందుకనే ఆయన్ను సూర్యభగవాను డన్నారు.

ఈరోజున ఆ మహానుభావుడి కిరణాలు సూటిగా మకరరేఖమీద పడతాయి. క్రమేపి మన ప్రాంతాల మీదికి వస్తాయి. ఇప్పటినుంచీ సూర్యుడు మకరరేఖనుంచీ మనకు దగ్గరగా వస్తుంటాడు. అంటే "సూర్యుని దిక్కు" మారుతుంది. ఇదివరకు దక్షిణపువేపు ప్రయాణం చేసేవాడు ఇప్పుడు ఉత్తరంవేపు ప్రయాణం చేయడం మొదలెట్టే రోజు. అందుకనే దీన్ని "సంక్రాంతి" అనీ "సంక్రమణం" అనీ అంటారు.

ఈరోజుతో సూర్యుడు మనకు చేరువకు వస్తాడుకనుక చలిరోజులు పటాపంచలైపోతవి. ఈ వెధవ చలీ,మంచూ అన్నీ తుర్రుమంటయ్. చక్కాగా ఎండలు కాస్తాయి. ఆ తరువాత వర్షాలు కురుస్తవి. బాగా పంటలు పండి, అహారసమస్య తీరిపోయి మనము సుఖపడవచ్చు. చూచారా సంక్రాంతిమహాత్యం! ఇంతేకాదు. మన చుట్టూ ప్రకృతిలోనూ మార్పు వస్తుంది. చెట్లు పనికిరాని ఎండుఆకులన్నీ

సంక్రాంతి

"మహేశ్వర్"

వచ్చింది సంక్రాంతి వచ్చింది
వచ్చి సందడి మనకు తెచ్చింది
తెచ్చి ఆనందాలు కూర్చింది
కూర్చి మన అప్పాలూ పెంచిది!!

వచ్చింది సంక్రాంతి వచ్చింది
అక్కలను బావలను పిల్చింది
పిలిచి కానుకలను ఇచ్చింది
ఇచ్చి కయ్యాలను కదిపింది

వచ్చింది సంక్రాంతి వచ్చింది
కొత్తకోడళ్లను తెచ్చింది
కొత్తఅల్లుళ్లను పిల్చింది
పిలిచి అలకలను పెంచింది!

వచ్చింది సంక్రాంతి వచ్చింది
కంట్రోలుమాటను మరచింది
పందారరుచులనూ మరిగింది!
విందారగించుత్తూ పోయింది!

వచ్చింది సంక్రాంతి వచ్చింది
బంధువులనూ పిల్చు కొచ్చింది
వైళ్లలో దొమ్మినీ పెంచింది
ఇళ్లలో ఇరకటం హెచ్చింది!

వచ్చింది సంక్రాంతి వచ్చింది
కరువన్నసంగతే మరిచింది
ఉన్నదే చాలనీ వచ్చింది
క్షేమమే పండుగని మెచ్చింది



గొబ్బిళ్లు—ఛా.. చి. పి. రాఘవరావు.



పొంగలి—ఛా. చిత్రకారుడు బి. రంగనాథన్.

రాలిపోయి సంవత్సరాది వచ్చేసరికి బాగా చిగిర్చి పూలు, కాయలతో, కోకిలల పాటలతో చాలా హాయిగా ఉంటుంది. తరువాత కొద్దిరోజులకే దేశమంతా మీరు తిని పారేసిన మామిడికాయ టెంకలతో కూడా ఇంకా చాలా హాయిగా ఉంటుంది సుమా! కనుక ఇది మనకు బలే ముఖ్యమైన పండుగ. కష్టాలన్నీ పోయి సుఖాలు మిగిలే పండుగన్న మాట! చూచారా? మన పండుగల సంగతే మనకు తెలియదు కాని- ఎంతేసి గొప్ప పండుగలో!

మన దేశానికికూడా ఇదివరకు అన్నీ గడ్డురోజులే కష్టాలే. మనం అందరం ఈ కష్టాలెప్పుడు పోతాయా అని ఎదురుచూస్తున్నాం. మరి సుఖ మెల్లా వస్తుంది? నిజంగా మనం చాలా స్వార్థపరులం. మనలో మనం తగవులాడుకోడం అధికం. మన నాయకులు చెప్పింది వినం, దేశంలో అందరూ వారాని కొక పూట ఉపవాసం ఉండి ఆహారం నిలువచేయండని నాయకులంటూంటే మనం పెడచెవిని పెడుతున్నాం. ఇల్లాగే ప్రతివిషయమూను. సూర్యుడి గమనంలో మార్పువచ్చినట్లు మన నడతలో కూడా మార్పు రావాలి. మనలోని ఈ దుర్గుణాలన్నీ పోవాలి. దేశమంటే భక్తి, మన భారతీయులంటే ప్రేమ అధికం కావాలి. మనం ఆదర్శంగా ఉండి, బ్లాక్ మార్కెట్ చేసేటువంటి, లంచాలు పట్టేటువంటి, ఇంకా వెధవపనులు చేసే వాళ్లకు బుద్ధి చెప్పాలి. మన జాతి యన్నా, మతం అన్నా, శాస్త్రాలన్నా చాల గౌరవంగానూ భక్తితోనూ మెలగాలి. అప్పుడు దేశానికి సుఖం చేకూరకేమి చేస్తుంది? ఈ సందేశం యివ్వడానికే "సంక్రాంతి" పండుగ వస్తోంది.

చూచారా! "సంక్రాంతి" అంటే అప్పచ్చులు తినడం కాదు. కొత్త గుడ్డలతో కులకడం కాదు. ఇల్లా దేశభక్తి, సోదరప్రేమ అవీ వృద్ధిచేసికొని దేశాన్ని బాగుచేయడం నేర్చుకోడమే!


బంతిపువ్వు

శ్రీమతి వి. ఎల్. సీతాదేవి

పూర్వ మొక రాజు ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలను గలిగియుండెను. కుమార్తెలలో ఆఖరుకుమార్తె అగు చంద్రప్రభకు తప్ప మిగిలినవారందరికి వివాహములు చేసి రాజు చనిపోయెను. రాజు తన చంద్రప్రభను ఏడుగురికుమారులకు వప్పగించెను. తండ్రిలేని పిల్ల యగుటచేతను కడసారపు బిడ్డ యగుటచేతను అన్నదమ్ములు చంద్రప్రభను అల్లారుముద్దుగా చూచెడివారు. చంద్రప్రభకు అన్నలే పెళ్లిచేసిరి. చంద్రప్రభమాటకు తిరుగులేకుండ కోరిన కోరికలన్నింటిని అన్నలు తీర్చెడివారు. కాని ఏడుగురు వదినెలకు చంద్రప్రభ అనిన ఈర్ష్య, అసహ్యము. చంద్రప్రభమాట విని తమ భర్తలు ధనమంతయు నాశనముచేయుచున్నా రని వారి నమ్మకము. ఏవిధముగనైన చంద్రప్రభ పోరు వదుల్చుకొని, ఆమెను ఇంటినుండి తరిమివేయవలె నని వారి ప్రయత్నము.

చంద్రప్రభ అనుంగుచెల్లె లగుటచే పీమైనంతవరకు ఆమెఅన్నలు ఆమెను విడిచివెళ్లేవారు కాదు. కాని చంద్రప్రభకు దుష్కాల మాసన్నమగుటచే అన్నదమ్ములు వ్యవహార విషయములలో విదేశము వెళ్లవలసి వచ్చింది. విధివశమైన ఈ ఎడబాటునకు మిక్కిలి విచారించి విడువలేక విడువలేక ఆమెను వదినల కప్పగించి వెళ్లిరి.

ఏడుగురువదినెలు తమకు మంచి సమయము లభించినందుకు సంతసించుచు చంద్రప్రభను కడతేర్చ ప్రయత్నములు చేస్తున్నారు.



చంద్రప్రభ దురదృష్టవంతురా లగుటచే, తన అన్నలు నిర్ణీతకాలమునకు రాలేకపోయారు. ఇంతలో ఏడవవదినె తా నొక చక్కని ఉపాయ మాలోచించితి నని మిగిలిన వదినెలకు చెప్పింది. వా రందరు చాల సంతోషించి ఆ ఉపాయ మేదో తమకు తెలుపమని కోరిరి. ఏడవవదినె వారితో "చంద్రప్రభను అత్తవారింటికి పంపుచున్నామని చెప్పి సేవకులతో పంపుదాము. సేవకులతో మాత్రము ఈమెను అడవిమధ్యకు తీసికొనిపోయి చంపి పాతిపెట్టు మని చెప్పదాము. సేవకులు తిరిగివచ్చునపుడు తాము చంపిన చిహ్నముగ రక్తమును తెమ్మందా" మని చెప్పింది. అందరు కూడ చంద్రప్రభ తమ కిక వదలిపోవునుగదా యని సంతసించిరి. చంద్రప్రభ కా మరునాడె తలకు స్నానముచేయించి, కొత్త వస్త్రములు తొడిగించి, సేవకులతో గూడ పంపించారు. కొన్నిదినాల తర్వాత వా రొక అడవిని చేరుకొన్నారు. ఏడుగురువదినెల ఆజ్ఞప్రకారము చంద్రప్రభను సేవకులు చంపి గోతిలో పాతి పెట్టి, ఆమెయొక్క రక్తమును తీసికొనిపోయి వారికి చూపించారు. ఏడుగురువదినెలుగూడ చంద్రప్రభపోరు వదలినదిగదా అని సంతోషించారు.

పిమ్మట కొంతకాలానికి చంద్రప్రభఅన్నలు తమ దేశమునకు తిరిగివస్తూ అడవిమధ్యన మిక్కిలి ప్రకాశిస్తున్న బంతిపూవుతో నున్న చెట్టును చూచారు. వెంటనే వారికి ఆ బంతిపూవును తీసికొనిపోయి చంద్రప్రభకు ఇయ్యాలని అనిపించింది. సరే దానిని త్రుంచబోగా, ఆ పువ్వు నీళ్లు గారుస్తూ "నను ముట్టకు నను ముట్టకు నాయనా నిర్భాగ్యురాల" నని ఆరుగురన్నదమ్ములకు బదులు పలికింది. ఏడవ అన్న దానిని త్రుంచబోగా "నను ముట్టకు నను ముట్టకు నా చిన్నవదినె నన్నీ దశకు తెచ్చె" నని బదులు పలుకగా వా రెవ్వరుగూడ దీనిని అర్థముచేసుకోలేక తమ ఇంటికి వెళ్లిపోయారు.

ఇంటికి చేరినవెంటనే సంతోషముతో తిరుగుచున్న తమ భార్యలను చంద్రప్రభ ఏది, ఎక్కడకు వెళ్లింది? అని అడిగిరి. నిక్కుతూ, నీలుగుతూ ఏడుగురువదినెలుకూడ "చంద్రప్రభ అత్తవారింటికి వెళ్లింది. నాలుగురోజులు మీ రాకకొరకు చూచారు. కాని ఎన్నాళ్లు ఊరుకొంటాము. తీసికొనిపోతా మని పోరుపెడితే మీరు లేకపోయినను తగిన సత్కారములతో ఈదినమే

వారిని పంపినా" మని చెప్పిరి. సత్యమే నని అన్నలు నమ్మి చంద్ర ప్రభ సుఖముగా నున్నదిగదా అని సంతోషించారు.

కొన్నిదినాలతర్వాత చంద్ర ప్రభభర్త ఆ అడవిమధ్యనుండే తన అత్తవారింటికి వస్తూ బంతిపువ్వు చెట్టును చూచెను. అతనికికూడ ఆ బంతిపూవును తీసికొనిపోయి చంద్ర ప్రభకీయవలె నని ఆశ కలిగింది. సరేనని దానిని త్రుంచబోగా కన్నీళ్లు కారుస్తూ "నన్ను త్రుంచి తీసికొనిపోయిన ఏమి లాభము, ఈ చెట్టునే తీసికొనిపోయి నీ యింట పెంచు" మని బదులు పలికింది. కాని ఈతడుకూడ ఆ మాటలను గ్రహించలేక తిన్నగా బోయెను.

చంద్రప్రభభర్త తన యత్తవారింటికిపోయి తన భార్యను పంపమని అడుగగా ఏడుగురన్నలు ఆశ్చర్యపోయారు.

వారి భార్యలు వారిని మోసగించినందులకు విచారించి వారిని నిందించిరి. వారి ముద్దుల సోదరి చంద్రప్రభ అదృశ్యమైనందులకు మిక్కిలి విచారించిరి. చంద్రప్రభ భర్త అడవిలో తాను బంతిపూవు వలన వినిన సంగతులన్నీ చెప్పెను. ఏడుగురన్నలుగూడ అదేవిధముగా విన్నందువలన తిరిగి ఆచెట్టువద్దకు అందరు వెళ్లిరి. వీరందరుకూడ ఒక్కొక్కరే ఆ పూవును తాకబోగా "నను ముట్టకు నను ముట్టకు నిర్భాగ్యురాల" నని పలికెను. కాని ఏడవ అన్న తాకబోగా "నను ముట్టకు నా చిన్నఅన్న! నీభార్య నన్నీ దశకు దెచ్చె" నని పలికెను. చివరకు ఏడవవదినెకూడ తాకబోగా "నను ముట్టకు నాచిన్నివదినె. నీవె నా దౌర్భాగ్యమునకు కారకురాల" వని పల్కెను. ఏడుగురన్నలుగూడ ఈ బంతిపూవే తమ సోదరి చంద్రప్రభ యని గ్రహించి ఏడవవదినెకు తగిన శిక్ష విధించిరి. అప్పటినుండి ఆ చెట్టును తీసికొనిపోయి ప్రతి దినము నీళ్లు పోయుచు మిక్కిలి ప్రేమతో పెంచిరి.

ఇదే నేడు మనమందరము చూచు బంతిపూవు. ఇది పునిస్త్రీపడుచగు చంద్రప్రభరూపమును దాల్చినదగుటచే దీనిని పునిస్త్రీపడుచులు ధరించవలసినదిగా పెద్దలు నిర్ణయించిరి. సంక్రాంతిరోజులలో ఇది విరివిగా కనబడుతుంది. సంక్రాంతిపండుగకు పదిహేనురోజులుముందునుంచి ఆడపిల్లలందరు ఆనందముతో గొబ్బిళ్లను చేయుదురు. ఆ గొబ్బెమ్మయే పునిస్త్రీపడుచు. దానికి పసుపు కుంకుమలను పునిస్త్రీవలె అలంకరించెదరు. దానిపై మిక్కిలి శోభను గూర్చు ఈ బంతిపూవు నమర్తురు. ఇదియే మన బంతిపూవుగాథ. ఎంత చక్కని బంతిపూవో చూచారా!



సంక్రాంతి ఉషస్సు

శ్రీ చిల్లర భావన్నారాయణరావు

తమిదీర కౌగిట దనిసి పెనంగి
యాహ్లాదమున దేలు యాలుమగలు
గడగడవణకి మాఘస్నానముల జేసి
తంబురమీటు సాతానిగారు,
కాలినడకనగంటగణగణ మ్రోయశం
ఖోయటం చరచు బుడబుక్కలాడు,
చదువుపూర్ణముగాకె నతిరజస్వలయైన
పారమ్మ రాని యా బ్రహ్మచారి,
క్రొత్తగా వోణివేయు కొంగ్రొత్త పడుచు
గొబ్బిళులువెట్ట దమ్ముడు కోర్కె తోడ
ముడుచుకొని వణకుచు బెల్లమును దినంగ
వేడ్కగనిపించు సంక్రాతివేగు జాము॥

గడ్డిబండిమనిసి గళమెత్తి పాడన
సావేరిసంగీతస్వాదు గీతి,
క్రొత్తబియ్యము దంచు క్రొత్తకోడలు పాడ
దల నూపి మామ సంతసము జెంద,
పెఱుగు జిలికెడి యాపెకరముకంకణములు
ఘల్లురుమని మ్రోయగా గృహాన
కదలక నిలవడు మొదవుపొదుగును బిండ
క్షీరధారలు నాదసార మొలుక
పొలుగుడిచిన లేగలు పరువుదీయ
ప్రమదమున గూడి బాలురు పరువులెత్త
హారనీహారనిబిడతుషారపూర
క్రాంతి భాసించు తెలుగుసంక్రాంతి ప్రొద్దు॥

గొబ్బిళ్లపాటలు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

"హేమంతికాప్రగంచిత సీమంతః తీక్ష్ణచోష్ణజితశీతభయశ్రీమంతము
హేమంతములో" మొదలి నెల మార్గశీర్షము సమోష్ణసమశీతసుభగము.
కావుట నది రసికజనహృదయాహ్లాదకరము, భోగినీభోగరుచిరమును.
వ్రతాద్యనుష్ఠానములకీ మాసము మిక్కిలి ప్రశస్తము. అందులకే విష్ణుచిత్తతనయ గోదాదేవి, గోపకన్నియలు మార్గశీర్షమాసమును కొనియాడి యమునానదిలో మార్గళినీరాట్టమునకు, నోము నోచుటకు దమ చెలులను బిలుచునటుల సాయించినారు. చూడుడు—

మార్కళి త్తింగళ్ మది నిఱైన్ద నన్నాళాల్
నీరాడప్పోదువీర్ పోదుమినో నేరిழైయీర్
శీర్ మల్గుమ్ ఆయ్ప్పాడి శెల్వచ్చిఱుమీర్గాళ్
కూర్వేల్ కొడున్దొழిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్దకణ్ణి యశోదై యిళఞ్జిఙ్గమ్
కార్మేనిచ్చెఙ్గణ్ కదిర్ మదియమ్బోల్ ముకత్తాన్
నారాయణనే నమక్కే పఱై తరువాన్
పారోర్ పుగழప్పడిన్దేలోరెమ్బావాయ్

భగవద్గీతయందు శ్రీకృష్ణభగవానులును మార్గశీర్షమును దమ దివ్యవిభూతిగా పేర్కొనిరి.

బృహత్సామ తథా సామ్నాం, గాయత్రీ ఛన్దసా మహమ్
మాసానాం మార్గశీర్షోఽహ మృతూనాం కుసుమాకరః

అధ్యా 10-శ్లో 35

మార్గశీర్ష మిట్లు మహనీయముగాఁ బేర్కొనఁబడుటకు సముచిత కారణము లేకపోలేదు. ఈమాసములోఁ దక్షిణ యన్ని మాసములందు కంటె సూర్యుడు భూమండలమున కత్యంతసన్నిహితుడుగానుండును. బాహిరముగా ప్రపంచమున గోచరమగు నిట్టి సన్నివేశమే మానవ శరీరమందును నీ మాసమున సంభవమగును. ఈ మాసముననే జీవకిరణము సహస్రారమునుండి వెన్నెముకమూలమునఁ బురుషశరీరమునఁ బ్రవేశించును. ధనుర్మాసములోఁ బురుషశరీరమునఁ బ్రవేశించిన జీవాత్మ వసంతములో వనితాగర్భమునఁ జొచ్చును

ఈ కాలమున శరవేగ తీవ్రముగా జరగుట సంభవము కావుననే ప్రాతఃకాలములందు ఆహారపరిగ్రహము ఆచారమయినది. ఉప్పు పొంగిళ్లు పొంగించుకొని దేవతానివేదనము గావించి ప్రాతఃకాలములందు ప్రసాదముగా స్వీకరించుట నేటికిని కొనసాగుచున్నది.

ఈమాసములో కన్నెపడుచులు ముంగిళ్లలో ముగ్గులు తీర్చి గొబ్బిళ్ళుపెట్టి గొబ్బి తట్టుదురు. గొబ్బిళ్ళదేవతను ఆరాధించుట, గొబ్బితట్టుచు గొబ్బిపాటలు పాడుట అనాదిఆచారముగా కనబడుచున్నది. మార్గశీర్షములో గొబ్బిళ్లదేవత నారాధించు నీ సంప్రదాయము మనవారు భాగవతమునుండి యలవఱచుకొనినట్లు తెలియుచున్నది. గోపకుమారికలు హేమంతమున మొదలినెల తొలిదినమునందు కాళిందికేగి కాత్యాయని నారాధించినటుల భాగవతమున పేర్కొనబడినది చూడుడు -

"ఇట్టి నితాంతం బగు హేమంతంబున మొదలి నెల, తొలి దినంబునందు నంగనిఁ బొందం గల గోపకుమారికలు రేపకడ లేచి చని కాళిందీజలంబులం దోగి జలతీరంబున సికతామయం గాత్యాయనీరూపంబు జేసి సురభికుసుమగంధంబులిడి ధూపదీపంబు లిచ్చి బహువిధోపహారంబులు సమర్పించి,

ఓ కాత్యాయని! భగవతి!
నీకును మ్రొక్కెదము మేము నే డనుకంపన్
మా కందఱకును వైళమ
శ్రీకృష్ణుడు మగడు గాగ జేయుము తల్లీ!
ఓ తల్లి! మాకు కృష్ణుడు
చేతోవిభుడైననాడు చెలువల వెల్లన్
నేతివసంతము లాడుచు
జాతరచేసెదము భక్తిచాతురితోడన్

అని నమస్కరించి హవిష్యంబులు గుడుచుచు నివ్విధంబున మాసవ్రతంబు సలిపి రంత నొక్కనాడు—

రమణుల్ ప్రొద్దున మేలుకాంచి
సఖులన్ రండంచు నాత్మీయనా
మములం జీరి కుచద్వయీభ
రములన్ మధ్యంబు లల్లాడగా
బ్రమదోద్దామగజేంద్రయాన
లనుచున్ బద్మాక్షునిన్ బాడుచున్
యమునాతీరము జేరబోయిరి
గృహీతాన్యోన్యహస్తాబ్జలై

ఇట్లా నదీతీరంబు చేరంజని గజగమనలు విజనప్రదేశంబున వలువలు విడిచి మది శంక లేక యకలంకలై క్రుంకులిడ జలంబు సొచ్చి

వారిజలోచను బాడుచు
వారిజలోచనలు వారివారికి వేడ్కన్
వారివిహారము సలిపిరి
వారివిహారములు జగతివారికి గలవే

భాగ. దశమస్కంధము.

భాగవతములో గోపకుమారికలు శ్రీకృష్ణుడు మగడు గాగ బడయుటకు గావించిన మార్గశీర్షవ్రతమే తరువాతి కాలములో కన్నెపిల్లల గొబ్బిళ్లయారాధన మయినది. అందుకే గొబ్బిదేవరకు 'భాగవత గొబ్బి' యని పేరు. 'గోపి'కలు ఆరాధించిన దైవము గనుకనే యామె గోపిదేవర - గొబ్బిదేవర యని పేర్కొనబడి యుండును. తమిళమున

నీమె 'కొప్పి' యని పిలువబడుచున్నది. గోపికలు యమునాతీరము చేరబోవుచు 'బ్రమదోద్దామగజేంద్రయాన లగుచుఁ బద్మాక్షునిఁ బాడు'టయే గొబ్బిపాటలు పాడుట, గొబ్బితట్టుట యను సంప్రదాయములుగా బరిణమించినవి.

ఈ గొబ్బిపాటలు క్రీస్తుశకము పండ్రెండవశతాబ్దినాటికే తెలుగునాట బహుళప్రచారము పడసియున్నట్లు తెలియవచ్చుచున్నది. పాలకురికి సోమనాథుడు తన పండితారాధ్యచరిత్రములో నీ గొబ్బిపాటలను పేర్కొనినాడు చూడుడు—

'పదములు తుమ్మెదపదముల్ ప్రభాత
పదములు పర్వతపదము లానంద
పదములు శంకరపదముల్ నివాళి
పదములు వాలేశుపదములు గొబ్బి
పదములు వెన్నెలపదములు సెజ్జ
వర్ణన మఱి గణవర్ణనపదము
లర్ణవఘోషణ ఘూర్ణిల్లుచుండ
బాడుచు నాడుచు బరమహర్షమున'

పండితారాధ్యచరిత్రము.

ఈ గొబ్బిపాటలను వీనలగేలు సేర్చియ నేకులు కూడి పాడుచుండెడివారట! ఆ పాడుటలో గూడ బలుతెఱగులు గలవట!

చెలగి వీనలగేలుసేర్చి గొబ్బిళ్ల
బలుతెఱంగుల గూడి పాడెడువారు

అష్టమహిషీకల్యాణము

కన్నెపడుచులు ప్రాతఃకాలమునందే లేచి ముంగిళ్ళ నలికి ముగ్గులుపెట్టి యా ముగ్గులలో గొబ్బిళ్లు పెట్టుదురు. గోమయమును ముద్దలుముద్దలుగా జేసి దానిపై గుమ్మడిపూవుల బెట్టి రంగవలుల నలంకరింతురు. మెఱుగు లొలుకుచున్న యా ముగ్గులలో పసపురంగు గుమ్మడిపూవుల నలంకరించుకొన్న గొబ్బిళ్లు గృహసౌభాగ్యము నినుమడింపజేయును. గొబ్బిళ్ల దేవత యలంకరించుకొన్న గుమ్మడిపూవు మహాకవి శ్రీవిశ్వనాథసత్యనారాయణగారి కవితలో జిలుగువెలుగులు సంతరించుకొనినది చూడుడు—

గొబ్బిళ్ళ దేవతకొప్పులో జెఱివిన
మగని మక్కువపైడి మొగలికచ్చు
పాదులపెట్టిన పాటిదిబ్బకడుపు
ప్రత్యక్షమైన గారాలకూచి
మదనేష్టికృతికి దుమ్మెదసోమపీథికై
యవనిక దిగివచ్చినట్టి రంభ
దానార్థవినియోగతా పుణ్యజన్మమౌ
గర్భమ్ము నోముల గౌరుదేవి
మొదలి స్త్రీజాతి కొప్పున ముడుచుకొన్న
ప్రసవసంతానములలోని ప్రథమభూప
మదురు గుమ్మడిపూవు హేమంతలక్ష్మి
పసుపు రాచినమొగమునా ఒరిఫవిల్లె

ఋతుసంహారము.

పిదప నీ గొబ్బిళ్లకు చలిదియన్నమును నైవేద్యము పెట్టుదురు. అందులకే యామెను 'సద్దికూటిగౌరుదేవమ్మ' యందురు. కన్నెపిల్లలు ఆరాధించుదైవమే కాన యీమెకు పర్యుషితనివేదనము దోషము కాదు. ఆ తరువాత కన్నెపడుచులు చక్కని పాటలు పాడుచు గొబ్బిళ్లచుట్టును తిరిగి గొబ్బితట్టుదురు. ఒక గొబ్బిపాట—

చందమామ చందమామ ఓ చందమామ
చందమామ పిల్లలే నీలగిరికన్నెల్లు
నీలగిరికన్నెలకు నిత్యమల్లెతోట
నిత్యమల్లెతోటలో మంచినీళ్లబావి
మంచినీళ్లబావికి బంగారుగిలక
బంగారుగిలకకు వెండిచేంత్రాడు
వెండిచేంత్రాడుకు గిలకల్ల చెంబు
గిలకల్లచెంబేసి బుడిగిబుడిగిముంచ
బుడిగి బుడిగి ముంచంగానె జీడిగింజ చిల్లె
జీడిగింజ చిట్లంగానె నాకు బొమ్మ చిక్కె
ఆ బొమ్మపే రేమి రఘురామసీత

* * *

జత్తుజత్తుజుత్తులో జాఱుబావిళ్లు
నడచేటి కాళ్లకు నాగుకడియాలు
ఊరిచేటి చేతులకు ఉస్తికంకణాలు
అత్తగా రిచ్చింది అల్లంబెల్లంచీర
మామగా రిచ్చింది మల్లెమొగ్గల చీర
ఆ చీర కట్టకొని ఆట్లాడబోయె
గొబ్బెమ్మ గొబ్బెమ్మ ముమ్మొకాయి గొబ్బెమ్మ

* * *

ఏనుగులు గిరులపై గోరాడుట గొబ్బిళ్లు కొట్టుటవలె నుండినదని పోతన వర్ణించినాడు. చూడుడు—

కలభంబుల్ సెరలాడు బల్వలము లా
ఘ్రాణించి ఎట్టాడుచుఁ
ఫలభూజంబులు రాయుచుం జివురుజొం
పంబుల్ వడిఁ మేయుచుఁ
బులులఁ గాననుపోతులఁ మృగములం
బోనీక శిక్షించుచుఁ
గొలకుల్ సొచ్చి కలంచుచుఁ గిరులపై
గొబ్బిళ్ళు గోరాడుచుఁ

భాగ -౮-౩౫.

ఏనుగులు తొండములతో నేలపై నున్న దుమ్మెత్తి యాకసము మీదికి జల్లుట కన్నెలు క్రిందికి వంగి చేతులు వ్రాల్చి గొబ్బిళ్లు తట్టి మీదికి చేతు లెత్తుటవలె నుండినదని భావము.

ఇట్లు మార్గశీర్షము తొలిదినమునుండి భోగివఱకు నాడునాడు పెట్టిన గొబ్బిళ్లను పిడుకలు తట్టి వాని నన్నిటిని నొకమాలగా గ్రుచ్చియుంతురు. వీనికి 'భోగిపిడుకలు' అని పేరు. భోగినాడు క్రొత్తకుండలలో క్రొత్తగా బండిన వరిబియ్యమును పొంగళ్లు పొంగించుటకు ఈ పిడుకలనే యుపయోగింతురు. గ్రామములలో గొబ్బికి నివేదనము గావించుటకు గావలసిన క్రొత్తకుండలను కుమ్మరి ప్రతిసంవత్సరమును జేసియిచ్చుట వాడుక. కుమ్మరి గొబ్బికిగా క్రొత్తకుండ లిచ్చువాడుక 'హంసవింశతి'లో బేర్కొనబడినది—

దేవకార్యములకు దిరునాళ్లకును మహో
త్సవములకును గంగజాతరలకు

సంప్రోక్షణములకు జన్నములకు పెండ్లి
వడుగునోములకును వ్రతములకును
సత్రంబులకు సహస్రంబులకును సమా
రాధనపితృకార్యయాగములకు
బంధుగులకు నాలపంబులకును బొంగ
లికిని దేవకు గొబ్బికిని నడరు
జంగమార్చనలకు బాలదాసభోజ!
నములకును దండువెట్టికి నగరివారి
కొండబక్కలకును భిక్షుకులకు నైన
గొఱితవడకుండ గుండలా కుమ్మరిచ్చు

హంసవింశతి

ప్రఖ్యాతసంకీర్తనాచార్యులగు తాళ్లపాకవారిరచనములలో నీ గొబ్బిళ్లపాటలు అనేకములు కలవు. వారు అల్లోనేరేళ్లు, గొబ్బిళ్లు సువ్విసువ్వాలలు, జోలలు, ఏలలు, కూగూగులు మొదలగు దేశిరచనా ప్రభేదముల నెన్నిటినో విరచించిరి. అల్లోనేరేళ్లు, గొబ్బిళ్లు నను నీ దేశిరచనల తుదల చేర్కొనబడు అల్లోనేరేళ్లు, గొబ్బిళ్లు అనునవి కొంతకాలమునకు దమయర్థములను గోల్పోయి నమస్కారపర్యాయ వాచకము లయినవి. చూడుడు—

మాయాస్థలిలో మధుసూదనునకు
నిరతం బల్లోనేరెళ్లను కొని
కాశస్థలి భోగశయానునకును
నమరగ నూర్ధ్వశయంబు జొనపుచును
దలప నవంతీస్థలిలో నవనీ
పతిదేవునకును బ్రాంజలు లిడుచును
ద్వారవతీయాదవకుల భర్తకు
దాళహస్తములు దప్పక కొట్టుచు
వజ్రపురిని దావలమై చిక్కిన
గోపప్రియునకు గొబ్బిళ్లనుచును—

అల్లోనేరేళ్లు, గొబ్బిళ్లు అనునవి ప్రాంజలులు, తాళహస్తములు ననువానితోబాటు నమస్కారపర్యాయవాచకములుగా నిందు చేర్కొనబడినను నా చరణములనే పాటగా జదివినయెడల నవి యల్లోనేరేళ్ళు, గొబ్బిళ్లు నను దేశిరచనల తునుకలుగా మనము గుఱుతింపగలము. చూడుడు—

"మాయాస్థలిలో మధుసూదనునకు
నిరతం బల్లోనేరేళ్లు—"
ఇది అల్లోనేరేళ్లను దేశిరచనపుదునుక—
"వజ్రపురిని దావలమై చిక్కిన
గోపప్రియునకు గొబ్బిళ్లు—
ఇది గొబ్బిళ్ల పదముతునక—"

ఈ అల్లోనేరేళ్లు, గొబ్బిళ్లు క్రమముగా దమతమతనములను గోలుపోయి నమస్కారపర్యాయవాచకములుగా రూఢము లయినవి.

పూర్వకాలములో వివాహము కానికన్నెలు ఈ గొబ్బిళ్ల పాటలను తప్పక నేర్చెడివారు. వారు నేర్చియుండవలసినవానిలో గొబ్బిళ్లపాటలును నొకటి—

'పెళుకునందములు గొబ్బిళ్లపాటలు కొప్పు
సరించు నేర్పు చేసన్నవగలు'—వారికి గరతలామలకములు.

ఈ గొబ్బిళ్లు కన్నెలు మాత్రమే జరపుకొను వేడుక కాదు. బాలురును నీ క్రీడావిశేషమున బాలుగొనుచుండిరి. రామకృష్ణులు గొబ్బిళ్ల నాడుచుండినటుల విష్ణుపురాణమున చేర్కొనబడినది. బాలికలు సమర్తాడినపుడును గొబ్బిళ్లు తట్టి వేడుక జరుపుదురు.

నెల్లూరు మండలమునందును, రాయలసీమలోను గొబ్బిదేవి యారాధనమునకు సంబంధించిన యొక యాచారము వాడుకలో నున్నది. దానిగూర్చి యొక వింతకథయు జెప్పుదురు—

గొబ్బిదేవి కాటమరాజుగారి యింటి ఆడుపడుచట! అత్తవారింట నున్న తన సోదరికి గొంత భూమి యీయవలయునని కాటమరాజు తలచుచుండినాడు. అందుకై కొంత భూమిని ఆమెకయియే ప్రత్యేకించినాడు, కాని పాపము! అది యామె కీయకయె యతడు చనిపోయినాడు. ఇది యెఱిగిన గొబ్బిదేవి తన సోదరుని కోరిక నెరవేర్చుటకై ప్రతిసంవత్సరమును దనకై తనసోదరు డీయ దలచిన యా బీడున వెలసి పుట్టింటివా రొసగిన విందుగుడుపుల నారగించి తిరిగి యత్తవారింటికి బోవును—

గ్రామములలో నేటికిని 'కాటమరాజుబీడు'ని కొంత ప్రదేశము ప్రత్యేకింపబడియుండును. ఆ ప్రదేశములలో నెవరయినను పంటలు పండించుకొనవచ్చును. అందులకు సుంకముగాని, కౌలుగాని యెవరికి నీయనక్కఱలేదు. కాని సంక్రాంతిపండుగనాటి కాబీడులోని పైరు కోతలు ముగిసి యాబీడు పరిశుభ్రముగా నుండవలయును. అందు కొంత ప్రదేశములో నొక బొమ్మరిల్లు గట్టి యందు మట్టితో కాటమరాజు, గొబ్బివిగ్రహముల జేసి యుంతురు. ఆ మూడు దినములును తొలుత గొబ్బికి పొంగిళ్లు నైవేద్యము పెట్టి పిదప కాటమరాజునకు నైవేద్యము పెట్టుదురు. తన సోదరి గొబ్బి భుజించినపిదపగాని కాటమరాజు భుజింపడట! పిదప నా నివేదనము చేసిన పొంగిళ్లను 'పొంగలో పొంగలి'యని కేకలు వేయుచు నా బీటిలోనికి దెచ్చియున్న పసువులకు జల్లుదురు.

ఇది కట్టుకథయే కావచ్చును. కాని యీ సంప్రదాయము మాత్రము నేటికిని కొనసాగుచునే యున్నది. దానిని మనము కాదనలేము. 'పసువులపండుగ' జరుపుకొను రైతుప్రజానీకమునకు గొప్ప పసుసంపదతో రాజ్యమేలిన కాటమరాజు ఆరాధ్యు డగుట వింత కాదు. ఈ ఇంట బుట్టిన ఆడుపడుచులను బుట్టింటికి బిలుచుకొనివచ్చి యాదరించుటయు మనకు క్రొత్త కాదు. తెలుగునాటిలో నున్న యీ యాచారములకు పూర్వు లెవ్వరో ఈ కథలో నొక సంగతి కుదిర్చి గొబ్బిదేవిని కాటమరాజునకు సోదరి యని చెప్పి గొబ్బియారాధనమును దేశీయము చేసిరి. ఇందుచే గొబ్బిదేవికి ప్రజాసామాన్యములో నొక విశిష్టస్థానము లభించినది. ఈ కథకు సంబంధించిన దయి సంప్రదాయము లోకములో రూఢమయిపోయినది. భోగి, సంక్రాంతి, కనుము - ఈమూడుదినములు ముచ్చటగా గొబ్బికి పూజలు, పురస్కారములు, విందుగుడుపులు జరగించి పులగములు పొంగిళ్లు పెట్టి తరువాతిదినమున నదీతీరములకుగాని, చెఱువుగట్లకు గాని గొబ్బిదేవరను గొనిపోయి గొబ్బిళ్లు తట్టి, పాటలు పాడి, నీళ్ళలో నోలలాడింతురు. గొబ్బిదేవిని జలములో గలిపి పిదప :—

నిన్న వుండిన గొబ్బెమ్మ
నీళ్లలోకి పోతివా

మన్న వుండిన గొబ్బెమ్మ
మడుగులోకి పోతివా

(56 వ పేజీ చూడుడు)

మంచూరియా మాయాజాలము

[మావ్ సీటుంగ్‌కు మాస్కో-వర్గాలకు ప్రస్తుతం చాలా జోస్తీ ప్రకటితమౌతున్నా, చైనా-రష్యాబాంధవ్యాల మంచూరియా, పొరపులకు కారణమయ్యే ఆస్కారముంది. చైనాపారిశ్రామికాభివృద్ధి ప్రణాళికల కన్నిటికీ, మంచూరియాయే రంగస్థలం కావలసిఉన్నది. సుప్రసిద్ధవిలేఖరి ఆండ్రూరాత్, తన చైనాపర్యటనలో అక్కడి విశేషాలన్ని గాఢంగా మనస్సుకు హత్తించుకొని వచ్చాడు. మంచూరియామీద అతడు వ్రాసిన రెండువ్యాసాలలో ఇది మొదటిది. భావిచైనా-రష్యా బాంధవ్యాలకు మంచూరియాయే కీలకమని రచయిత ఈ వ్యాసంలో వెలువర్చాడు.]

దురవగాహమైన ప్రాచ్య ఖండంలో అన్నిటికన్నా దురవగాహమైనది మంచూరియా. జనాభాలో ఫ్రాన్సుకు సమానము - విస్తీర్ణంలో ఫ్రాన్సుకు రెండింతలు - ఈ మంచూరియా, చైనాపారిశ్రామికాభివృద్ధికి చైనా రష్యాల బాంధవ్యవిరోధాలకు కీలకస్థానము. అయినప్పటికీ, అక్కడి పరిస్థితులలోని శీఘ్రగమనాలను, నిష్పాక్షికంగా అవగాహనచేసుకోగలగటం, అతికష్టము అని, ఈ రచయిత గత రెండు నెలల్లో, దక్షిణ మంచూరియా-పీపింగ్ టీన్స్టిన్ - రంగాలలో పర్యటనఫలితంగా తెలుసుకోగలిగాడు.

నాన్‌కింగ్, షాంఘైల పతనాల మధ్యకాలపు బీభత్సంలో, ఒక ప్రముఖవ్యక్తితో సార్థకమైన ముఖ్యవిషయాలను ప్రస్తావించే అవకాశం కలిగింది. నేను సేకరించుకొన్న విషయాలన్నీ ఆ ముఖ్యసూత్రంచుట్టూనే కేంద్రీకృతమై ఉన్నాయి. నాతో మాట్లాడిన వ్యక్తి ప్రపంచంలోని ప్రముఖ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లానింగ్ ఇంజనీయర్లలో ఒకరు. కమ్యూనిస్టు చైనా ఎంతవరకు పారిశ్రామికం కాగలదో, అయితే అందులో మంచూరియాకు స్థానమెంతో, సరిగ్గా అంచనా వేసి చెప్పగల అర్హతఉన్న కొద్దిమందిలో ఈయన ఒకడు అమెరికన్ ఇంజనీరు. రష్యాలో జన్మించాడు. పేరు డాక్టర్ సోలోమన్ ట్రోన్. జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీలో పేరు తెచ్చుకొన్నాడు. సోవియట్ పంచవర్షప్రణాళికలో, ప్రముఖ కార్యక్రమమైన "డ్నీపిస్ట్రాయ్‌డామ్"-హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రణాళికకు రష్యనులు ఈయన్ను పిలిపించారు. సోవియట్ పారిశ్రామోద్ధరణ ప్రణాళికలను మొదటినుంచీ సన్నిహితంగా పరిశీలించగల్గిన అవకాశం ఈయనకు కల్గింది. ఈమధ్యనే రెండేళ్లు నాన్కింగ్ ప్రభుత్వ పారిశ్రామికప్రణాళికలకు పునాదులువేస్తూ గడిపాడు. నూతన చైనాప్రభుత్వానికి కూడా సలహాదారుడుగా నిలచిపోవచ్చు

[ఆండ్రూరాత్]

నేమోనని ఆశించాడు గాని, ఈనాడు, రష్యాలో పనిచేసిన సుగుణం ఉన్నప్పటికీ రష్యన్ పారిశ్రామికోద్ధరణకు మూలస్తంభమైనప్పటికీ, అమెరికన్ అయినందున, చైనాలో తనకు భవిష్యత్తు లేదేమోనని అనుకొంటున్నాడు.

తక్కిన అమెరికన్ పరిశీలకులవలెగాక - చైనాలో, రష్యాలో వచ్చినంత శీఘ్రంగానూ పారిశ్రామికాభివృద్ధి తెప్పించవచ్చునని, డాక్టరు ట్రోన్ అభిప్రాయపడుతున్నాడు.

"పారిశ్రామికాభివృద్ధిలో ప్రధానమైన పెట్టుబడి, కూలి" అని ఆయన సూచించాడు. సోవియట్ల పురోభివృద్ధి ప్రారంభించిననాడెందరు కార్మికులున్నారో (ఇరవైలక్షలు) అందరు ఫ్యాక్టరీకార్మికులు ఈనాడే చైనాలో ఉన్నారు. ఇంక కార్మికులు కాదగ్గవారి సంఖ్య రష్యాకు మూడింతలు ఉంది. చైనా ఖనిజసంపద రష్యా అంత విస్తృతంగా లేకపోయినా, ఇంకా పరిశోధించవలసిన దేశం చాలా ఉంది. ఆ ఆరంభంలో సోవియట్లకు, ఇప్పటి చైనాకన్నా ఎక్కువ పారిశ్రామికయంత్రాలు, ఎగుమతులకు ముడిపదార్థాలు, ఎక్కువ మైళ్లు ఆక్రమించుకొన్న రైలుమార్గాలు ఉన్నమాట నిజమే. అదీకాక, చైనాప్రజల జీవితప్రమాణాలను ఇంతకన్నా అధమస్థితులలోకి తగ్గించటం అసంభవం. తద్వారా పౌర ధనాన్ని దేశపారిశ్రామికాభివృద్ధికి ఉపయోగించుదామని భావించటంకూడా చాలా కష్టం. అయినప్పటికీ, నేటిచైనా నాటి రష్యా అంతటి 'ఏకాకి' స్థితిలో లేదనీ ఆనాటిరష్యన్ల కన్నా జాతి వికసనము, జాతీయ అభివృద్ధిప్రణాళికలూ ఎక్కువగానే కలిగిఉన్నదని డాక్టరు ట్రోన్ విపులపరిచారు. ఇప్పటికే కూమింటాంగ్ స్థాపించిన నేషనల్ రిసోర్సెస్ కమిషన్‌లో సునిశితులైన 15,000 మంది ఇంజనీర్లూ, టెక్నీషియన్లూ, మేనేజర్లూ ఉన్నారు. రష్యాలో తరిఫీదుపొందిన డజను మంది చైనాకమ్యూనిస్టుయువకఇంజనీయర్లు, అభివృద్ధిప్రణాళికలలోను, నిర్మాణాలలోనూ అనుభవంకలవారున్నారు. అక్కడికీ ఇక్కడికీ, అభివృద్ధికి కల పరిస్థితులలో తేడా లేదు. రష్యాలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చేనాటికి ఆప్రభుత్వానికి ఉన్న రాజకీయ విజ్ఞానంకన్నా, ఈనాడు ప్రభుత్వంలోకివచ్చిన చైనా కమ్యూనిస్టులకు రాజకీయవిజ్ఞానం చాలా ఎక్కువ. దేశప్రజలను వాళ్లకంటే ఎక్కువ బాగా కూడగట్టుకొనిరాగలరు.

డాక్టర్ ట్రోన్‌తో సంభాషణలలో, ప్రసంగం ఇట్టే మంచూరియా మీదికి మారింది. చైనాపారిశ్రామికాభివృద్ధివిషయంగాని, చైనా రష్యా భవిష్యద్బాంధవ్యాలనుగురించి గాని మాట్లాడేటప్పుడు సహజంగా మంచూరియా ప్రసక్తి వచ్చి తీరుతుంది. చైనా పారిశ్రామికప్రణాళికకు దేనికైనా మంచూరియా కీలకం కాక తప్పదు.

మంచూరియాలో కనివిని ఎరుగనంత ప్రకృతిసౌభాగ్యం ఉంది. 2700 కోట్ల

టన్నుల బొగ్గు నిలవగల బొగ్గుగనులు ఉన్నాయి. శతకోటిటన్నుల ఇనుము నిలవగల ఇనుపగనులు, ఇంకా చాలా విలువలుగల, అల్యూమినియమ్ మొలిబ్డినమ్, మాగ్నసైట్ మొదలైన ఖనిజసంపద - అపారమైన నిల్వలుగల, రాగి, సీసము తుత్తినాగము గ్రాఫైట్, బంగారం, పెట్రోలు, గనులూ ఉన్నాయి. 540 లక్షల ఎకరాల విస్తీర్ణాన్ని మంచి కలప ఇచ్చే అడవులున్నాయి. రష్యన్ అధీనంలో ఉన్న అర్గున్, ఉస్సూరి అమూర్ నదుల జలశక్తులను ఉపయోగించుకోనిస్తే, హైడ్రో-ఎలక్ట్రిక్ శక్తికూడా ఎక్కువ లభిస్తుంది. చైనా ధాన్యరాసులు ఎగుమతి కూడా మంచూరియానుంచే ఎక్కువ జరుగుతుంది. ఈ ప్రదేశంనుంచి ఎగుమతిఅయ్యే సోయాబీన్సు, ఏడాదికి సగటున 2,500,000 టన్నులుంటాయి. దీనిమీద నేటిధరలలో ఆదాయం 400,000,000 డాలర్లు ఉంటుంది. ఈ ఆదాయం చైనాదిగుమతుల వ్యయాన్ని సరిదిద్దుకోటానికి చాలా సహాయపడుతుంది. పారిశ్రామికంగా చూచుకొంటే, తక్కిన చైనా అంతా ఒకఎత్తూ, మంచూరియా ఒక ఎత్తూ, అని చెప్పవచ్చును.

మంచూరియాకున్న ఈ భాగ్య సంపదలు ఎందరికో కన్నులుకుట్టాయి. అందుకనే అందరికీ, "సమస్య" గానా, "కుస్తీల గోదా" అన్నమాటకి పేర్కొనబడుతూంటుంది.

మూడువందల ఏండ్ల క్రిందట మంచూలు ఈ భాగ్యంతో మత్తిల్లి చైనా గ్రేట్ వాలును దాటుకొని సామ్రాజ్యతృష్ణతో దక్షిణానికి చొచ్చుకొనివచ్చారు. ఈనాడు వారంతా చైనా ప్రజలలో లీనమయిపోయారు. 19 వ శతాబ్దాంతంలో, రష్యన్ జారు చక్రవర్తి, ఫ్రెంచి ధనికవర్గాలప్రోత్సాహంతో, సముద్రపు రేవుపట్టణమూ, రైల్వేసౌకర్యాలూ, కలదేశంకోసం ఇటు చొచ్చుకొని వచ్చాడు. బ్రిటిష్, అమెరికావారలకుకూడా, ఇటు కన్ను ఉంది. కాని ఈ తగాదా జపాను పెట్టుకొంటే దక్షిణ ఆసియాలో జపాన్‌తో పోటీ తమకుతప్పకుండదనే అభిప్రాయంతో, రష్యాకు విరుద్ధంగా జపానును పురికొల్పి జపాను వెనుక నిలిచేందుకు నిశ్చయించుకొన్నారు. 1904-5 లో రష్యా జపానీస్ యుద్ధమూ, 1918-22 లో ఆసియాఖండంలో జపాను చర్యలూ, 1931-32లో జపాన్ చేసిన దాడీ, అన్నీకూడా మంచూరియాను తమ ఖండాంతరవ్యాప్తికి ప్రాతిపదికగా చేసుకొందామనే జపానుప్రయత్నంలో భాగాలే.

గత దశాబ్దంలో, జపాను ధనము, (200 కోట్ల అమెరికన్ డాలర్లకు సమానపు మొత్తం) జపాను పారిశ్రామిక నైపుణ్యం, చైనీయకూలీ శక్తి, అన్నీ కలిసి మంచూరియాను (మంచూకువో అని జపానువారు పిలిచేవారు) ఆసియా ఖండంలోకల్లా (జపాను రష్యాలను మినహాయిస్తే) ప్రథమపారిశ్రామికస్థానంగా చేసివేశాయి. ఏటా బొగ్గు ఉత్పత్తికి 3 కోట్ల టన్నులు దాటింది. అన్షాన్‌లో ఉక్కు కర్మాగారాలు, ఏటా 20 లక్షల టన్నుల ఇనుమును 25 లక్షల టన్నుల ఉక్కునూ ఉత్పత్తిచేసేవి. తక్కినచోట్లకూడా ఇంకా తయారయేది. మంచూరియాలోని ముఖ్య పారిశ్రామికపట్టణమైన ముక్డెన్ జనాభా 20 లక్షలు. వీరిలో 360,000 కార్మికులు, నాలుగువేల వివిధకర్మాగారాలలో పనిచేసేవారు ఉన్నారు. ఈ ఫ్యాక్టరీలలో, టాంకులు, మోటార్లు, విమానాలు, యంత్రపు పనిముట్లు, రబ్బరు, ఎరువులు, మొదలైనవి తయారుచేసే ఫ్యాక్టరీలుకూడా ఉన్నాయి. అయితే, ఈతయారువస్తువులకు సంపూర్ణ స్వరూపం ఇచ్చే కీలకాన్ని మాత్రం జపానువారు తమ చేతుల్లోనే, జపానునడిగడ్డపై జరిగేటట్టు అట్టిపెట్టుకొనేవారు. ఏమయినా, పారిశ్రామికంగా ఉన్న సత్తానుబట్టి చూసుకొంటే, యూరప్‌లోని రెండవ రకపు పారిశ్రామిక దేశాలైన, బెల్జియం ఇటలీలతో సమానంగా ఉంటుంది మంచూరియా. చైనా కమ్యూనిస్టులు మంచూరియా సమకూర్చిన పరికరసంపత్తితోనే, చైనాను సగానికి పైగా నెగ్గటానికి అనువైంది.

యుద్ధానంతరం, కమ్యూనిస్టులు, కొమింగ్‌టాంగ్ కూడా, మంచూరియాకోసమని ఎగబడ్డారు.

1945 ఆగస్టు 11 న, కమ్యూనిస్టుదళాలలో మారికలైన దళాలను ఉత్తరాన యేనాన్ నుంచి మంచూరియాపైకి క్షిప్రంగా పరుగులుతీయించారు. షాంటుంగ్ సైన్యాలను పడవలమీద ఉత్తరంగా పంపారు. ఈ రెండు సైన్యాలు మంచూరియాలోని కమ్యూనిస్టువలంటీర్లతో కలిసి చేతులు కలపాలని వారి వ్యూహము. చిత్రం ఏమిటంటే, చైనా కమ్యూనిస్టుయుద్ధవ్యూహరచనలో ప్రసిద్ధుడైన జనరల్ లిన్ పియావో, ఒక అమెరికన్ సైనికవిమానం



మావో-సీ-టుంగ్

లోనే మంచూరియా చేరగల్గాడు!

అమెరికా ఇచ్చిన మోటారువిమాన పడవలన్నీ మంచూరియాను పట్టుకోనేందుకే కొమింగ్‌టాంగ్ ఉపయోగించింది. బెర్లిన్ ఎయిర్‌లిఫ్టుకోటి సరిసమానపు ఫాయిదాలో, అంతకుముందు అమెరికా సహాయంతో, ఇండియా బర్మా ఉత్తర చైనాలనుంచి అమెరికన్ శిక్షణ పొందిన చైనీయ సైనికులు, సప్లైయిలు, దక్షిణమంచూరియా చేరాయి. అమెరికన్ నౌకాబలము, భూసైన్యమూకూడా దక్షిణమంచూరియా దగ్గర చేర్చబడ్డాయి. అక్కడ మునుపు జపాన్‌వారి అధీనంలో ఉన్న "బొమ్మ" సైన్యాలను, చాంగ్ కై షెక్ కొమింగ్ టాంగ్ సైన్యంలోకి చేర్చుకొని, మంచూరియారక్షణకు వాటిని నియమించాడు.

మంచూరియా తన చేతిలో ఉండటం చాలా అవశ్యమనే, చాంగ్ ఎప్పుడూ భావిస్తూవచ్చాడు. 1946 లో, శాంతిసమావేశాలు జరుగుతూన్నప్పుడు, యుద్ధవిరమణ ఒడంబడికలు, మంచూరియా మినహాగా తక్కిన చైనాకంతకూ వర్తింపచేసుకోటానికి అభ్యంతరంలేదంటూ వాదించాడు. మంచూరియాగడ్డను ఆధారం చేసుకొనే కమ్యూనిస్టులను పొడిపొడిగా నలగగొట్టివేయగలనని ఆశించాడు. కాని అంతకన్నా చాకచక్యం ఉపయోగించి, కమ్యూనిస్టులు పరిస్థితిని తారుమారు చేయగలిగారు.

విలయము

(24 వ పేజీ తరువాయి)

భార్య : ఏడిసినట్టే ఉంది! ఇంత ఖర్చూ పెట్టించి, తీరా కుదరకపోతే, మీకు నమ్మకం చాలదని ఇదో పైమాటా? పదండి తిరిగిపోదాం. యోగీ అక్కర్లేదు—జోగీ అక్కర్లేదు. ఏమండోయ్ ఈ క్షణాన్ని నన్ను ఇక్కడినుంచి ఇంటికి తీసుకుపోతారా, పోరా?

పర : సరే అల్లాగే చూసివెళ్లి పోదాంలేవే. బాబూ మీ రేమనకోకండి. దానికి రోగంతో మనస్సు చలించి ఇల్లా తిక్కగా పిచ్చిమాట లాడుతూంటుంది. పోనీ, ఎల్లాగో మీరైనా యోగిగారి దగ్గిరకు మమ్మల్ని తీసికెళ్లండి.

నారా : పరదేశిగారూ. మీరు రామదాసుఇంద్రజాలంలో పడిపోయారు గాని, ఈయన్ని చూశేందుకు ఒక అంతు, ఆజ్ఞ, పురమాయింపూ ఏమీ అక్కరలేదు. మీరే స్వయంగా లోపలికి వెళ్లి చూసిరండి.

పర : (సంతోషంతో) వెళ్లవచ్చునంటారా! సరేలే రావే. లోపలికి రావే.

భార్య : నేను రాను. నన్ని పళాన ఇంటికి తీసుకుపోవలసిందే.

పర : అయ్యోరామా. ఇదెక్కడి ఖర్మమే. ఈయన్ని చూడటానికి అనివచ్చి ఇప్పు డింత మొండిపట్టు. అయినా గాలీ వానా ఇల్లా ఉండగా ఇప్పుడెల్లా వెళ్ళేది. కొంత తగ్గాక వెళ్దాం.

(సంగి ఆదుర్దాగా లోపలినుంచి ప్రవేశించి)

సంగి : నారాయణా! ఇంకా ఇక్కడే ఉన్నావా! ఇప్పుడు గురువుగారి దర్శనం చేసుకొనేందుకు ఎవళ్లకీ వీలుండదట. ప్రాణాల మీద ఆశ ఉన్నవాళ్లు ఎవళ్లూ ఈ పరిసరాలలో ఉండకుండా వెంటనే పట్టణానికి పారిపొమ్మన్నారు.

పర : ఆఁ. ఆఁ. ఏమిటి విశేషం?

భార్య : ఏమిటే. ఇంతకూ నన్ను చూడనంటాడా, మీ యోగిగారు? (వెక్కిరి నవ్వు నవ్వుతూ) నా రోగం కుదర్చలేనని ఒప్పుకొన్నాడన్నమాట. మరి మమ్మల్ని ఇంత యాతన ఎందుకు పెట్టాడో చూసి కనుక్కొంటేనేగాని నేను కదలను.

సంగి : అయ్యో పిచ్చిగొడవ. పద నారాయణా! ముందు మందిరంలోనూ అంతటా అందరికి చెప్పు. పద! ఈ సముద్రతీరాన్ని ఒక్క పురుగైనా నిలవనీకుండా వెంటనే పంపించెయ్యమని బాబు చెప్పాడు.

నారా : అయితే ఏదో ప్రళయ ముందన్నమాటే. ఇది మళ్లీ ఉప్పెన తెస్తుందేమో!

పర : ఆఁ. ఆఁ. ఉప్పెన వస్తుందా. అయ్యో. అయ్యో. ఇంటికైనా చేరేంగాదు. ఇప్పుడేంగతి! ఒసేవ్ పదవే ముందు.

భార్య : ఉప్పెన ఎల్లా ఉంటుందో చూడాలి. నే నిక్కడే ఉంటాను.

నారా : అదికాదమ్మా.

సంగి : ఏమిటి నారాయణా. ముందుపదా. అక్కడ అందరికి చెప్పివద్దాం. ఏమయ్యోయ్ నీ భార్యను బలవంతంగా బుజాన్నేసుకునైనా ముందు ఇక్కడనుంచి పారిపో. దా. నారాయణా పోదాం. చెప్పివద్దాం.

(ఇద్దరూ వెళ్తారు. ఉరుములూ, గాలిహోరూ ఎక్కువౌతాయి.)

పర : హుహు. భయమో చలో కూడా తెలియటంలేదు. రావే పోదాం. ఇక్కడుంటే ప్రాణాలు నిలవ్వు.

భార్య : మరి యోగిగార్ని చూద్దామనరూ!

పర : చస్తూంటే సంధిమంత్రంలాగుంది, పోనీ చూద్దాం ఆగు అప్పటికైనా తెములుతావేమో.

పర : (తడికకొట్టి) గురూ. యోగిగారూ. లోపలికి రమ్మని సెలవా! (నిశ్శబ్దం)

భార్య : అడిగేదేమిటి లోపలికి పోక? ఏమిటింత చీకటిగా ఉందే!

పర హుష్. వెనక్కి రావే. (భార్యను బరాబరా వెనక్కు లాగుతాడు) అక్కడ మన కేమీ కనబడదు. ఆయన ధ్యానంలో ఉన్నారుగామాలు. మాటాడటంలేదు. ధ్యానానికి భంగం కల్గిస్తే ఏమవుతుందో. పద ముందు ఇంటికి పోదాం. తర్వాత మళ్ళీవచ్చి దర్శనం చేసుకోవచ్చు.

(రామదాసు, రాజారావు ప్రవేశం)

రామ : ఏరీ. యోగిగారి నడుగుతాను? ఇంత హంగామా చేస్తాడా. ఇక్కడ సముద్రం పొంగి ఇక్కడివాళ్లంతా చచ్చిపోతామని ఈ నారిగాడికి సంగికి యోగిగారు చెప్పారా? నా బొంతా నేనూ మునిగిపోతామా?

రాజా : నా మేడ, నేను కట్టిన మందిరము అన్నీ కుప్పగా కూలిపోతాయని అన్నాడా యోగిగారూ? ఏమండీ పరదేశిగారూ మీరు ఇక్కడే ఉన్నారే? యోగిగారు అనగా మీరు విన్నారా?

భార్య : వీళ్లెవళ్లు? వీళ్లేనా మన కిన్నాళ్లూ దర్శన విప్పించనిది? చూశారా అని అడుగుతారేం? తమ కేం తెలియనట్టు. ఎవర్నెయ్యా చూసేది? ఎవరూ లేకుండా చీకటి గుహపెట్టి తతంగం ఆడి మా డబ్బంతా లాక్కున్నారూ?

రామ : ఆగవమ్మా, ఆగు. మీ డబ్బుసంగతి తర్వాత చూద్దాం. ముందు యోగిగార్ని కలవాలి.

పర . ఆయన లోపల ఆ చీకటిలో కదలకుండా మెదలకుండా కూర్చున్నారండి. ధ్యాననిష్టలో ఉన్నట్లున్నారు.

రామ : ఈ నిష్ఠలన్నీ నా దగ్గర కాదు. తక్కినవాళ్లకు చూపించనీ! రండి రాజారావుగారూ. కనుక్కుందాం. (లోపలికి వెళ్లి) గురూ, మా ప్రశ్నకు జవాబు చెప్పాలి. (ఫెళఫెళా పిడుగు చప్పుడు గాలిహోరు సముద్రంహోరు మరింత ఎక్కువవుతుంది.)

రామ : చచ్చాను బాబోయ్. నిజమేలాగుంది. ఆయన కదలకుండా కూర్చున్నాడు. నే నింటికి పోతాను. ఆగు రాజారావు. ఏమిటీ పట్టుకోటం. నా బొంత వదులు.

రాజా: (ఏడుస్తూ) రామదాసూ! నాడబ్బంతా నాశనమేనా? ఈ కట్టినవన్నీ కూలిపోవలసిందేనా? అయ్యయ్యో. వీటికోసం ఎన్నిపాపాలు చేశాను. చివరకుమిగిలేది చేతికిచిప్పేనా (ఏడుస్తాడు.)

ప. భార్య : (వికటంగా నవ్వుతూ) ఇక్కడుంటే ఆ చిప్ప పట్టుకొనే ప్రాణీ మిగలదట.

పర : (ఆదుర్దాగా) రావే పోదాం. వీళ్ల జోలి ఎందుకు?

రామ : రాజారావూ వదులూ. నీ కర్మ నీది. నా కర్మ నాది. నే పోతాను.

రాజా : (ఏడుపులో కోపంతో) ఆ బొంతలో డబ్బులో సగం నాకు ఇస్తేనేగాని నిన్ను వదలను. నేను చిల్లిగవ్వ రొఖ్ఖంగా మిగుల్చుకోలేదు. అంతా ఇక్కడి ఇళ్లకు పెట్టాను. డబ్బంతా నువ్వు మిగుల్చుకున్నావు.

రామ : (కోపంతో విదిలించుకుంటూ) వదుల్తావా వదలవా? నీ బ్రతుకు నీది. నా బ్రతుకు నాది. నా పెళ్లాంబిడ్డలకూ, నాకూ, అక్కరలేదా?

పరదేశి : ఏమిటి! రామంమా! ఇంతటి లుచ్చాలా వీరిద్దరూ? నా మూడువందలూ కూడా కాజేశారా.

రాజారావ్: నాకు తెలియదు. వాడే తీసుకొన్నాడు.

(ఒక్క విసురుగాలితో కెరటం హోరుతో విసురుతుంది.)

రామ: ఈ పందిరివాసం విరిగి నెత్తిమీద పడింది. పరుగెత్తండ్రోయ్, పరుగెత్తండి.

రాజారావ్ : బాబోయ్. (అంటూ పారిపోతాడు.)

సంగి: (ప్రవేశించి) ఇంకా ఇక్కడున్నా వేమయ్యా. ముందు పారిపోండి. అప్పుడే ఊరిదోవలో ఉప్పుకయ్య నిలువులోతు దాటి నేల నిండుతోంది. ఇప్పుడే పారిపోండి.

పరదేశి : ఇది కాదు మార్గం. దీన్ని కావలేసుకొని ఎత్తుకెళ్తాను. (భార్య నేను రాను, నేను రాను అని యాగీ చేస్తూంటుంది. (లాక్కుపోతూంటాడు)

నారా : (ప్రవేశం.) ఉష్. అబ్బా. ఒక్క క్షణం ఆలస్యమయితే అవతలికి జేర్చలేకపోయేవాడిని, సంగమ్మా పందిరి కూలిపోయినట్టుంది. పాక ఎల్లా ఉంది? యోగిబాబును మందిరం మేడలోకి తీసుకెళ్దామా ?

సంగి : నారాయణా! మళ్లీ వెనక్కి వచ్చావేం, అటు ఊళ్లోకి వెళ్లిపోక? నువ్వు తీసికెళ్లిన వందమంది కయ్య దాటారా ?

నారా: నువ్వూ ముందర కొందర్ని పంపించినదానవు మళ్లీ వెనక్కు వచ్చావెందుకూ ?

సంగి: బాగానే ఉందిలే సరసం? అందరూ కయ్య అవతలికి పోయినట్లేనా ?

నారా: ఇంకా తండోపతండాలుగా వెళ్తున్నారు. రామదాసూ రాజారావూ ఒకళ్ల జుట్టు ఒకళ్లు పట్టుకొని కొట్లాడుకొంటూ ఒక అడుగు ముందుకూ ఒక అడుగు వెనక్కూ వేస్తున్నారు. ఆ పరదేశి స్పృహ లేకుండా ఉన్నాడు. పెళ్లాం నడిపించుకుంటూ తీసికెడుతోంది. (వణుకుతో) వీళ్లెవళ్లూ అట్టేదూరం వెళ్లి ఉండరు. ఉహూహూ అబ్బా, ఈ గాలి ఎముర్రొమ్మును విరగ్గొట్టేస్తోంది. సంగమ్మా, బాబుగా రెల్లా ఉన్నారు ?

సంగి : నే నింకా చూడలేదు. ఇదిగో (ఓ, ఓ అని కేక లేస్తుంటే)

(సముద్రము పెద్ద హోరుతో పెద్ద అల ముంచెత్తివస్తుంది. తుపానుహోరు పెద్ద కెరటం విరిగిన హోరూ ముంచెత్తుతుంది.)

నారా : (బుడ బుడ చీదరించుకుంటూ, గాలి వదల్తూ నీళ్లల్లో ఈదుతున్న చప్పుడుచేస్తూ కష్టంమీద కేకలేసినట్లు) సంగమ్మా! భ్రూ! భ్రూ! భ్రూ సం—సంగీ (ఈతకొట్తున్నట్లు కాళ్లూ చేతులు చప్పుడు చేస్తూ)

సంగి : (నోటిలో నీరు బుడబుడా ఉమ్మేసి) హు హూ. నారాయణా.

నారా : ఆ గడ పుచ్చుకో. ఆ కనప్పుడే దిబ్బమీదికి ఈదుకు పోదాం.

సంగి : నీరు వెనక్కు లాగేస్తూంది. నువ్వు పో. నన్ను వదిలేయ్.

(కాళ్లూ చేతులూ తపతప లాడిస్తుంది)

నారా : ఆగు. ఈ గడ పుచ్చుకో. ఇదిగో తిప్ప అందింది. కాలూని నిల్చో.

సంగి : అమ్మయ్య, కాలూనింది. దిబ్బపై కెక్కు.

(భూకంపమంతటి పెద్ద శబ్దాలతో దడదడలాడే పెద్ద చప్పళ్లతో మందిరాలన్నీ కూలిపోయినచప్పుడు)

నారా : ఆఁ! ఆఁ! మందిరం కూలిపోయింది.

సంగి : నారాయణా, చుట్టూ సముద్రం తప్ప ఏమీ కనపడ్డం లేదు. గురువు ఏరీ? పాక ఎక్కడికో కొట్టుకుపోయింది. గురూ, గురూ! (ఏడుస్తుంది)

నారా. అబ్బా. ఎన్ని శవాలు వెనక్కు కొట్టుకొస్తున్నాయేం! అబ్బా! ఎంత భీకరంగా ఉందో! సంగమ్మా, ఆమని షవరో కదులుతున్నాడు. ఇక్కడ నుల్చో. ఆ గడ ఇల్లా తే. పోయి ఈదుకు లాక్కొస్తాను. (ఈదుతో లోపలికి పోయినచప్పుడు.)

సంగి : నారాయణా! నారాయణా! ఆ మనిషిని వదిలెయ్యి. ఇల్లా రా. ఆ గడిల్లా తే. (బుడుంగు బుడుంగు మని చప్పళ్లు.)

నారా : సంగమ్మా అటు పట్టుకో దిబ్బమీదికి లాగు. ఎవరూ. రామదాసే. ఇదేమిటి రాజారావుకూడా.

సంగి : (నిట్టూర్చి) ఆ బొంతకోసం ఇద్దరూ పెనగులాడి అల్లాగే ప్రాణాలు వదిలారు.

నారా : చచ్చిపోయారా? ఇంత బరు వుందేమిటి? బొంతలో ఏముంది ?

సంగి: రామదాసుసంపాదించిన రూపాయలు అందులోనే ఉన్నాయి. ఆ బరువుకే ఇద్దరూ చచ్చారుగావును—

(అయ్యో, రక్షించండి మునిగిపోతున్నాం బాబోయ్! అని స్త్రీ కంఠం.)

సంగి: ఆ ఏడుపు ఎక్కడిదో చూద్దాం పద.

(ఈదుకొంటూ పోతారు. మళ్లీ ఒక పెద్దకెరటం విరిగిన చప్పుడు. సంగీ, నారాయణా అన్నవాళ్లిద్దరి కేకలూ సన్నగా వినపడుతుంటాయి.)

(ఒక్కసారి సముద్రంహోరు; సన్నగిలిపోతుంది.)

పరదేశిభార్య పరదేశి : బాబూ కొట్టుకు పోతున్నాం. గడ పట్టుకూడా తప్పిపోతూంది. అయ్యో, రామా రామా.

ఒకకంఠం : భయంలేదు. కొంచెం ఓపికతో ఈగడ గట్టిగా పట్టుకోండి. నేను పైకి లాగుతున్నాను. రండి. నేలఅందిందా? నెమ్మదిగా రండి.

భార్య : అయ్యో! ఈయన కూలిపోతున్నారు. బాబూ దయాళూ, ఎవరో ఇంకొంచెం దూరంగా లాగండి.

కంఠం : ఫరవాలేదమ్మా. ఇదుగో దిబ్బమీదికి వచ్చేశారు. కూర్చొని సేదతీర్చుకోండి. మీ కేం ఫరవాలేదు.

భార్య : (ఏడుస్తూ) ఏమండీ. ఏమండోయ్.

పర : (నీళ్లు డోక్కుని తేరుకొనిలేచి) ఆఁ! ఆఁ! ఎక్కడ ఉన్నాం? నేలమీదే ఉన్నామూ! ఎవరు బాబూ మమ్మ రక్షించిన దైవం?

భార్య: ఇదుగో వీరు. బాబూ, మీ పాదాలకు మొక్కుతాం! మీ ఋణం తీర్చుకోలేం! మీ పేరేమిటి బాబూ?

కంఠం: ఋణమేమీ లేదమ్మా. నాపేరు లచ్చన్న. (దూరాన మళ్లీ రక్షించండోయ్ అని చావుకేక) ఇక్కడే నిలబడమ్మా. ఫరవాలేదు. నేను ఇప్పుడే వస్తాను. (నీళ్లను తోసుకొంటూ పోతున్న చప్పుడు)

భార్య: అరెరె! నీళ్లమీదే నడిచిపోతున్నట్లున్నాడు!

(సంగీ, నారాయణ చెరోవైపునించీ ఈదుకుంటూవచ్చి దిబ్బమీదకి చేరుతారు)

సంగి: (నవ్వుతూ) నారాయణా! మళ్లీ ఎల్లాగో బతికాం.

నారా: సంగమ్మా బతికేఉన్నావా? బాబు కనపడ్డాడా? ఇదుగో పరదేశి-భార్యా. ఎల్లా బ్రతికారో! ఈ విడిప్పుడు బాగా తెలివిగానే ఉందే.


భార్య: ఔనాను బాబూ, మొదటి కెరటంతోనే నా రోగాలన్నీ పోయాయి. మా ఆయనకన్నా, ఇప్పుడు నేనే ఆరోగ్యంగా ఉన్నాను. మిమ్మల్నీ ఆ మనిషే ఇక్కడికి చేర్చాడా బాబూ?

సంగి: ఏమనిషీ?

పరదేశి: ఆయనపేరు లచ్చన్నట. మమ్మల్నిద్దరినీ కొనప్రాణంతో ఉండగా ఒక్కడ చేర్చాడు. ఇంకా ఎవర్నో బ్రతికించాలని నీటికెదురుగా నీటిమీద నడుస్తున్నట్లే వెళ్లిపోయాడు.

సంగి—నా: (సంతోషంతో) గురువుగారు బ్రతికేఉన్నారు. గురూ నమస్తే! ఆయనేనయ్యా మీరు చూద్దామనుకొన్న యోగిగారు!

భార్య: ఆఁ. ఆఁ. నిజంగానా!



జీవిత పద్మవ్యూహము
శ్రీ మా. గోఖ్లే.

స్వీకారము:

ఆలిండియా ఖాదీ స్వదేశీ పారిశ్రామిక ప్రదర్శనంలో (తమిళనాడు కాంగ్రెస్ యాజమాన్యంలో జరిగింది) చిత్రకళాశాఖకు సంబంధించి ప్రకటించిన ఆర్టుగాలరీ అన్న పుస్తకము మా కార్యాలయమునకు అందినది. చిత్రకళకు సంబంధించిన ముఖ్య వ్యాసములను ఈ ప్రదర్శనములోని, సుప్రసిద్ధ చిత్రకారుల చిత్రములను, ఈ పుస్తకములో ప్రకటించారు. పుస్తకము వెల రూపాయి. చిత్రములు బాగున్నవి. వీనిలో రెండు చిత్రములను ప్రకాశకుల సౌజన్యముతో ఇట పొందుపరుస్తున్నాము.



వ్రజకిశోర్
శ్రీ టి. వి. రత్నం.

పొంగళ్ళు

(19 వ-పేజీ తరువాయి)

లంటే ఎట్లాగన్నారు. బహుశః వారు తప్పు నెలలు లెక్క పెట్టియుండవచ్చు. ఈ జనవరి నెల తప్పితే, యింకా ఎన్ని తొమ్మిగులు మోయవలెనో చెప్పజాలమని మంత్ర తంత్రాంగ మెరిగిన మంత్రులు, మంత్ర సానులు, ఎరిగిన విషయమే.

"జే వి పి" రిపోర్టు మీద సంతకం చేసినా, ఢిల్లీనుంచి వీపీగా తాపీగా ఆంధ్రరాష్ట్రం వచ్చితీరుననే ధైర్యంతో ఎదురుచూడడానికి, తత్రాపి వ్యవధిలేదు. ఉత్తరాయణపుణ్యకాలం ప్రవేశిస్తోంది. రాష్ట్రంవస్తే రాజాజీగారి చేతిమీదుగా వారి సంతకంతో రావాలి. నా చేతిమీదుగా యివ్వాలనే అహంకారం నాకు లేదని ఆయన అన్నారు. ఆవిషయంలో ఆయనకు అహం వున్నా లేకపోయినా ఉత్సాహం సందేహం. అంతేకాదు హైదరాబాదు సంస్థానంలోనుంచి తెలంగాణా విడిపోవడం ఆయన కిష్టంలేదన్నారు. త్రిలింగక్షేత్ర ప్రాణప్రతిష్ఠకు శ్రీవైష్ణవు డంగీకరించునా? త్రిలింగదేశమంటే శివలింగముల పుట్ట. ఒక్క రాజమహేంద్రవరములోనే ఉన్నాయి ఒకటి తక్కువగా కోటిలింగాలు. "శివదీక్షాపరురాలనురా! శిలమెంతైనా విడువజాలనురా! శ్రీ వైష్ణవుడంటే చేరనురా!" అని ఆలాపన చేసినప్పటికీ, ఆనాడు ఆ శ్రీకృష్ణభగవానుడు శ్రీవైష్ణవుడైనా శివదీక్షాపరులమీదతన ప్రేమాతిశయం చూపించినాడు.

ఆ యమునాతీరమందు ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఆ కాలంలో లేరు. ఆయాగోపికలు యేయే మతాలవారైనప్పటికీ, అందరినీ ఒక్కకూటంగా చేర్చి తన వేణుగానలయబద్ధంగా, "అంగనా మంగనా మంతరే మాధవం. మాధవం మాధవం చాంతరే ణాంగనా" అని రాసక్రీడ లాడించిన ఏకైకనాయకుడు నెలసి అందరికీ అన్ని మూర్తులుగా అవతరించి దక్షిణ నాయకత్వం ఎట్లా ఉండవలెనో చూపించాడు.

గోపికలు వలయంగా చక్రాకృతిగా నిలువబడి నాట్యం చేశారు. పెరియాళ్వారు (విష్ణుచిత్తుని) కుమార్తెయైన ఆండాళ్ గోదాదేవి అనబడే చూడికుడుత్తనాంచారమ్మ శ్రీ విల్లిపుత్తూరునందలి శ్రీ రంగనాథస్వామిని తన భర్తగా వరించి యీ ధనుర్మాసంలో రోజుకొక మేలుకొలుపు కీర్తన రచించి తెల్లవారుజామున బాలగోపాల కృష్ణుని నిద్రలేపుటకై నృత్యంచేస్తూ గోపికలతో కలిసి పాడినట్లుగా పాడింది. ఆ కీర్తనలనే ముప్పదిరెండు పాశురములంటారు. మేలుకో కృష్ణా మేలుకో! అని అరవంలో "ఏలోరెంబావాయ్" అని ప్రతి కీర్తన ముగింపబడును. ఆ ముప్పదిరెండు పాశురములుగల తిరుప్పావైగ్రంథం అష్టపదులుగా తెనింపబడినది. "నందనందనుండు నేడు మందలోను గానరాడు. ఎందు బోయె సుందరాంగ డిందువదనరో" అని గొబ్బి తట్టుతూ పాడదగిన కీర్తనలవి.

గోపబాలురతో కృష్ణుడు యమునాతీరమున చల్దులారగించి ఆలమందల మేపిన చల్లని రోజులవి. ఆ గోపెమ్మలే నేటి మన వాకిటి గొబ్బెమ్మలైనవి. ఆ చల్దులే నేటి ధనుర్మాస ప్రాతఃకాలభజనానంతర భోజన ప్రసాదములైన దధ్యోదనములుగా, చక్ర పొంగలిగా, పులిహోరగా మారినవి. ఈ ప్రసాదము లన్నీ శుద్ధ శ్రీ వైష్ణవప్రసాదములు. ఇడ్లీ కాఫీలు మాత్రం కావని తోచెడిని. ఆ ప్రసాదములనీ చలికాలంలో ప్రాతఃకాలం ఆరగించి రక్తగతం చేసికొనగలిగినవాడే అసలైన శ్రీ వైష్ణవుడు. "వైష్ణవజనతో తేనే కహియే" వాడే నిజమైన వైష్ణవుడని చెప్పవలెను.

మకరరాశిలో సూర్యుడు ప్రవేశించగానే యీ ఉత్తరాయణపుణ్యకాలమందు భాస్కరప్రీతిగా పాలు బియ్యం పొంగించుట దక్షిణాచారమై యున్నది. మనం యీ సంక్రమణమును సంక్రాంతి అంటాము. సూర్యపరమైన యీ పర్వదినం వైష్ణవ భక్తిప్రధానమైనది. అయితే త్రిలింగ దేశస్థులైన త్రిలింగాయతులు సంక్రాంతి కూడా శివరాత్రివంటిదే అన్నట్లుగా, దీనినే సంకురాత్రి అన్నారు. గ్రామీణులు ఇంకా అపభ్రంశచేసి "సంకురేతిరిపండుగనాడు" అని కూడా ప్రయోగించారు. "శివరాత్రి" శివుని రాత్రి అన్నట్లుగా, 'సంకురాత్రి' శంకరుని రాత్రి అని స్ఫురించేటట్లుగా పదవిన్యాసం చేశారు. అరవవాళ్లు యీ పండుగనే "పొంగల్" అన్నారు.

కొత్త పంటబియ్యం, ఆవుపాలు, కొంచెం బెల్లంవేసి కొత్తకుండలో పొంగించి సూర్యునకు నివేదన చేస్తారు. ఈ రీతిగా పొంగించేదిగనుక "పొంగల్" అన్నారు. ఈ పండుగకు ఆ విధమైన నివేదన ప్రధానమని యెంచి వారు సంక్రాంతిని "పొంగల్" అంటారు. అయితే, పొంగల్ అనే అరవశబ్దానికి బహువచనం "అవర్‌గళ్" అన్నట్లుగా "పొంగల్‌గళ్" అని చెప్పవలసివస్తుంది. కాని అట్టి బహువచనరూపం అయుక్తంగా ఉంది. "పొంగు" అనేది ఏకవచనం అయితే, "పొంగ్‌గళ్" లేదా "పొంగలు" (పొంగింపు) అనేది బహువచనం కాగలదు. కనుక "పొంగల్" అనేది "పాలు" శబ్దంవలెనే నిత్యబహువచనం కావాలి. కాని పొంగలి శబ్దం ఏకవచనంగానే తెనుగులోనికి దిగుమతి అయింది. మనము "పొంగలి" ఏకవచనంగా తీసికొని "పొంగళ్లు" అనే బహువచనం కల్పించుకొన్నాము. "ఇడ్లి" అనే అరవ ఏకవచనాన్ని మనం తెలియక బహువచనంగా తీసికొని "ఇడ్డెన" అనే ఏకవచనం కల్పించుకున్నాము.

పొంగలి అనే వైష్ణవప్రసాదానికే గాక, వైష్ణవానికి కూడా మనం బహువచనాలమీద బహువచనాలు చేర్చి మర్యాదచేస్తున్నాము. వైష్ణవస్వామి తన పేరు "శ్రీనివాసయ్యంగారు" అని వ్రాసి సంతకంచేస్తాడు. ఆయనకు మన ఆంధ్రమిత్రుడు సగౌరవంగా ఉత్తరం వ్రాసేటప్పుడు "శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసయ్యంగారుగారికి" అని వ్రాస్తాడు. వైష్ణవసంప్రదాయం స్వీకరించిన వెలమ ప్రభువులకు కూడా అంతే. "రామారాయణింగారు" అని స్వయంగా సంతకంచేసిన వెలమదొరవారికి కరణంగారు మరొక "గారు" చేర్చి "రామారాయణింగారుగారికి" అని ఉత్తరం వ్రాశారు. బహువచన మర్యాద "గారు" లో మాత్రమే కాదు. "మన గుర్రం-మన ఏనుగు-మన దివాణం" అని చెప్పుకొనడంలో కూడా ఉంది. "మన" అనే సమష్టివాచకంలో పుష్టిఉన్నదనీ, మాటనిండు ఉన్నదనీ ఎంచి ఆవిధంగా ప్రయోగిస్తారు. మావూళ్లో చిరకాలంనుంచీ ఓవరుశీరుగా పనిచేస్తున్న ఒక అరవ అయ్యంగారు ఒకనాటిరాత్రి మేళతాళాలతో ప్రక్కయింటి తెలుగుపంతులు యింటికి వెళ్లి ఆశీర్వచనానికీ భోజనతాంబూలాదులకూ రావలెనని ఆహ్వానిస్తూ "మనభార్యకు వచ్చి రేపు సీమంతం నడుస్తుంది. ఏమో చెప్పినానని ఎంచుకోవద్దు. నామాట గమనింపు చేసికొని వచ్చి ఆశీర్వాదానికి వచ్చితీరవలె. ఇది మన సొంతకార్యంగా ఎంచుకోవలె" అన్నాడు. అయ్యంగారికీ, తెనుగుపంతులుకూ వున్న పేకాట సహవాసంమూలంగా సమష్టి భావంతో "మన భార్య" అని చెప్పి,


ఆ సీమంతానికిన్నీ, ఈ ఆంధ్రమిత్రునకున్నూ కొంత సంబంధబాధ్యత యీ అయ్యంగారు కల్పింప జూచుచున్నారేమో అని అనుమానించి, ఆ పేరంటానికి మన తెలుగుపంతులు పోనేలేదు. ఆయనభార్య అది విని ఆ పంతులు మీద అనుమానపడి ఆరోజంతా ఆయనతో మాట్లాడక మూతిబిగించుకున్నది. ఆ రాత్రి పంతులుగారింట్లో కొంత భామ కలాపం అనగా పారిజాతాపహరణంలోని పాదకంజాతప్రహరణకలాపం జరిగిందని అడుగుజాడలనుబట్టి కర్ణాకర్ణిగా అనుకున్నారు. శ్రీకృష్ణుడంతవానిని లెక్క సేయని సత్యభామ "నాతో వాదులాడగలడా ? నా ధాటి కోర్వజాలగలడా?" అని సవాలుచేసింది

ఇంతకూ, ఇన్నేళ్లనుంచీ అరవవారితో మనకు పొత్తు కలిసినప్పటికీ మనతో వారెంత మర్యాదగా మాట్లాడుచున్నప్పటికీ ఏదో కుంభకోణం వారిలో ఉందిరా అనే అనుమానం మనవాళ్లకు వదలలేదు.

రాములవారుకూడా యీ దండకారణ్య ప్రాంతంలో తిరిగినప్పుడు యిచటి వాలి సుగ్రీవుల పార్టీతగాదాలో చేరడం, కొంత పక్షపాతం వహించడం, యీ పార్టీ పక్షపాతాలతో పాతకాలలోపడి యిత్కించిత్తు అపఖ్యాతి మూటకట్టుకొనడం యీ దక్షిణాపథంలోనే జరిగింది. ఇచటి కుంభకోణం, మాయవరం దాటినతర్వాతనే ఆయన రామేశ్వరం చేరాడు ఏమైనప్పటికీ, అప్పట్లో రాములవారికి ఒక గొప్ప సంకల్పం నెరవేరవలసిన అవసరం వచ్చింది కొంత అంగబలం వెంటనే కావలసివచ్చింది. అందువల్ల ఏదో ఒక పార్టీలోగాని, వర్గంలోగాని, ముఠాలోగాని చేరితేనేగాని ఆయన పని నెరవేరిందికాదు. ఏదో ఒక వాలితో వ్యవహారం అప్పుడూ ఉంది. ఇప్పుడూ ఉంది.

మనకు తుంగభద్రానదీ ప్రాజెక్టు సాగుతోంది బీహారులో దామోదరవాలీ ప్రాజెక్టు సాగుతోంది. బొంబాయి రాష్ట్రంలో నర్మదాతపతీనదీ ప్రాజెక్టు నడుస్తోంది. పంజాబులో నంగవాలీ ప్రాజెక్టు సాగుతోంది. కాని కనుచూపు మేరలోనైనను కన్పించని ప్రాజెక్టు మన రామపాదసాగరం ప్రాజెక్టు.

దీనికోసం ఆంధ్రులు పొంగి ఉప్పొంగి పీరుళ్లకు పొంగళ్లు పెట్టగలిగిన పర్వదినములు ఇంకా రాలేదు. భారతదేశానికి ఎంత బియ్యం లోటు వస్తున్నదో అంత బియ్యం రామపాదసాగరం ప్రాజెక్టు మూలంగా గోదావరినీటిసాగుతో పండించవచ్చునన్నారు. గోదావరిలోని నీరు నూటికి 90 వంతు పొంగి పొరలి ఆనకట్ట దాటి సముద్రంపాలవుతోంది కృష్ణలోని నీరు నూటకి 90 వంతు పొంగి ప్రవహించి సముద్రంలో కృష్ణార్పణమౌతోంది ఒక్క గోదావరిక్రింద 10 లక్షల టన్నుల బియ్యం అధికంగా ఏ టేట పండించవచ్చు ఏటేట వరదలు రాకుండా పంటలు పోకుండా, శిస్తులు, ముజరా యివ్వనక్కర లేకుండా, అధికంగా ఆదాయంవచ్చే అవకాశం ఉంది. ఆంధ్రదేశం పాడిపంటల మహాలక్ష్మివలె కళకళలాడుతూ ఉంటుంది ఆంధ్రులు ఢిల్లీభోగాలకు మించిన బంగారు తీగెలు పండించి దేశంలో దారిద్ర్యం అనేది లేకుండా చేయగలరు ప్రజలు పేదరికంబున పేదలై వర్ధిల్లగలరు కమ్యూనిస్టువిప్లవాలు లేకుండా కాంగ్రెసుజెండాకు జై అని ప్రజలు ప్రణమిల్లగలరు దేశం సుభిక్షం కావాలి "అన్నపూర్ణాయింటిలోపలఅన్నమే కరువాయెరా" అనే కర్ణకఠోరమైన పాట వినపడకూడదు గోలకొండ నవాబుల కాలంలో అక్కన్నమాదన్నగార్లు అన్నసత్రాలు వేయించి నిరతాన్నప్రదానాలు చేయించారు "అన్నం దేవర సన్నగిల్లితే గోలకొండకూ జాతుంరే!" అని అన్నాతురులు గోలకొండకు పోయినరోజులవి. సత్రాలు, సంతర్పణలు, సమారాధనలు వెలసిన సత్కాలమది కాని, రేషను ఆఫీసులు,



రేషనుకార్డులు, రేషనుషాపులు నెలసిన చీకటిబజారులోని రేషనులుసరిసా లివి. "స" కారంలోనుంచి "శ" కారంలోకి కాలం మారినా, ఏదోవిధంగా 'సరే ఏం చేస్తాం' అని సమాధానపడుతున్నాం. అన్నదానంచేసిన అన్నపూర్ణాదేవి డొక్కా సీతమ్మగారి కీర్తి దిక్కు పిక్కటిల్ల మారు మోగింది. ఆ మెయింటికి కమ్యూనిస్టులు వచ్చినా కడుపునిండాకమ్మని పిండివంటలతో విందుచేసి పంపినదట.

"వండ నలయదు వేవురు వచ్చిరేని
అన్నపూర్ణకు నుద్దియా నతిని గృహిణి
అతిథు లేతేర నడికి రేయైన బట్టు.
వలయు భోజ్యంబు లింట నవ్వారిగాగ"

అని పెద్దన్నగారు చెప్పిన పద్యం చదువుతూ ఉంటేనే కడుపునిండుతోంది. "కన్నయ్య పండింప కామమ్మ వండింప-లేచిన విస్తళ్లు లెక్కలేవు" అని మరొక ఆంధ్రకవి సహజోక్తిగా నాటి సంసారధర్మమును వర్ణించి యున్నాడు. విస్తరి వరహాయెత్తుభోజనం పెట్టిన దినాలవి. "కడిమాడ సేయు భోజన మిష్టి" యని మరొకరు అంచనా వేసిరి. "కెల కుల నున్న తంగెటి జున్ను" అని తేనెతుట్ట వంటి ఆంధ్రగృహసును వర్ణించి, "గార్హస్థ్యథ మనకు సరియె?" అని పెద్దన్నగారు ప్రశ్నించారు. అటువంటి సుభిక్ష దినములకు ఆసించు చున్నది ఆంధ్రదేశము. కాని, యీ రేషను రోజులలో, యీఆర్థిక దుర్దశలో, "సుజలాం, సుఫలాం, మలయజశీతలాం, సస్య శ్యామలాం" అని అలాపన చేయుమంటే అయిక్యకంఠంతో చేయదు ప్రస్తుతం యీ గీతమును గానంచేయడం సార్థకం కాదని "జన గణమన" గేయమునే జాతీయగీతంగా ఆలాపనచేయవచ్చు. బ్యాండుమేళానికి అదే బాగుంటుందన్నారు నెహ్రూగారు 'జనగణ మన' యీరోజున ప్రతి పెండ్లిపందిరిలోను బ్యాండు మేళం ఫ్యాషనుగా వాయిస్తే వాయించవచ్చు ఒక ప్పుడు 'అప్పనాతనామనా' కూడా బ్యాండు మేళాలు ఫ్యాషనుగా శుభసమయాలలో వాయించేవారు. ఇంతమాత్రంచేత ప్రజా నీకం పొంగి యుబ్బితబ్బిబ్బు కాజాలదు. దేశంలో కడుపునిండా తిండి ప్రజలకు ఉంటే "వందేమాతరం"అని తప్పకుండా అంటారు. స్వగ్రామంలో తనకు వరుమానం, సన్మానం ఉంటే పరరాష్ట్రం ఎందుకు పోతాడు? స్వగ్రామానికి స్వస్తి చెప్పి హస్తినాపురం ఎందుకు వెళ్లుతాడు? "దేశం అంటే మన్నుకాదోయ్ దేశమంటే మనుషు లోయ్" అని అంటుకనే అప్పారావుగారు అన్నారు భుక్తికి లేని ప్రజలకు "జననీ జన్మ భూమిశ్చ నరకాదపి గరీయసి" అనిపిస్తుంది ధనికవర్గానికి మాత్రమే "స్వర్గాదపి గరీయసి" ఆంధ్రరాష్ట్రం వచ్చినంతమాత్రాన ఆంధ్ర మాతకి జై అని ప్రజలు మనసార అన జాలరు ఆంధ్రులు అమందానందకందళిత హృదయారవిందులై రామపాద సాగరమును సందర్శించి "రంగదరాతిభంగ ఖగరాజ తురంగ ...దాశరథీ కరుణాపయోనిధీ" అని మరొకమారు కీర్తించి, అఖిలభారతా వనిలో వందేమాతరమ్మని ముందంజ వేయగల సుదినాలు పర్వదినాలు రావాలి

ఆంధ్రావనిలో ఉత్సాహమునకు కొదువ లేదు. సత్యాగ్రహం వచ్చిందంటే దేశసీరు లకు ఆంధ్రోత్సాహం పొంగి పొంగళ్లు పెట్టి నది. కాని, యీ సంక్రాంతిపొంగళ్లు పాలును బియ్యము లేని పొంగళ్లయినవి. తయా రైనపంట తుపానుపాలైనది. ఈ సంక్రాం తికి రైతుకు సంక్రమించినది తృణమూ లేదు పణమూ లేదు. కాడిపసువులు పాడిపసువులు గంగిగోవులు గంగపాలైనవి. 'పాలును, బియ్యములేని పొంగలి పొంగలో' యని నట్లుగా ఉంది. ఆంధ్రుల మనోరథములు మాత్రం మిన్నుముట్టుచున్నవి ఆంధ్ర రాష్ట్రోద్యమం ఆంధ్రులకు కామంలేని కర్మ కాదు. తీరని కోరికలతో ప్రజల విరహ తాపం అగ్గలమగుచున్నది.

ఇది పైపై తియ్యని వాగ్దానాలతో పోయేదికాదు. ఈ విరహతాపం గంధలేప నంతో తగ్గేదికాదు చేమకూర వెంకటకవి సుభద్రాదేవివిరహతాపం వర్ణిస్తూ చెలికత్తె లచే ఆమెను ఒయ్యారంగా హేళన చేయించిన పద్యం హృద్యంగా ఉంది. ఈ పద్యం కొంచెం శృంగారఘట్టమే కాని, యీ విషాదఘట్టంలో ఉదాహరిస్తే కొంచెం హుషారుగా ఉండవచ్చు.

"అంగనగుబ్బ చన్మొలగు
టందపు మేలిపసిండి కుండలన్
బొంగ దొడంగె, జొబ్బిలగ
బూసిన గందము తాపవహ్ని, సం
పంగి కటారివీరునకు
బాలును బియ్యములేని పొంగలో
పొంగలి' యంచు నయ్యలరు
బోడులు సారెకు గేలిసేయగన్."

ఆమె స్తనద్వయముపై పూసిన మంచి గంధము విరహతాపమనెడి నిప్పుచేత ఉడికిన బియ్యంలాగున పెట్లినందున మన్మథుడనెడి వీరునకు (మృతిచెందియు తన ప్రభావమును కనపరచువాడు వీరుడని ప్రతీతి) పాలును బియ్యములేని పొంగలో యనునట్లుగా నున్నదని చెలికత్తెలు సారెసారెకు పరిహాసము చేసిరని అర్థము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

[అభూత కల్పన]

కళాభిమానం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

కళను ఉద్ధరించటానికి కంకణం కట్టాడు కళాభిమాని ముందుగా వ్రాతపూర్వకమైన అనుమతి కళవద్ద పొందుదామన్న ఆలోచన కూడా కలగలేదు కళాభిమానికి. కళాభిమానం అటువంటిది కదా!

ఏదో ఒక కళను పట్టుకుని, దాన్ని మచ్చికచేసి, సింగారించి, లోకానికి ప్రదర్శించి, ప్రజలకు కళద్వారా బ్రహ్మానందమూ, బ్రహ్మసాయుజ్యమూ, బ్రహ్మసారూప్యమూ ఇప్పించటానికి కళాభిమాని నడుముకు ప్లాస్టిక్ బెల్టుతో గట్టిగా బిగించినవాడై కళలను వెంబడించాడు.

మిగతా అన్ని కళలూ తప్పించుకు పారిపోగా నాట్యకళ అనబడే నాటకకళ, కుంటిది కావటంవల్ల, సులభంగా కళాభిమానికి పట్టుబడింది.

ఈవిధంగా చేజిక్కిన నాటకకళను కళాభిమాని ఆపాదమస్తకం అవలోకించాడు.

"ఈ నాటకకళ ఇంత కుంటిదెందుకయింది? మిగిలినకళలవలె ఇది ఎందుకు తప్పించుకు పారిపోలేకపోయింది?.. హా! తెలిసింది! దీని కాళ్లకు ధనపాశం చుట్టుకొని ఉంది. ఈ ధనశృంఖలాలను తెంచితేనేగాని ఈ నాటకకళ పరుగులు తీయదు, ఆడదు, లాస్యం చేయదు!"

నాటకకళకు ధనవిమోచన కలిగించటానికి ఉపక్రమించాడు కళాభిమాని.

"ఈ కళామతల్లిని చూడండి ఈవిడ ఎందు కిట్లా కుంగి కృశించిఉన్నదో గమనించండి. ఆమెకాళ్లకూ చేతులకూ ఉండే ధనశృంఖలాలను తెంచండి. కళాభిమానులు ముందుకు రండి!" అని కళాభిమాని ఎలుగెత్తి ప్రజలను పిలిచాడు.

ప్రజలు చుట్టూ మూగారు. అందులో చాలామంది కళోద్ధరణ సందర్శించటానికి మాత్రమే వచ్చారు కొద్దిమంది కళాభిమానులూ, కళాభిమానిపిలుపుతో ఉత్తేజితులైనవాళ్లూ నాటకకళామతల్లిని సమీపించటానికి ప్రయత్నించారు కాని కళాభిమాని వారిని అంతదూరానే ఉంచాడు.

"ఈ నాటకంలో నాయకపాత్ర నాది. మీరు హంగుదార్లు. నాటకకళను వెంటబడి పట్టుకున్నది మీరా నేనా?" అన్నాడు కళాభిమాని.

"ఆహా! అపూర్వకళాభిమాని!" అన్నారు ప్రజలు.

అటువంటివాణ్ణి అనుసరించినా కొంత కీర్తి ఉంటుందని కొందరు కళాభిమానికి సాయం చేయటానికి ముందుకు వచ్చారు.

"నాటకకళను పునరుద్ధరించాలంటే మనం ధనశృంఖలాలను తెంచాలి మనమే ముందు ధనశృంఖలాలనుంచి బయటపడాలి" అన్నాడు కళాభిమాని.

(ఇక్కడినుంచీ ఈ కథలో ధనశృంఖలాలు ప్రధానపాత్ర.)

నాటకకళామతల్లి యొక్క ధనశృంఖలాలు తెంచటానికిగాను కళాభిమాని చందాలు పోగుచేశాడు. ధనశృంఖలాలకు స్వస్తిచెప్పి కళార్చన చేయటానికి ముందుకు వచ్చినవారి సహాయంతో కళాకీర్తనా, కళాభజనా, కళార్చనా ఆరంభించాడు కళాభిమాని. ప్రజలు అటుకేసి రాలేదు.

ఇంత ఉన్నతాదర్శాలతో ప్రారంభమైన కళాసేవ ప్రజలను ఆకర్షించటంలేదు, వారికి ఏమాత్రమూ ఆనందం ఇవ్వటం లేదు. నాటకకళామతల్లి దాస్య (ధన) శృంఖలాలను తెగతెంచటం ఒక పరమార్థమనీ, కళామతల్లి నుండి తుచ్ఛమైన, ఆముష్మికరహితమైన, క్షణికమైన, బుద్బుదప్రాయమైన, ఆత్మసంశ్లేషణ లేని వినోదమూ, ఆనందమూ ఆశించటం శోచనీయమనీ ప్రజలు గ్రహించటం లేదు వారు ధనశృంఖలాలతో గూడిన కళనే ఎక్కువగా గౌరవిస్తున్నారు.

"మనకు డబ్బు చాలటంలేదన్నది శోచనీయం. ఇంకా ఎక్కువగా, ఇతోధికంగా, చందాలు వసూలు చెయ్యాలన్నది విదితం! మనం పోగుచేసిన డబ్బుతో కిరాయినాటకాలాడించిఉంటే ఈపాటికి లక్షరూపాయలు లాభం వచ్చిఉండేది. ప్రజలు ఆనందించిఉండేవాళ్లు. కాని మనఆశయం అదికాదు. మన ఆశయం కళామతల్లిని బంధించే ధనశృంఖలాలను తెంచి, ఆతల్లి ఎవరికీ అందకుండా పారిపోయేటట్టు చెయ్యటం! కళామతల్లిని గగనవీధిన అత్యున్నతంగా ప్రతిష్ఠించటం," అన్నాడు కళాభిమాని.

ఆయనఅనుచరులు కళామతల్లిదాస్యశృంఖలాలను తలుచుకుని నిట్టూర్చారు. తాము వాటిని ఆరాధించనందుకు లోలోపల విచారించారు. కళాభిమాని కళాకీర్తనలకిందా, కళాభజనలకిందా, కళార్చనలకిందా సొమ్మంతా ఖర్చుచేసి ఇతికర్తవ్యతావిమూఢుడైఉన్నాడని గ్రహించినవారై అందరూ జారుకున్నారు

ఎవ్వరూ లేని కళాసమావేశంలో కళాభిమాని కళాసేవను అవధిలేని వాయిదా వేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించాడు ఆ తీర్మానాన్ని బలపరచటానికైనా ఇంకో గ్రీవం లేదు



మోసం కాదు!

వైద్యుడు ఏమిటీ నాలుక చాచటం? రోగి: నాలుక చూపమన్నారు కాదండీ! నాకు ఉన్న నాలుకంతా అదేనండి! మళ్లీ మోసం చేస్తున్నాననుకొంటా రేమోనని పూర్తిగా చాచాను.



కొన్ని సంవత్సరాలు గడిచాయి. ధన శృంఖలాబద్ధమైన నాటకకళామతల్లి, ఆరాధించేవారు లేక, మళ్ళీ దినదినప్రవర్ధమాన మయింది. ధనార్చనాపరులైన నటులూ కిరాయివాళ్లూ ఆవిడచేత ప్రజలకు వినోదం ఇప్పించారు. ఆనందం ఇప్పించారు. ప్రజలు కళామతల్లిపై కనకవర్షం కురిపించారు.

కళాభిమాని ఆలోచించాడు. కళామతల్లిని బంధించిన ధనశృంఖలాలను చూసి తాను భయపడటంవల్ల కించిత్తయినా ప్రయోజనం కలగలేదు. ఆ శృంఖలాలను విడగొట్టవలసిందే. కాని వెంటనే కాదు. అందు కవసరమైన ధనాన్ని ఆ శృంఖలాలతోనే సంపాదించాలి ఇదే కర్తవ్యం.

మళ్లీ పౌర్ణమి వచ్చింది. కళాభిమాని శంఖం పూరించాడు. కళాయజ్ఞాలూ, కళాసంతర్పణాలూ, కళోత్సవాలూ ఏర్పాటుచేశాడు. ఈ సారి కళార్చనకు ధనశృంఖలాలను ఆరాధించేవారినే ఏరాడు. వాళ్లు రామనలేదు, వచ్చారు.

అతివైభవంగా కళావేడుకలు ముగిశాయి. పత్రికలనిండా వార్తలూ, ఫోటోలూ, పెద్దల ఉపన్యాసాలూ పడ్డాయి. అనేకవేలమంది కళాభిమానులు కాంప్లిమెంటరీ టిక్కెట్లు పుచ్చుకోవటానికి ఒప్పుకొని నాటకాలు చూసివెళ్లారు. కట్టె కాలగా బూడిద మిగిలినట్లు చివరకు అప్పు మిగిలింది. కళామతల్లి శృంఖలాలు చెక్కుచెదరలేదు. అవి ఎప్పటికన్నకూడా మరింత ప్రకాశిస్తున్నాయి. కళోద్ధరణ ఎప్పటిస్థితిలోనే ఉన్నది.

మరి కొన్నేళ్లు గడిచాయి. కళాభిమాని విరక్తుడైనాడు.

"ఈ కళజాతకమే ఇంత! దీన్ని నేను ఉద్ధరించలేకపోయినతరవాత ఇంకెవరూ ఉద్ధరించలేరు. ఈ ప్రజలే ఇంత! వీళ్లు ఉన్నతమైన కళను ఆరాధించలేరు. నా కాలం వృధాచేసుకున్నాను. కొంత కీర్తి తెచ్చుకున్నాను కాని చాలదు. ఇంకా రావాలి. ఇంకా చాలా రావాలి."


తన కెవరో పోటీ బయలుదేరినట్లు కళాభిమాని పత్రికలలో చదివాడు. ఇన్నేళ్లుగా కళాసేవ చేస్తూన్న తనకు ఊరూ పేరూ తెలియనివాళ్లు నాటకకళామతల్లికి దాస్యవిమోచన కలిగించి ప్రజాసేవచేస్తున్నారనీ, విపరీతంగా ప్రజాదరణ సంపాదిస్తున్నారనీ నాలుగువైపులనుంచి విని కళాభిమాని ఖిన్నుడైనాడు. కాని కాలక్రమాన ఈ కళాసేవకులు ప్రభుత్వంవారి ఆగ్రహానికి గురిఅయినారని విని విచారించటం మానేశాడు.

మళ్లీ పౌర్ణమి సమీపించింది. కళాభిమాని శంఖం పూరించాడు.

ఈసారి అపజయం కలగరాదు. డబ్బు మిగలాలి. లాభం రావాలి. కళార్చన జరగాలి. ఈసారి తన కెవరు సహాయం చేసేవారు? ధనశృంఖలాలను వదిలించుకున్నవాళ్లు నష్టం తెచ్చారు. ధనశృంఖలాలను ఆరాధించేవాళ్లు మరింత నష్టం తెచ్చారు. ఇక పోతే ఎవరున్నారు. అమాయకులూ, సరళస్వభావులూ, నిర్మలచేతస్కులూ అయిన చంటిపిల్లలున్నారు. పెర్రాసుపత్రిలో పిల్లలకన్న అమాయకులైన వెర్రివాళ్లున్నారు. ప్రజలను బలంగా ఆకర్షించేది వీళ్లే.

భయంకరమైన వ్యాధులు కలవాళ్లు తమ వ్యాధులు ప్రదర్శించి అడుక్కున్నట్లు, రెండుతలల పిల్లలనూ, శరీరాలు అంటుకుపోయినవాళ్లనూ ఎగ్జిబిషనులో పెట్టి టిక్కెట్లుపెట్టినట్లు, కళాభిమాని వెర్రివాళ్లచేత నాటకకళామతల్లికి సేవ చేయించి డబ్బు వసూలుచేశాడు.

కళామతల్లి ఆనందపారవశ్యంలో మూర్ఛపోయి ఊపిరిపీల్చటం మానేసింది. రోదిస్తూ తెర పడింది.



ఆలివ్ నూనె పిండిని, తెలగపిండిమాదిరిగా అమెరికాలో గొడ్లకు పెట్తున్నారు.

పారిశ్రామికులు, భూమిదార్లు

(16-వ పేజీ తరువాయి)

ఉండగా, వారసద్ద నిల్వధనం చేకూరేంతపాలం లేనప్పుడు, రైతాంగం ధనికు లయ్యారను కోటం భ్రాంతి. సంయుక్తరాష్ట్రాల్లో కొన్ని పరిశ్రమల పరిస్థితి కూడా చూద్దాం.

పత్తి, జనపనార, గాజుపరిశ్రమల్లో 'డైరక్టర్ల' జీతం, బోనసు, మేనేజింగు ఏజంట్లకమీషన్లు మొత్తం ఎలా వృద్ధిచెందిందీ కూడా చూద్దాం.

మొత్తం పైమూడుతరగతులకింద అయిన డబ్బు

సంవత్సరం	పత్తి	జనపనార	గాజు
1938	4,25,000	8,945	305 (38-39)
1946	33,24,000	79,700	15,403(45-46)

లాభాలు

	పరిశ్రమ		1938 లో	1946 లో	వృద్ధి%
1)	గాజు	రు.	3,762 ×	2,89,150 ×	7586
2)	పత్తి	,,	43,60,000	3,92,69,000	800.7
3)	తోళ్లు	,,	2,59,550 (1940 లో) ×	4,52,050 ×	74.2
4)	పంచదార	,,	12,61,713	21,62,095	71.4
5)	విద్యుచ్ఛక్తి				
	తరగతి. బి.		3,90,022 (38-39)	5,53,059 (45-46)	41 8
	తరగతి. సి.		1,20,233 (38-39)	1,65,582 (45-46)	37.7

× 'గ్రాస్' లాభాలు

(పై విషయాల కాధారం; 'ఎకనామిక్ వీక్లీ'—బొంబాయి).

ఈవిధంగా వృద్ధి అయినఖర్చును, కూలీల జీతాలలో వృద్ధితో పోల్చుదాం.

పరిశ్రమ	డైరెక్టర్ల జీతం బోనస్ మేనేజింగ్ ఏజంట్ల కమీషన్లలోవృద్ధి %	కూలీల జీతాల్లో వృద్ధి %
పత్తి	682	245.8
జనపనార	791	177.3
గాజు	1950	200

(ఈ విషయాలకాధారం: 'ఎకనామిక్ వీక్లీ'—బొంబాయి)

కూలీల జీతాలకంటె డైరెక్టర్ల, మేనేజింగు ఏజంట్ల సంపాదన, పత్తిలో సుమారు 3 రెట్లు, జనపనారలో 4 రెట్లు పైన, గాజులో సుమారు 10 రెట్లు వృద్ధిచెందింది.

పారిశ్రామికులు నిర్ధనికులే అవుతున్నారో కోటీశ్వరులే అవుతున్నారో పై విషయాలే స్పష్టం చేస్తున్నాయ్. వాఖ్యానం అనవసరం.

పారిశ్రామికులకు 'బాంకింగు' వసతులు, ప్రభుత్వసహాయం, ప్రభుత్వ 'రక్షణ, ఇన్సూరెన్సువసతులు వగైరా సదుపాయాలున్నయ్. కాని భూస్వాములకు ఈ వసతులు లేవు. ప్రభుత్వాలుచేస్తున్న సహాయం అత్యల్పం 100 కి 80 మంది వ్యవసాయం మీదే ఆధారపడవలసిన దేశమైనా, ప్రభుత్వాలు ఇందుగురించి చేస్తున్న ఖర్చు చాలా తక్కువ. ఆర్థికవిధానంలో వ్యవసాయందే ముఖ్యస్థానమైనా, అందుకు తగిన వనరులు ప్రభుత్వాలు కల్పించుట్లేదు.

వివిధదేశాలు వ్యవసాయంమీద పెట్టుతున్న ఖర్చు చూద్దాం.

దేశం	సంవత్సరం	సగటువ్యక్తికి రు అ. పై
అమెరికా	'43-44	77- 9-11
కెనడా	'43	20-14- 5
యునైటెడ్ కింగ్డం	'45-46	2- 0- 0
ఇండియన్ యూనియన్	'48-'49 బడ్జెటు అంచనా	0- 0-11

రాష్ట్రాలు	సంవత్సరం	సగటువ్యక్తికి
మద్రాసు	'48	0- 5- 0
బొంబాయి	'48	1- 1- 4
మధ్యరాష్ట్రాలు బీరారు	'48	0- 4-11
పశ్చిమ బెంగాలు	'48	0-15-10

ముఖ్యంగా పారిశ్రామికదేశమైన బ్రిటన్ వ్యవసాయంకింద పెట్టుతున్న ఖర్చు, ముఖ్యముగా భూమిమీదే జీవించే మనదేశం వ్యవసాయంమీద ఖర్చుపెట్టుట్లేదు. ప్రభుత్వాల మొత్తం ఖర్చులో వ్యవసాయం కింద ఎంత అవుతోందీ చూస్తే ప్రభుత్వాల నిర్లిప్తత, ప్రజల స్తబ్ధత బోధపడగలదు.

రాష్ట్రం	మొత్తం ఖర్చు (లక్షలు)	వ్యవసాయంకింద (లక్షలు)	మొత్తం ఖర్చులో 100 కి వ్యవసాయానికి
మద్రాసు	రు 5594	రు. 169	3 02
బొంబాయి	4402	249	5 65
పశ్చిమ బెంగాలు	3196	231	7 23
మధ్య రాష్ట్రాలు బీరారు	1574	57	3.62
తూర్పు పంజాబు	1782	58	3.26
ఇండియన్ యూనియన్ (48-49)	25738 బడ్జెటు	202.5	0. 8

అంచనా

ప్రభుత్వాలు సాగుకు చేస్తున్న సహాయం కూడా పరిశీలిస్తే, భూస్వాములస్థితి తెలుస్తుంది. ప్రభుత్వపు 'కాలువలు' మూలంగా సాగవుతున్న భూమి చూద్దాం. మొత్తం సాగుకిందవున్న భూమిలో నీటివసరున్న భూమి ఎంతో ముందు చూద్దాం:—

1945—46

ప్రాంతం	సాగుకింద ఉన్న భూమి (1000 ఎకరాలు)	నీటివసతి ఉన్న భూమి (1000 ఎకరాలు)
తూర్పుపంజాబు	11,617	5089
పశ్చిమ బెంగాలు	9,242	1893
అస్సాం	5,378	1216
బీహారు	17,506	5333
బొంబాయి	27,557	1373
మధ్యరాష్ట్రాలు, బీరారు	24,302	1582
మద్రాసు	30,534	9209
ఒరిస్సా	6,453	1675
సంయుక్త రాష్ట్రాలు	37,410	11702

మన వ్యవసాయం ఎంత హీనస్థితిలో వుందో పై అంకెలే స్పష్టంచేస్తున్నయ్.

ఇంక మనరాష్ట్రంలో ఈ నీటివసరున్న భూమిలో ఎంతకు ప్రభుత్వపు 'ఇరిగేషన్' వసతు లున్నవీ చూద్దాం:—

'43—'44

ప్రాంతం	మొత్తం నీటివసతి భూమి (ఎకరాలు)	ప్రభుత్వ కాలువల మూలంగా సాగు భూమి (ఎకరాలు)
ఆంధ్రరాష్ట్రం	47,18,819	23,94,518
తమిళనాడు	48,06,787	17,22,386
	95,25,606	41,16,904

అంటే మొత్తం నీటివసరున్న భూమిలో సగానికి తక్కువే ప్రభుత్వపు 'ఇరిగేషన్' కింద ఉన్నయ్. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు మేల్కొంటున్నయ్.

ఏళ్లతరబడి ప్రభుత్వసహాయం లేక, క్షీణిస్తున్న వ్యవసాయంమీద జీవిస్తున్న లక్షలాది ప్రజల'ద్ద ఇప్పుడు ధనం ఉందనుకోటం భ్రాంతి. ఇకనైనా ప్రభుత్వాలూ, ప్రజలూ వ్యవసాయం మన ఆర్థికవిధానానికి వెన్నెముక అని గుర్తించి, వ్యవసాయాన్ని అభివృద్ధిపరచితేనే,అధికసంఖ్యాకులు ప్రభుత్వానికి ధనసహాయం చేయగలిగిన స్థితికి రాగలరు.



రాజాజీహాల్ సింహద్వార సోపానాలపై భారతదేశ సహజసంపదను నిరూపించే చిత్రం: వ్యవసాయసూచకంగా దేశ మధ్యభాగాన నాగలి వున్నది.

అడవికాచిన వెన్నెల

(14 వ-పేజీ తరువాయి)

"దెబ్బతో బెదిరిపోయి, మరిచిపోయుంటాడు. పైగా, తరువాత కొద్దిరోజుల్లోనే, ఆతనికి బదిలీ అయిందిగా" అన్నాడు రెడ్డి.

"అవునవును"

"అవుతే, మీతో నన్ను కూడా వేటకి తీసికెళ్ళాలి, నేను రెండు రోజుల్లో వెళ్లిపోతున్నాను" అన్నాను.

"మీ కిక్కడ కాలక్షేపం అవట్లేదా ఏదో యీ చుట్టుపక్కల వో మనిషి పులి వుండి, చాలా నష్టం కలిగిస్తోందంటారు యిక్కడి వాళ్లు. వాళ్ల మాటలు పూర్తిగా విశ్వసించలేం. కాస్తంటే గంపంత చేస్తారు. ఇదిగో తోకంటే, అదుగో పులంటారు. తీరా వెళ్లి చూస్తే, ఏమీ వుండదు. నే నింత వరకూ, ఏడుమైళ్లదాకా అడవిలో పర్యటనం చేశాను. రెండు గేదల కళేబరాలు చూశానుగాని, పులి నాకంట బడ్లేదు. పైగా యిక్కడ మేం యీ పులికోసం కాంప్ చెయ్యలేదు. ఈ అడవుంది చూశారూ, యిందులో సగంభాగం, సంస్థానానికి చెందింది. దాని నిర్వహణ మన ఇండియా ప్రభుత్వంయాజమాన్యంలోకి తీసుకురావడానికి, కావల్సిన యేర్పాట్లు అంచనా వెయ్యమని మమ్మల్ని యిక్కడికి పంపించారు."

ఇంతలో బంగళాదగ్గరకి చేరుకున్నాం. రెండు కాంప్‌కుర్చీలు బైటపడేశాడు. బంట్రోతు, టీ తెచ్చాడు. ప్రేమానందం, నీలగిరి అడవిఅధికారుల తెలివితక్కువతనం గురించీ, ప్రస్తుతం అతను తలపెట్టిన కార్యకలాపం గురించీ, లెక్చరిచ్చాడు. సూర్యుడు దూరంగా చెట్లమానుల్లో మరుగుపడ్డాడు. పక్షులు భీకరంగా రోదిస్తూ చెలరేగాయి. మేం లేచి, సెలవు తీసుకున్నాం.

"మీరు వెళ్లేలోగా వేట ఏర్పాటు చేస్తాను. రెండుమూడు రోజులు వోపిక పట్టండి" అన్నాడు ప్రేమానందం.

నేను, రెడ్డి, వెనక్కి తిరిగాం. దూరంగా, నాలుగైదు మేకలు రావడం చూశాం. వాటి వెనక యిద్దరుస్త్రీలు-పనివాళ్ల తాలూకు కాబోలు-నడుస్తున్నారు. వారి వెనక నిర్మలుంది—సూర్యుడు మరచిపోయి, దిగవిడిచిన, కిరణంలా, సంధ్యలో శరీరం ఎఱ్ఱబడి, ఆ ఎఱ్ఱదనం, చీరని ఆక్రమించినట్లుగా వుంది. మాకు నలభైగజాల దూరంలో కొచ్చింది. ఎంత పీలగా, బలహీనంగా వుంది! చీర మడతలకి లొంగిపోయిన పల్చటి రొమ్ములు! కాని, అది సమయంకోసం వేచివున్న సింహపు నడుంలో యిమిడిన శక్తిలాంటి సన్నదనం! మాకు దూరమైపోయింది. రెడ్డి నన్ను వెనక్కి తిరిగి చూడనివ్వలేదు. మరుక్షణంలో మా ఎదురుగా మధుసూదనం శ్రీహరి మరిద్దరు బంట్రోతులు వొస్తున్నారు.

"ఇళ్లకి పోతున్నాం. మళ్లా వుదయం కల్సుకుందాం." అన్నాడు శ్రీహరి.

"ఈపూట మా టెంట్స్‌లో పడుకుందాం రాగూడదూ? నా స్నేహితుడుకూడా వున్నాడు. పైగా యింటిదగ్గర ఎవ్వరూ లేరుగా! అన్నాడు మా రెడ్డి.

"నాకు తలనొప్పిగా వుంది. జ్వరం వొస్తుంది, నిద్రపోకుంటే." అన్నాడు శ్రీహరి.

"భోజనం చేసి నే వొచ్చివుంటాలెండి" అన్నాడు మధుసూదనం. మేం కాంప్‌దగ్గరికి చేరుకున్నాం.

భోజనాలయ్యాయి. గురవడు పెద్ద కట్టెలు పేర్చి మంటచేశాడు. చెట్లమధ్య అందంగా వెన్నెలనీడలు పడుతున్నాయి. అక్కడ వెన్నెల మరింత నిండుగా స్వచ్ఛంగా వున్నట్లనిపించింది. అందులో నిశ్చలత్వం వుంది. ఫ్యాక్టరీపొగలు, సిగరెట్టుపొగలు, మేఘాలు, దుమ్ము, ప్రేమతో అలసిన నిట్టూర్పులు—వీటివల్ల భంగంకాని ప్రశాంతత. ఆకుల రెపరెప నిలిచిపోయినప్పుడు, వెన్నెల ధ్వనిస్తే వింటున్నట్లుగా వుంటుంది. సర్వీ చెట్ల సంగీతం జోలపాటలా అడివిని నిద్రపుచ్చుతోంది. ఎక్కడో ఏదో కీటకం రోదనతో పారావేస్తూంది. ఏదో దూరంగా మృగాల అయోమయపు అరుపులు—అడివి జీవితంలో ఐక్యమయ్యాయి మా ప్రాణాలు.

అరగంటలో మధుసూదనం శ్రీహరి కూడావో బంట్రోతు పెట్రోమాక్స్‌లైటుతో చక్కావచ్చారు—మహాజ్వాలలో అగ్గిపుల్ల పడేస్తే వెలిగినట్లుగా వెన్నెట్లో పెట్రోమాక్స్‌లైటొకటి!

శ్రీహరి వొంట్లో అస్వస్థత కాస్త సర్దుకుందన్నాడు. అందరం పక్కలు పరుచుకున్నాం.

"ఈమధ్య వో చిత్రం జరిగిందండోయ్!" అని మొదలెట్టాడు రాఘవులు.

చెప్పమన్నాను.

"వో వారంక్రితం ప్రేమానందానికి వో ఆకాశరామన్న వుత్తరం వొచ్చింది—పోస్టులో."

"నీ కెట్లా తెలుసు?" అన్నాడు రెడ్డి.

"నేను వారింటివైపు వెడుతుంటే చెత్తకాగితాలకట్ట చెట్లవెనక పడివుంది. నేను ఏమీతోచక కెలికాను. అందులో మూడు కాగితపు ముక్కలు నన్నాకర్షించినై. వాటిని సరిచేసి చదివాను. అందులో ఏముందో ఎరుగుదురా? 'నిర్మల ఆత్మహత్య ఎందుకుచేసుకుంటుందో కనుక్కున్నావా?' అని.

ఆ వుత్తరాన్ని విమర్శించి, తర్కించడం ప్రారంభించారు. మారెడ్డి అన్నాడు:—

"నువ్వే వ్రాశివుంటావు. కొంటెపనలు నీ కలవాటేగా!"

"ఛ ఛ—ఛలేవాడివే. మరెవరే నా అయితే అట్లాంటివి చేద్దును. తెల్లారి లేస్తే, మన కాయనతో పని. ఆయనదగ్గర చేస్తానా, తప్పుకాదు?" అన్నాడు రాఘవులు.

"ఆ పని నిర్మలని ఎరుగున్నవాళ్లెవరో చేసివుంటారు." అన్నాడు రెడ్డి.

"ఇక్కడున్నవాళ్లల్లో, ఎరుగున్నవాళ్లు శ్రీహరి, మధుసూదనం." అన్నాడు రాఘవులు.

"అస్తమానం, నన్ను యీ ప్రశంసలోకి దించకండి. నాకు కోపం వొస్తుంది." అని మధు విసుక్కున్నాడు.

"నిర్మల రెండోమారు తలపెట్టిన ఆత్మహత్యయత్నంగురించి వినాలనుంది, మీ కేమన్నా అభ్యంతరం లేకపోతే." అన్నాను నేను.

"విసుక్కున్నందుకు క్షమించండి—నా కేమీ అభ్యంతరం లేదు." అన్నాడు మధు.

"అభ్యంతరపెట్టినా, నేను విరమించే బాపతు కాదు. నేను చెబుతా వినండి." అంటూ రాఘవులు పెట్రోమాక్స్‌దీపం ఆర్పేసి, గాథ చెప్పడం సాగించాడు.

"రెండో యత్నం, తరవాత ఏడాదికి జరిగింది. ఈసారి అత్తవారింట్లో, భర్త మరో వూళ్లో వుద్యోగంలో కెళ్ళాడు. మామగారు ఆఫీసు కెళ్లాడు. అత్తగారు వంటింటిగుమ్మంలో చాపేసుకుని పడుకుంది. ముందుగదిలో బావగారు నిద్రపోతున్నాడు. మరిది—పదహారేళ్లుంటాయి—అవీ యివీ సవరిస్తూ యింట్లో తిరుగుతున్నాడు. తోటికోడలు పిల్ల నిద్రపోతోంటే, యీగలు ముసరకుండా విసురుతూ పక్కగదిలో కూర్చుంది. మధ్యాహ్నం, మూడు కావొస్తోంది. దొడ్లో పెద్ద చప్పుడయింది. పక్కింటి రమణయ్యగారు, విన్నాడు. దొడ్లోకి పరిగెత్తి, పిట్టగోడమీదనుంచి చూశాడు. 'ఏమర్రోయ్, ఎవరో నూతులో పడ్డారు' అని పెద్దకేకేసి, కర్రలు, నిచ్చెన, తాడు, తెచ్చాడు. ఇంట్లో అందరూ లేచారు. వీధిలోంచి గుఱ్ఱపుబండివాడొకడొచ్చి, నూతులోకి దిగి నిర్మలని పైకి చేరేశాడు. నీళ్లు తాగేసింది; చైతన్యం లేదు. డాక్టర్ని పిలిపించారు—శుశ్రూష చేశారు. వోగంటకి తేరుకుంది. తాశీల్దార్‌గారికి టెలిగ్రాం యిచ్చారు. బైటకి పొక్కకుండా, గప్ చిప్ చేసేశారు. అది కథ."

ఇంచుమించు, యీ యత్నం కూడా, మొదటి యత్నంలాగే వుంది. హంతకుడు, దురంతం తలపెడితే, వొకసారి అలవాటుపడ్డ ఫక్కీనే, పదేపదే అవలంబిస్తాడని, డిటెక్టివ్ నవల్స్ చదివితే తెలుస్తుంది. ఇంకా చిత్రం ఏమిటంటే, గంటకూడా, అదే. ఆరోజు ఏమేమి జరిగింది, ఎవరెవరొచ్చిందీ, వివరాలు కావాలన్నాను.

శ్రీహరి చెప్పాడు, సమాధానం.

"నేనప్పుడు ఆ వూళ్లోనే వున్నాను. కోర్టులో సాక్ష్యానికొచ్చాను. నిర్మలఅత్తవారింటికి పదకొండుగంటలకెళ్లాను. ఆమె బావగారితో కాసేపు కబుర్లు చెప్పాను. భోజనాలు చేశాం. జట్కా తెప్పించి, నేనూ, మరిదీ వూళ్లోకి వెళ్లాం. మరిది స్కూలువద్ద దిగిపోయాడు. అప్పటికి పన్నెండున్నరైంది. కోర్టుపని చూసుకుని, సాయంత్రం ఐదున్నరకి స్టేషన్లో చేరుకున్నాను. ప్లాట్‌ఫారమ్‌మీద మధు కనిపించాడు—అప్పుడు అతనికి ఆ వూళ్లోనే వుద్యోగం - రోడ్ల యిలాకాలో—బుక్‌స్టాల్ చూద్దామని కొచ్చాడుట. మేం యిద్దరం వుండగా, మరిదితో చదువుకునే కుర్రాడొకడొచ్చి, మాకీవార్త చెప్పాడు. నేను రైల్లో వెళ్లిపొయ్యాను. మధు వెళ్లి చూశాడనుకుంటా."

"లేదు, లేదు—నీతో చెప్పలేదనుకో—నేనూ నీతోబాటే, ఆ రైల్లోనే ప్రయాణం చేశాను. మా పినతల్లికూతురుకి ఏదో సంబంధం వొచ్చింది, రావల్సిందని మా నాన్న వైరిస్తే వెళ్లాను" అన్నాడు మధుసూదనం.

"మీరు వుద్యోగం అక్కడెంత కాలం చేశారు?" అనడిగాను.

"అబ్బే, చిన్న వుద్యోగం, తాశీల్దార్ గారి ప్రోద్బలంమీద అంగీకరించి, నాలుగు నెల్లు చేశాను. తరవాత, అడివిశాఖలో యీ వుద్యోగానికొచ్చేశాను."

"ఆ నాలుగు నెలల్లో మీకు ప్రేమానందంతో పరిచయం వుందా?" అనడిగాను.

"నాకంత పరిచయం లేదు. అతను మితభాషి. ఒకటి రెండుసార్లు, అతను సెలవుమీదొచ్చినప్పుడు, క్లబ్బులోనూ, సినిమాల్లోనూ చూశాను."

"సినిమాకి భార్యాసమేతుడై, వొచ్చేవాడా?"

"నేను చూడగా ఎప్పుడూ లేదు. పైగా నేనక్కడున్న నాలుగు నెలల్లో, రెండు నెల్లు అతను అత్తవారింట్లోనే వుండేవాడు కాబోలు. రెండుమూడుసార్లు వాళ్లింటికి వెళ్లినప్పుడు, నిర్మలని కాని, ప్రేమానందాన్ని కాని ఎప్పుడూ చూళ్లేదు."

"పాపం" అన్నాడు రాఘవులు.

"ఆ జోక్ నేను రెలిష్ చెయ్యను రాఘవులు." అని మధుసూదనం కోపం సూచించాడు.

"మరవుతే, నువ్వు వాళ్లింటికి వెళ్లే అవసరం ఏమొచ్చిందోయ్!" అన్నాడు ధీమాగా రాఘవులు.

"నేను నీకు సమాధానం యివ్వక్కర్లేదు. మీ రడుగుతున్నారు గనక చెబుతున్నాను. నేను ప్రేమానందంతో మాట్లాడదామనే వెళ్లేవాణ్ణి. అతనొచ్చినప్పుడు కబురు వెయ్యమని, నిర్మలమరిదిని అడిగాను. అతనితో సంప్రదించి అటవీ శాఖలో ట్రైనింగ్ పొందితే, వుద్యోగం దొరుకుతుందని తాశీల్దార్ వ్రాశాడు. ఆవిషయం ముచ్చటించడంకోసం వెళ్లేవాణ్ణి."

"మొత్తం ఎన్నిసార్లు వెళ్లుంటావు?" అన్నాడు రెడ్డి.

"నేనా?—నేను అరడజనుసార్లైనా వెళ్లుంటాను" అన్నాడు శ్రీహరి, తనని వుద్దేశించి యీ ప్రశ్న అడిగా రనుకుని.

"నిన్నెవ్వరూ అడగలేదు." అన్నాడు రాఘవులు.

"అడక్కపోయినా చెబితే ప్రమాదం లేదు. సందేహం తీరిపోతుంది. నేను నిజం చెప్పేస్తున్నా. ఏదో పాడు వున్నా నేను నిర్మలని చూడాలన్న వుద్దేశంతో వెళ్లేవాణ్ణని వొప్పుగోవాలి." అన్నాడు శ్రీహరి. దీనితో అందరూ మౌనంలో పడ్డారు కాసేపు.

నేనే మొదట మాట్లాడాను.

"మీరు నిర్మలతో మాట్లాడేవారా?"

"ఓ" అన్నాడు శ్రీహరి.

"ఆమెనిగురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"నా అభిప్రాయం నిర్మలకి భర్తంటే యిష్టంలేదని"

"అల్లా అనుకోడానికి ఆధారం?"

"మనిషి వైఖరినిబట్టి. సరదాగా వుండేది కాదు, దిగులుగా కనబడేది. పేరంటాలు, స్నేహితులు, సినిమాలు ఏవీ వుండేవి కావు."

అత్తగా రెట్లాంటిది?"

"అత్తగారు చాలా మంచిది. తల్లికంటె ప్రేమతో కోడళ్లని చూసేది."

"మామగారు?"

"మామగారివల్ల కోడలకేం బాధ కల్గుతుంది? ఆఫీసుకు పొయ్యేవాడు, యింత గడించి పారేసేవాడు."

"నిర్మలవ్యాధిలక్షణా లేమిటో డాక్టర్లు చెప్పారా?"

"హిస్టీరియా నరాలు పనిచెయ్యలేదు. హిస్టీరియాకు కారణం భర్తలో ఏదో లోపం వుంటమేనని నా థీరి" అన్నాడు శ్రీహరి.

ఇది నాకు సబబుగానే తోచింది.

కాని మా రెడ్డి ఖండించాడు.

"అట్లాంటివాడు పెండ్లెందుకు చేసుకుంటాడు. పైగా యితను, కాలేజీలో చదువుకునే రోజుల్లో కొంతగ్రంథం జరిపి కథానాయకుడుగా వుండేవాడని వినికిడి."

"అట్లాంటివాళ్లే, తమ లోపాన్ని కప్పిపుచ్చేటందుకు, పన్నాగంపన్ని, పెండ్లిచేసుకుంటారు ప్రపంచానికి తమలో లోపం లేదని చాటొద్దు మరీ!" అన్నాడు రాఘవులు.

"నిర్మల, భర్తనుగురించి, తనవాళ్లతో చెప్పిందా?" అని అడిగాను.

"ఏమో. తల్లితో చెప్పివుండాలి. వాళ్లు మాత్రం ఏంచేస్తారు. వివాహం రద్దుచేసు

గున్నా, తనకి మళ్లా పెండ్లిచేసుగునే, హక్కు లేదు. మరొకర్ని చూసుగుని రహస్యంగా ఏడవాలి." అన్నాడు శ్రీహరి

"అట్లాంటి వ్యక్తి నీ ఎరికిలో ఎవరేనా వున్నారా?" అని అడిగాడు మా చంద్రారెడ్డి అది నేనడగాలనకున్న ప్రశ్న. కాని ధైర్యం లేక మానేశాను

"ఏమో, వుండివుండొచ్చు. లేకపోతే, ముందుముందు దొరకొచ్చు" అన్నాడు శ్రీహరి.

"ఆనాడు మధుసూదనం కూడా నిర్మలని చూశాడు." అన్నాడు రాఘవులు.

"అవును. నేనారోజున అక్కడే వున్నాను కేపోమాపో ప్రేమానందం వొస్తాడు, సెలవలేగనక, అక్కడే వుండమంది నిర్మల అత్తగారు" అన్నాడు మధుసూదనం

"నిర్మల మీతో మాట్లాడేదా?"

"అల్లా కాదు అడగవల్సింది. నువ్వు నిర్మలతో మాట్లాడేవాడివా?" అని రాఘవులడిగాడు.

"తెలివిగా అడిగాననుకుంటున్నావు కాబోలు పరీక్షచేసి, నే నేదీ డైరీలో వ్రాసుగోలేదు మొత్తంమీద మాట్లాడటం జరిగేది—తన ఆరోగ్యంగురించీ, పుట్టింట జీవితంగురించీ, తను స్కూలుకెళ్లిన రోజుల్లో వేసిన నాటకాలు—యీ విషయాలు," అన్నాడు మధు

సరే ఆనాటి విశేషాలు చెప్పండి అని కోరాను.

"ఉదయం లేచి కాఫీలు త్రాగింతర్వాత" అని మొదలెట్టాడు మధుసూదనం

"క్షమించాలి—కాఫీ ఎవరు కలిపారు?" అన్నాడు మా రెడ్డి.

"నాకు గుర్తు లేదు. అందరికీ కాఫీలు యివ్వడం నిర్మలే యిచ్చేది. తర్వాత కాసి నేనూ, ఆమె మరిదీ—అతని పేరు గోపేశ్వరరావు—కాసేపు కేరమ్సాడాం—తొమ్మిదింటికి కాలవకి స్నానాని కెళ్లాను పదింటికి భోజనం చేసి, స్నేహితుడింటి కెళ్లి, వొంటిగంట కొచ్చాను"

"ఓహో, అందుచేత, శ్రీహరి వొచ్చినప్పుడు నువ్వు యింట్లో లేవన్నమాట. నువ్వు రాగానే, అతను వెళ్లిపోయ్యాడన్నమాట."

"అవును, వొంటిగంటన్నరకి రేడియోలో ఇంగ్లీషువార్తలు విని, నేను నిద్రపోయ్యాను. అరగంటలోనే లేచిపోయాను. రెండుంపావుకి కాఫీ త్రాగాను. మానాన్నగారి టెలిగ్రాం చూసుగున్నాను—యింటికి రమ్మని నా బాగ్ తీసుకుని, రెండున్నరకి వెళ్లిపొయ్యాను స్టేషన్‌కి వెళ్లేటప్పటికి రైలు వెళ్లిపోయింది పుస్తకాలు చూస్తూ, ప్లాట్‌ఫారమ్‌మీద వుండి, ఆరుగంటల రైల్లో మా వూరెళ్లిపొయ్యాను"

"మరో విషయం అడుగుతున్నాను ఏమీ అనుకోకపోతే, నిర్మల ఆత్మహత్యవిషయం, ఐదుగంటలకి, మీరు స్టేషన్‌లో వుండగా తెల్సింది. చూడ్డానికి ఎందుకు వెళ్లలేదు?" అనడిగాను.

"చూసేటందు కేముంది. నిర్మల అప్పటికి తేరకుంది పైగా, నే నింటికి వెళ్లటం జరుగురు టెలిగ్రాం" అన్నాడు మధు.

శ్రీహరి మరో ప్రశ్న వేశాడు.

"నేను, 'స్టేషన్ కెందుకొచ్చావు?' అనడిగినప్పుడు, వూరికెడుతున్నానని చెప్పక, పుస్తకాలకోసం అని ఎందుకు అబద్ధమాడావు?"

"రైలు తప్పగానే, కూర్చుని విసుగెత్తి, వొకసమయంలో యింటికెళ్లి, తెల్లారగట్ల రైలుకెళదామనుకున్నాను ఆ విసుగుదల సమయంలో నువ్వు ప్రశ్నించావు. సాయంత్రం పాసెంజెరు, ఆరోజున 'టైమ్'కొచ్చింది ప్రయాణమయ్యాను."

"పుస్తకాలషాపు గంట [illegible]కదా, ఏదేనా పుస్తకం కొన్నారా?" [illegible]గాను.

"లేదు. నాదగ్గర డబ్బు[illegible]గులు, అర్థు ఖర్చుపెట్టి పుస్తకాలు కొ[illegible]టంగురు" అన్నాడు

"పోనీ, యీ పుస్తకం కొ[illegible]గుండునే, అనిపించింది? [illegible], ఏ పుస్తకం?" అనడిగాను.

నాకు నిజంగా జ్ఞాపకంలేదు [illegible] కనిపించదు! విల్కీ కొలిన్స్‌నవల [illegible]ద వుమన్ ఇన్ వైట్' కొనాలని వుండేది." అన్నాడు మధు.

పదినిమిషాలు, మావాళ్లందరూ నవల్ని గురించి తర్కించారు, నాకు మరో సందేహం వొచ్చి, మధుని అడిగేశాను.

"ఆరోజున [illegible] పోస్టుమాన్ ఎప్పుడొచ్చాడు?"

"మామూలుగా, పదిన్నరకొస్తాడు. ఆ సమయంలో నే నింట్లో లేను. రెండున్నరకి, పోస్టుమన్ టెలిగ్రాం యిచ్చా[illegible]ండా కనే చెప్పాగా."

మా రెడ్డి, నిద్రొస్తోందని, అ[illegible] నిద్రపొయ్యేసంకల్పంతో శరీరాన్ని పక్కమీద వాలేశాడు. మధుని ఆఖరుప్రశ్న అడిగేశాను.

"అవుతే, నిర్మలట్లాగెందుకు చేసిందో మీకేమన్నా తెలుసా?"

"నాకు తెలీదు కారణం ఏమీ కనిపించలేదు"

"కారణం లేకుండా ఎవరన్నా అట్లాంటి పన్లు చేస్తారా?"

"స్త్రీలు ఎంతకేనా తెగిస్తారు" అన్నాడు మధు.

"ఏమోయ్, స్త్రీలు అను బహువచనం వాడుతున్నావు, ఎందరి స్త్రీలతో పరిచయం వుంది నీకు?" అన్నాడు రాఘవులు, నవ్వుతూ.

"అకారణంగా తెగిస్తారా?"

"ఏమో నాకేమీ తెలీదు."

మిగత అందరూ, నిద్రలోపడుతున్నట్లనిపించింది నాకు. ఈవిషయం ఆరాతియ్యడానికి వాకేమీ కుతూహలం కనపర్చడం లేదు. మధ్య నాకెందుకు; నేనూ, ఆలోచిస్తూ పడుకున్నాను. స్త్రీలు ఎంతకేనా తెగిస్తారు! స్త్రీలనిగురించి ఆలోచించడం మొదలెట్టాను. నిర్మలకథ విని, డిటెక్టివ్ నవలారచయిత ఎట్లాంటి కథ అల్లుతాడా అని వూహించాన. డిటెక్టివ్‌నవల్సు వ్రాయడంలో, స్త్రీ రచయితలు కనపర్చిన చమత్కారం, ప్రతిభ, ఏపురుషుడూ కనబర్చలేడు ప్రథమశ్రేణికి చెందిన రచయితలందరూ స్త్రీలే—డొరోతి సేయర్స్, మార్జరీ ఆలింగామ్, గేయోమార్ష్, అగాతా క్రిస్టీ వీరందరూ, నిర్మలతో ఎట్లాంటికథ వ్రాద్దురో? ఆ ఫక్కిలో ఏదో కథ ఊహలో అల్లుతుంటే నిద్రపట్టేసింది దూరంగా, ఏవో అడివిమృగాల అరుపులు వినబడుతున్నాయి మానవుడి హృదయంలో అధోలోకం వుంది అందులో బంధించబడ్డ, తీరనివాంఛలనే క్రూరమృగాల అరుపులూ అట్లాగే వుంటాయి గర్జించి, బైటపడి స్వప్నంలో విహరిస్తాయి, అవకా చిక్కితే, మేలుకునివున్నప్పుడే, న్యాన్ని చీల్చుకుని పైనపడి మింగే అవి బైటపడకుండా వుండేందుకా చాలామంది, కొలువాలని పైకి ముసుగు బిగతన్ని పరుంటారు!



7 శ్రీమతి పి. భానుమతి. (అపూర్వసహోదరులలో)

1949 సంవత్సరంలో తెలుగుఫిల్ముల తీరుతెన్నులు

శ్రీ మద్దాలి సత్యనారాయణశర్మ

1949 వ సంవత్సరంతో తెలుగు ఫిలిం పరిశ్రమకు 18 ఏండ్లు నిండాయి. ఈ 18 ఏండ్ల మింజుమలె, ఇంచుమించు 142 ఫిల్ములు తయారైనా ఈ పరిశ్రమ బాగా కాలు నిలవదొక్కుకోలేదన్నది నిజం. ఏర్పడినది లగాయతు విడవకుండా ప్రతిసంవత్సరం కనీసం ఒక్క ఫిల్ము అయినా తీసిన కంపెనీ ఒక్కటయినా లేకపోవడమే ఇందుకు నిదర్శనం. అంతేకాదు. ఒక్కొక్క ఫిల్ము నిర్మాణం రెండుమూడు సంవత్సరాలవరకూ వేకుతూండడం కూడా ఇందుకు సాక్ష్యం.

ఈ పరిస్థితికి కారణం ఈ పరిశ్రమలోకి ముందుగా వచ్చినవారు దీనిని సుస్థిరంచేసి, లాభసాటిగా ఉండేటట్లూ, ధనికులూ పెట్టుబడిదారులూ జంకులేకుండా పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చేటట్లూ చేయడంలో ఆట్టే శ్రద్ధ, కుశలత చూపించకపోవడమే, అన్నది కూడా నిజం.

ఇకనైనా ఈ పరిస్థితి తొలగి, ఈ పరిశ్రమ తగినంతగా అభివృద్ధిచెందేటట్లు చేయడానికి, ఎన్నో డక్కాముక్కీలు తిని, కష్టనిష్ఠూరాలు అనుభవించి కొంతగానైనా కాలూని నిలవగలిగినవారు శ్రద్ధవహించవలసి వున్నది.

ఇందుకు ముఖ్యమైనది పారిశ్రామికులలో సామరస్యం, సుహృద్భావం. ప్రస్తుతం ఇవి రెండూ అంతగా లేవన్నది గమనించేవారికి స్పష్టమే. కొత్తవారిని ప్రోత్సహించడానికి బదులు నిరుత్సాహపరచే స్థితిగతులు కలిగించడం ఎక్కువగా కనపడుతున్నది. ముందు ఈ వాతావరణం బాగుపడాలి. పారిశ్రామికులు తాము సుఖపడుతూ, ఇతరులను సుఖపడనిచ్చే ధోరణి వలంబించాలి. 1950 లో ఇందుకు అంకురార్పణఅయినా జరగాలని ఆశిస్తూ, 1949 ఈ సందర్భంలో మనకెట్టి ఆశ నిరాశలు కలిగించిందో చూద్దాము. దానితోపాటు ఫిలిం నిర్మాణ విధానాలలో ఎదుగు బొదుగులు కూడా గమనిద్దాము.

గత సంవత్సరంలో భవిష్యత్తు విషయమై ఇంతో అంతో ఆశ కలిగించినది విజయా ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ అవతరణ. బి. ఎన్. రెడ్డిగారి సోదరుడు నాగిరెడ్డిగారి యాజమాన్యాన ఈసంస్థ మొదట, ఫిలిం నిర్మాణానికి వలసిన ఉత్తమ సాధనపరికరాలుగల వాహినీస్టూడియోస్‌ను అద్దెకు తీసికొన్నది. దాని నిర్వహణను పదిలమైన, పలువురికి ఉపయోగమైన, స్థితిలో పెట్టి, ఒక చక్కని ప్రణాళిక వేసుకొని ఫిలిం నిర్మాణానికి ఉపక్రమించింది. ప్రసాద్‌గారి దర్శకత్వాన 'షావుకారు' అనే సాంఘికఫిల్ము, కె. వి. రెడ్డిగారి దర్శకత్వాన 'పాతాళభైరవి' అనే జానపదఫిల్ము, కమలాకరపు కామేశ్వరరావుగారి దర్శకత్వాన 'గొల్లకృష్ణ' అనే సంగీతప్రధాన భక్త్యాత్మక ఫిల్ము తీయ తలపెట్టింది. ప్రతి ఫిల్ము ప్రత్యేకవిలక్షణాలతో విలసిల్లేటట్లు చేయడం వీరి లక్ష్యమని తెలిసింది.

వీరి ప్రయత్నం నిర్విఘ్నంగా నెరవేరుగాక అని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, వీరి ఉనికి మన పరిశ్రమలోని అవాంఛనీయ వాతావరణ నివారణకు తోడ్పడుతుందని ఆశిద్దాము.

పోతే, ప్రతిస్టూడియోవారూ ఫిలిం నిర్మాతలకు తగుసౌకర్యాలు, సదుపాయాలు చేయడానికి ఉత్సహించడము, ఉపక్రమించడము మరొక ఆశావహమైన విషయం. ఈ సంవత్సరంనుంచీ ఫిల్ములు మాసాలలోనే తయారుకాగలవనీ, డబ్బుఉంటే, నిర్మాతలు ఏండ్లతరబడి అవస్థలుపడ నక్కరవుండదనీ ఇప్పటి స్థితిగతులను బట్టి అనిపిస్తోంది.

ఇక, నిరాశావహమైన విషయం నిర్మాతలలో అసమంజసమైన పోటీభావం కలగడం. ఒకరు తీయదలచిన ఫిల్మునే మరొకరు తీయబూనే గొడవ పడేండ్లుగా లేదు. '49 అంతంలో మళ్ళీ తటస్థించింది. వృత్తినీతి, కట్టుబాటు వుంటే ఇట్లాంటిది తటస్థించేది కాదు. అది లేకపోవడం మన దౌర్భాగ్యమని చింతిస్తూ, పరిశ్రమ క్షేమం దృష్ట్యా నిర్మాతలు, పరిశ్రమలోని తదితరులు ఇటువంటి పోటీలను ప్రోత్సహించడం, వీటికి ఆనుకూల్యం చూపడం విరమించుతారని ఆశిద్దాము. [52 వ పేజీ చూడుడు]



శ్రీమతి శ్రీరంజని. (గుణసుందరి కథలో)

నిర్మాణవిధానాలలో ఎదుగుబొదుగులు

ఫిలింనిర్మాణ విధానాలలో గత సంవత్సరం రెండు మెరుగులు కనిపించాయి. ఒకటి, ప్రజానీకపు నిత్యజీవితంలో భాగమై పోయిన రాజకీయాలకు సంబంధించిన ఇతివృత్తంతో ఒక ఫిల్ము రావడము. రెండవది, రెండుమూడేండ్లనుంచీ అసంబద్ధ, అసంగత జుగుప్సాకర సన్నివేశాలతో, సాహిత్యంతో తయారవుతున్న జానపదఫిల్ముల నిర్మాణ స్థాయి మారి పెంపొందడము. ఎం. ఆర్. ఎ. ప్రొడక్షన్స్‌వారి 'మనదేశం' వాహినీ పిక్చర్స్‌వారి 'గుణసుందరికథ' ఈ రెండు గుణాలను సాధించాయి. ఇందువల్ల ఇక ముందు ఇట్లాంటి ప్రయత్నాలకు పూనుకొనేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచించ వలసిన స్థితి కలిగింది. ఇది తప్పకుండా శుభ సూచనే.

గత సంవత్సరం, నవంబరు 24-న, డిసెంబర్ 29-న విడుదల అయిన ఈరెండు ఫిల్ములు కాక, ఫిబ్రవరి 19-న 'కీలుగుర్రం,' ఏప్రిల్ 30-న 'రక్షరేఖ,' అక్టోబరు 1-న 'లైలామజ్నూ,' 'ధర్మాంగద' విడుదల అయాయి. ఈ ఆరింటిలో ఇంతో అంతో బాగా ఉన్నవి అన తగ్గవి మొదటి రెండే నవచ్చు

ఆ రెంటిలో బాగున్నది 'గుణసుందరికథ' అనడానికి సందేహించ నక్కరలేదు

'మనదేశం' నిర్మాణంలో కథకుడు, దర్శకుడు రాజకీయవాతావరణం సృష్టించ డంలోనూ, పాత్రపోషణలోనూ మరింత శ్రద్ధవహించి, వాస్తవ సన్నివేశాలను కల్పించి, ఇతివృత్తప్రాశస్త్యాన్ని హీనపరచే ప్రేమ, హాస్యఘట్టాలను చొప్పించకుండా వున్నట్లయితే ఆఫిలిం ఎంతగానో రాణించి, ఆ సంవత్సరం ఫిల్ములలో అగ్రస్థానం వహించేది. నిర్మాతలు ఆ అవకాశాన్ని చేజేతులా చెడగొట్టుకొన్నందుకు చింతించడంతప్ప వేరేమీ చేయలేము.

మిగతా నాలుగింటివిషయంలో-కొన్ని పాటలు ప్రజలకు రంజకంగా వుండడము, ఫోటోగ్రాఫర్ల చాకచక్యము, నటీనటుల నైపుణ్యము మొదలయినవాటివల్ల చెదురుగా కొన్నిఘట్టాలు బాగుండడము తప్పితే ఎంచదగినదేమీ లేదనవచ్చు 'కీలుగుర్రం' విజయానికి ఘంటసాల వెంకటేశ్వరరావు గారి మ్యూజిక్ డైరెక్షనే ముఖ్యకారణం అంటే ఎవరూ కాదనలేరు. అక్కపాటలుపల్లెపల్లెకూ పాకిపోయాయి. 'లైలామజ్నూ'కు మంచి రాబడి రావడానికి, భానుమతి, నాగేశ్వరరావులు కొన్ని ఘట్టాలలో చూపిన నటనా నైపుణ్యం, ఫోటోగ్రాఫరు బి ఎస్. రంగా చూపిన చాకచక్యం శివరావు 'గల్లంతుహాస్యం' కారణమనాలి.

వ్యక్తుల కృషి

దర్శకులు

పైన పేర్కొన్న వరుసలో ఈ ఆరు ఫిల్ములకు ప్రసాద్, కె వి. రెడ్డి, మీర్జాపురం జమీందారు, ఆర్. పద్మనాభన్, పి రామకృష్ణారావు, హెచ్. వి బాబు గార్లు దర్శకులుగా వున్నారు. వీరిలో, నటీనటులవద్దనుంచి నేర్పుగా పనిగొనడంలోను పాత్రల మానసికసంఘర్షణల చిత్రణను నిపుణతతో నిర్వహించి, ప్రేక్షకులలో సరియైన 'ప్రతిభావం' (రియాక్షన్) కలిగించడంలోనూ కె. వి. రెడ్డిగారు, సాంకేతిక ప్రత్యేకతలను రూపించడంలో ప్రసాద్ గారు ప్రశంసార్హమైన పనితనం చూపించారు.

కవులు

ఈ ఆరు ఫిల్ములకూ వరుసగా సముద్రాల వెంకటరాఘవాచార్యులు, పింగళి నాగేంద్రరావు, తాపీ ధర్మారావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, సముద్రాల , తాపీ....గార్లు కవులుగావున్నారు. వీరిలో పింగళినాగేంద్రరావుగారు సంభాషణల రచన, పాటలకూర్పు రెండింటిలోనూ కూడా గణ్యత గడించారు.

సంగీత దర్శకులు

ఈ ఫిల్ములకు వరుసగా ఘంటసాల వెంకటేశ్వరరావు, ఓగిరాల రామచంద్రరావు, ఘంటసాల, ఓగిరాల, సుబ్బరామన్, గాలిపెంచల నరసింహారావుగార్లు సంగీతదర్శకత్వం నిర్వహించారు. వీరిలో హాయైన కర్నాటకసంగీతం కూర్చగలిగింది ఓగిరాల రామచంద్రరావు, గాలిపెంచల నరసింహారావుగార్లు 'కీలుగుర్రంలో' ఘంటసాలవారి సంగీతం బహుజనరంజకమైనదని చెప్పనే చెప్పాను.

ప్రధాన పాత్రధారులు

ఈ ఫిల్ములలో ప్రధాన పురుషపాత్రలను, ప్రధాన స్త్రీపాత్రలను వరుసగా ఈ దిగువవారు నిర్వహించారు నారాయణరావు, కృష్ణవేణి, శివరావు, శ్రీరంజని; నాగేశ్వరావు, అంజలీదేవి; నాగేశ్వరరావు భానుమతి; నాగేశ్వరరావు, భానుమతి; కృష్ణవేణి గార్లు. వీరిలో 'మనదేశం'లో నారాయణరావు, 'లైలామజ్నూ'లో నాగేశ్వరరావు; 'గుణసుందరి కథ'లో శ్రీరంజని, 'లైలామజ్నూ'లో భానుమతి, 'ధర్మాంగద'లో కృష్ణవేణి, 'కీలుగుర్రం'లో అంజలీదేవిగార్లు నటనలో నైపుణ్యం చూపించారు.

అప్రధాన పాత్రధారులు


ఈ ఆరింటిలో అప్రధానపాత్రలు నిర్వహించిన పురుషులలో నాగయ్యగారు, (మనదేశం), ముక్కామల కృష్ణమూర్తి (లైలామజ్నూ); స్త్రీలలో జూనియర్ లక్ష్మీరాజ్యం ('గుణసుందరికథ') సురభి బాలసరస్వతి(లైలామజ్నూ)గార్లు నేర్పుగా నటించారు. 'లైలామజ్నూ,' 'కీలు గుర్రం' ఫిల్ములలో ఛాయాగ్రాహకులు విశేష నేర్పరితనం చూపారు. శబ్దగ్రహణం 'గుణసుందరి కథ'లో చాలా బాగుంది.

కళాదర్శకత్వం 'గుణసుందరికథ'లో బాగున్నది.

1950-లో, ఈ ఎన్నిక గన్నవారూ, మిగతావారూ, అంతా, ఇతోధికకృషిచేసి ప్రజామన్నన బడయాలనీ, మనకు మంచి ఫిల్ములు ఇనుమిక్కిలిగా రావాలనీ ఆశిద్దాము.



యింత పెద్దపెద్ద మేడలు నీకు పనికట్టుకుని చూపిస్తావుంటే అలా పరిగెడతావేం! మీ బాట పర్రుగ్రామంలో నిత్యం యిటువంటివి చూస్తునే వుంటాళల్లె వుందే!



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౪౨

అన్నమయ్యగారి రచన :

(సంపు. 3 : పదం. ౮౦)

పాడిరాగం - ఆదితాళం

[రాగలక్షణం]

మాలవగౌళజన్యం. గాంధారవర్జితమై ధైవతవక్రసంచారం కల షాడవరాగం. స రి మ ప ధ ప ని స-స ని ప ధ ప మ రి స, అనే సంచారం కలది.

రత్నాకరకర్త దీనిని గ్రహింపలేదు. రామామాత్యుడు దీనిని గ్రహించి 'గహీనషాడవ' రాగంగానే చెప్పినాడు; కాని శుద్ధరామ ప్రియమేళంలో చేర్చినాడు. అంటే, మధ్యమంమాత్రం తీవ్రం! తక్కిన స్వరాలన్నీ సమానమే. (స్వ. మే. క మేళ ప్ర ౭౯) ఇందు కొంత న్యాయ మున్నది. గాంధారం శుద్ధంగా వర్జ్యమైనప్పుడు కాకలినిషాదం తీవ్రమధ్యమం తోడి సంవాదంతో రాణించును మధ్యమం శుద్ధమైతే ఆ నిషాదం చాలా దుర్బలస్వరమౌతుంది రామామాత్యుని సిద్ధాంతాన్ని ఖండిస్తూ గోవిందదీక్షితుడు ఈరాగంలో తీవ్రమధ్యమం లేదుగనుక గుర్జరీరాగమేళం (మాళవగౌళమేళం) లోనే ఇది జన్యంకావలె నన్నాడు (సం సుధ; ప. ౭౮౩) అహోబలపండితుడు, సోమనాథుడు దీనిని ఇట్లే లక్షించినారు. పుండరీకవిఠ్ఠలుడు 'సద్రాగచంద్రోదయం'లో (పు ౧౬) ఈ రాగంలో గాంధారమే వర్జ్యమని చెప్పినా, 'రాగమంజరి'లో (పు ౧౧) ధైవతగాంధారాలు రెండూ త్యాజ్యమన్నాడు. వెంకటమఖి చతుర్దండీప్రకాశికలో 'గలోపః షాడవః' అనే చెప్పినా, అనుబంధరాగలక్షణములో (పు. ౮) వక్రధైవతముగలదని విశేషం చూపినాడు. అనగా 'ప ధ ని సా-స ని ధ పా' అనే సంచారం లేదనీ, 'ప ధ ప ని సా-స ని ప ధ పా' అనే సంచరించవలెననీ అతని మతం. కాని అతడు రచించినదని సుబ్బ రామదీక్షితులు ప్రచురించిన గీతంలో 'ప స ని స' అనే నిషాదలంఘనసంచారమే ప్రధానంగా కలదు 'ప ని సా' అని ఒకతూరి మాత్రం కానవచ్చినది. అంటే ప్రధానసంవాదిస్వరమైన గాంధారం నిషిద్ధంకావడంమూలాన నిషాద మున్నా చాలా దుర్బలంగానే ఉండక తీరదన్నతత్వం ఆయనలక్ష్యంలో సూచించినాడన్నమాట (సం. సం ప్ర; పు ౨౦౬) తులజామహారాజు 'సంగీతసారా మృతం'లో దీనినే అనువదించినాడు (పు ౮౬) కాని అజ్ఞాతకర్తృకమైన 'రాగలక్షణ' గ్రంథంలో ఆరోహణంలోమాత్రమే గాంధారం త్యాజ్యమని లక్షించినా, 'ఆంధ్రసంప్రదాయ' మని 'స రి మ ప ని స-స ని ప ధ ప మ రి స' అనే సంచారం చూపబడింది! గాంధారం లేకపోయినా, పంచమమున్నది కనుక, షడ్జంతో అంశగాంధారంవలె, దానితో కాకలీనిషాదం సహజసంవాదం కలదని గమ నించికాబోలు, ముత్తుస్వామి దీక్షితులు 'శ్రీగురుణా' అనే దానికి కొంచె మెక్కువగా చోటుచేసి చూపినారు

ఈ రాగంలో ప్రబలస్వరం ఋషభం. దానితో ధైవతంకూడా ప్రబలంగా స్ఫురిస్తుంది

[పల్లవి]

(౧) ప ప ని ని సా రి మ | రీ స ని సా , ని
అ వి యె టు వం టి ర హా స్య ము లో

(౨) ప ప ప స నీ స రి స రి రీ ప మా రి రి సా , ని
అ వి యె టు వం టి ర హా స్య ము లో

(౩) ప స ని ప ప స నీ స రి మ ప ధా ప ధ | ధ ప మా రి రి సా రి మ రి రి స ని
అ వి యె టు వం టి ర హా స్య ము లో

(౪) ప స ని ప ప స నీ స రి మ ప ధా ప ని | సా రి స స ని ప మ ప ధ ప ధ ప మ రి రి స స
అ వి యె టు వం టి ర హా స్య ము లో

[అనుపల్లవి]

(౧) రి రి మ మ ప ప ధ ధ | ధా ప మ ప మ రీ స
స వ ర ని స తు ల కు ఝు ల్ల నె మే ను

(౨) మ రి ప మ ధ ప స ని | సా , ని ప ధ ధ ప మా రి స ॥ (అవి)
స వ ర ని స తు ల కు ఝు ల్ల నె మే ను

[చరణం]

మ మ మ మ మ మ మా | మ రి మ పా ప ప ప
క ల గ ని చె లి తో కాం త నా య కు ని
ప ధ ప ధ పా ప ధ | ప ధ ప మ పా , ,
చె లు వ ము చె ప్పు చు చి డు ము డి తో
ప మ ప ప నీ స స | ని ని స రి స ని నీ స స
ప లు క గ నే ర క భ్ర మ సి న మా ట లు
స స స స రీ ని ప మ | పా ప ధ ప ధ ప మ రీ , స ॥ (అవి)
త ల చి చె లు లు క డు త త్త ర ప డి , రి

ఇట్లే క్రిందిచరణములు :

(౨) రమణుడు కలలో – రమణితో నవిన
ప్రమదపుదైన్యపు – పలుకులవి,
చెమరించగ విని – శిరసులు వంచుక
కోమిరెలు తలచిరి – కూరిమి పతుల ॥ (అవి)


(౩) వేంకటరమణుడు – వెలదియు గలలో
బింకపుగూటమి – బెనగుటలు,
లంకెల పొందులు – లలనలు వినివిని
కొంకక కనుగొన – గురిసిరి నీరు ॥ (అవి)

లఘుటీక : సవరని=చక్కని; సతులు=ప్రతివ్రతలైన స్త్రీలు; కనకనే తమకు లభింపని శృంగారసౌభాగ్యమునకై, తత్తరపాట్లు, తలపులు, కన్నీళ్ళు—మాత్రమే సంభవించినవి. ఇతరులైయుండినచో మార్గాంతరము నాశ్రయించియుందురు. కలగని= స్వప్నము చూచి; చిడుముడి=తొట్రుపాటు; కోమిరెలు=ఎలప్రాయపు స్త్రీలు.

ముద్రితపాఠములు : రమణితోనగిన; కోమెరలు.

నేటి ప్రపంచం:

ఫార్మోజాద్వీపానికి ముప్పు: అమెరికా వైఖరి



చియాంగ్-కై షేక్

చియాంగ్ కై షేక్ జాతీయ ప్రభుత్వం చీనా భూభాగాన్ని విడిచి ఫార్మోజా ద్వీపానికి పారిపోయినప్పుడు, ఫార్మోజా రక్షణవిషయంలో అమెరికా ఏమిచేస్తుందోనని ప్రపంచంఅంతా ఆత్రంతో ఎదురు చూసింది. ఈవారం అమెరికా తన అభిప్రాయాన్ని స్పష్టపరిచింది. ఫార్మోజా కూడా త్వరలోనే కమ్యూనిస్టుల చేతిలో పడకతప్పదని అమెరికా నిర్ధారణచేసుకుంది. ఫార్మోజాసంరక్షణకు సైనికసహాయం ఆర్థికసహాయం ఇవ్వవలసిందని చియాంగ్ కై షేక్ అమెరికన్ ప్రభుత్వాన్ని కోరాడు. అమెరికన్ విదేశాంగకార్యాలయం నిరాకరించింది.

పసిఫిక్ మహాసాగరంలోని వేలాదిదీవుల్లో అనేక నౌకాస్థావరాలు విమానాశ్రయాలు నిర్మించి అమెరికా పశ్చిమతీరరక్షణకు ఇదివరకే సంసిద్ధంగా ఉంది. అవసరమైతే రష్యాపై దాడికికూడా వీలైన సన్నాహాలు చేసింది. జపాన్ సైనికాక్రమణపేరుతో రష్యాదాపున అమెరికా తన నౌకాబలాల్నీ, సైనిక బలాల్నీ నిలవరించింది. ఒకినావా, కొరియా, ఫిలిప్పైన్స్ మలయా ఇండోనేసియాల రక్షణశ్రేణికి ఫార్మోజా మధ్యలో ఉంది.

ఫార్మోజాద్వీపాన్ని జపాన్ ముప్ఫై ఏళ్లు ఆక్రమించుకుని అక్కడ ఆర్థికసంపదను వృద్ధిపరిచింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం ఫార్మోజాను తాత్కాలికంగా చీనాకు ఒప్పగించారు. ఫార్మోజా ద్వీపం చీనాదేశానికి చెందినదేనని సర్వదేశాలూ అంగీకరించిన విషయమే. జపాన్‌తో శాంతిసంధికి మిత్రరాజ్యాల మధ్య ఒప్పందం కుదిరినప్పుడు శాశ్వతంగా ఈద్వీపం చీనాకు ఒప్పగించబడాలి. కాని ఆ శాంతిసంధి ఇంతవరకూ జరగలేదు. జరగడానికి ఇంకా వ్యవధిపట్టక తప్పదు.

ఇప్పుడు చీనా పూర్తిగా కమ్యూనిస్టుల పరమైనందువల్ల, ఫార్మోజాగురించి శాశ్వత పరిష్కారం జరగలేదనే మిషతో, ఐక్యరాజ్యసమితి విచారణకోసమన్నట్లు ఆద్వీపాన్ని అమెరికన్ సైన్యాలు ఆక్రమించుకుని కాపాడాలని జపాన్‌లోని అమెరికన్ సైనికపాలనాధికారి జనరల్ మెకార్థర్ అమెరికన్ ప్రభుత్వానికి సూచించాడు. మెకార్థర్ ఈసూచనచేసిన సమయానికే చియాంగ్ కై షేక్ కూడా ఫార్మోజారక్షణకు సైనిక ఆర్థిక సహాయా లివ్వవలసిందని అమెరికన్ ప్రభుత్వాన్ని కోరాడు.

ఈ సమస్య చర్చకు వచ్చినప్పుడు అధ్యక్షుడు ట్రూమన్, దేశరక్షణశాఖామంత్రి లూయీజాన్‌సన్‌లు సైనికసహాయం ఇవ్వడానికి ఆమోదం తెలిపినట్లు, విదేశాంగశాఖామంత్రి డీన్ ఎచిసన్ ప్రతిఘటించినట్లు కొన్ని అమెరికన్ పత్రికలు వ్రాశాయి. డీన్ ఎచిసన్ ఈరీతిగా ప్రతిఘటించడానికి పండిట్ నెహ్రూ సలహా కారణమని న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఒక విలేఖరి వ్రాశాడు.

ఆసియాలో ఏ ప్రాంతంలోగాని అమెరికా సైనికంగా జోక్యం చేసుకుంటే ఆసియాఅంతటా పాశ్చాత్యప్రభుత్వాల పట్ల విరోధం హెచ్చిపోయే ప్రమాదం ఉందనీ, దీనివల్ల కమ్యూనిస్టులకే ప్రయోజనం కలుగుతుందనీ పండిట్ నెహ్రూ అమెరికా వెళ్లినప్పుడు తన అభిప్రాయాన్ని ట్రూమన్‌కీ, ఎచిసన్‌కీ తెలిపాడట. అయితే ఆసియాలో ఆర్థికదుస్థితిని నివారించడానికిగాను అమెరికా ధనసహాయం ద్వారానూ, నిపుణుల సహాయంద్వారానూ కృషి చెయ్యవలసిన అవసరం ఉందనికూడా పండిట్ నెహ్రూ చెప్పాడట. ఫార్మోజా ద్వీపంవిషయంలో ముఖ్యంగా ఈ విధానం అవలంబించడం మంచిదని చెప్పాడు. చివరికి వాషింగ్‌టన్ చర్చల్లో ఎచిసన్ వాదమే నెగ్గింది.

ఫార్మోజా రక్షణకి అమెరికా సైనిక సహాయంఇవ్వబోదని ప్రెసిడెంట్ ట్రూమన్ స్పష్టపరిచాడు.



ట్రూమన్

ఫార్మోజాలో పరిస్థితి ప్రమాదంగా ఉందనీ, ఆట్టేకాలం అక్కడ కూడా చియాంగ్ ప్రభుత్వం నిలవలేదనీ, చీనా కమ్యూనిస్టుల దాడివల్లనో లేక ఫార్మోజా ద్వీపవాసుల తిరుగుబాటు వల్లనో జాతీయ ప్రభుత్వం త్వరలోనే పతనం చెందగలదనీ అమెరికన్ విదేశాంగ కార్యాలయం తన అభిప్రాయాన్ని తూర్పుఆసియాలోని అమెరికన్ అధికారులికి రహస్యంగా తెలియజేసినది ఈ పత్రం జపాన్‌లో బయటపడి పత్రికల్లో ప్రచురించబడింది ఫార్మోజా ద్వీపవాసులికి జపానీ నిరంకుశత్వం కంటె చీనా కొమింటాంగ్ పరిపాలకుల నిరంకుశత్వం మరీ దుర్భరంగా ఉందనీ, జర్మనీలో కూడా జరగని ఘోర దురంతాల్ని ఫార్మోజాలో చీనా జాతీయ ప్రభుత్వం జరిపిందనీ కూడా ఈ పత్రంలో వ్రాయబడింది

దీనివల్ల ఫార్మోజాలో ప్రజలు తిరుగుబాటుకి సన్నాహమౌతున్నట్లు, తిరుగుబాటుదారులికి కమ్యూనిస్టుల సహాయంఉన్నట్లు స్పష్టమౌతోంది "ఫార్మోజా ద్వీపాన్ని అమెరికన్ సైన్యాలు ఆక్రమించుకుంటే, ఆసియావాసుల్లో అమెరికా పరపతి సన్నగిలుతుంది, ఫార్మోజా దక్కకపోతే అమెరికా స్వసంరక్షణవిషయంలో భయపడుతుందనే అభిప్రాయం ఆసియాలో వ్యాపించవచ్చును అందువల్లకూడా ఫార్మోజా ద్వీపంలో అమెరికా జోక్యంచేసుకోవడం మంచిదికాదు" అని ఈపత్రంలో వ్రాయబడింది.

ద్వితీయప్రపంచ సంగ్రామకాలంలోనూ ఆతరువాతనూ అమెరికన్ సైనిక నిపుణులసహాయంతో చీనా జాతీయ ప్రభుత్వం శిక్షణ నిప్పించిన లక్షమంది సైనికులు చీనానుంచి ఫార్మోజాద్వీపానికి తరలించబడ్డారు వీరిసహాయంతో 250 మైళ్ల పొడవున్న ఈద్వీపంలో చియాంగ్ కైషేక్ సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పి అతికఠినంగా పరిపాలన సాగిస్తున్నాడు ఈద్వీపానికి 130 మైళ్లలో ఉన్న ఆమోయ్ నగరంనుంచి 1949 అక్టోబర్‌లో కమ్యూనిస్టులు చిన్న చిన్న బోట్లలో దాడిచెయ్యడానికి ప్రయత్నించారు. కాని దాడి విఫలమయింది. అనేకమంది కమ్యూనిస్టుల్ని బందీలుగా పట్టుకున్నారు తిరుగుబాటు చేస్తే ఏమిశిక్షపడుతుందో చూపి ఫార్మోజా ద్వీపవాసుల్ని భయపెట్టడానికి గాను ఈకమ్యూనిస్టుల్లో చాలమందిని బహిరంగంగా ఉరితీశారు క్రమంగా ద్వీపంలో సైనికబలాన్ని మూడు లక్షలకు పెంచారు అయితే సైనిక దళాల్లో ప్రభుత్వం పట్ల విరోధం వహించినవారు చాలమంది ఉన్నారు సైనిక పరిపాలనపట్ల బొత్తిగా అసంతృప్తివహించిన 65 లక్షల ఫార్మోజా ద్వీపవాసులు ప్రమాద సమయంలో ప్రభుత్వానికి సహాయపడరనే విషయం ఇదివరకే తేలిపోయింది.

అయితే కమ్యూనిస్టులదాడు లెదిరించడానికి నౌకాబల విమానబలం జాతీయప్రభుత్వానికున్నాయి కిందటి అమెరికన్ కాంగ్రెస్ సమావేశంలో చీనా సహాయానికేర్పాటు చెయ్యబడిన 75 మిలియన్ల డాలర్లనీ అమెరికన్ ప్రభుత్వం ఇప్పుడిస్తుందో లేదో తెలియదు. ఇస్తే విమానబలం వృద్ధిపరచడానికిది వినియోగించబడవచ్చును.

నైసర్గికంగా ఫార్మోజా ద్వీపసంరక్షణ చాలా సులభం నౌకాబలం బొత్తిగాలేని చీనా కమ్యూనిస్టుల దాడుల్ని జాతీయవాదుల విమానబలం సులువుగా నిరోధించగలదు. ఆహారాదివిషయాల్లో సమృద్ధమైన ఈ ద్వీపం ఎంతకాలమైనా అన్యదేశాల సహాయం లేకుండా యుద్ధం సాగించవచ్చును ద్వీపంలో పంచదార, అల్యూమినియం, సిమెంటు పరిశ్రమలు బాగా వృద్ధిచెందాయి. విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల మరమ్మతుకి అమెరికా పరికరాలు అవసరం. బొగ్గుగనులున్నాయి.

కాని జాతీయవాదుల పరిపాలనావిధానంవల్ల సహజసంపత్సమృద్ధమైన ఫార్మోజా ద్వీపంలోకూడా ఆర్థికదైన్యం సంభవించింది దాడులవల్ల కాకపోయినా, అట్టేకాలం ఆంతరంగిక అరాచకంనుంచి కాలం ఆంతరంగిక శాంతిభద్రతల్ని ద్వీపాన్ని కాపాడ్డందుష్కరం.

[సూర్యనారాయణ]

గొబ్బిళ్ల పాటలు

(32 వ పేజీ తరువాయి)

రాత్రి వుండిన గొబ్బెమ్మ
రాళ్ళల్లోకి పోతివా

అని పాటలు పాడి నోము ముగించుకొని గొబ్బిని అత్తవారింటికి బంపి యిండ్లకు వత్తురు. గొబ్బిమేలుకొలుపులు, పవళింపు పాటలు, వాలాడింపుపాటలు స్త్రీలు పలువిధములుగా నాయాయి సమయవిశేషములయందు బాడుదురు—

అతిప్రాచీనములగు నీ యాచారములను ప్రజలు పాటించి యాదరించుచుండుటచే నివి మొన్నమొన్నటిదాక విస్మృతిపథములు గాక నిలిచియుండినవి గ్రామీణు లయినను వీనిని గొంతకు గొంత పాటించుచుండుటచేతనే ప్రాచీనాంధ్రజాతీయజీవనమును నేటి కూహింపనైన నూహింపగలుగుచున్నాము. ఉత్తమజాతీయసారస్వత నవనీతమును మనము మన జాతీయజీవనక్షీరమునుండియే పొందగలము. జాతీయసారస్వతలబ్ధి కయినను మనము మనపూర్వాంధ్రజాతీయజీవన దర్శనము చేయవలసియున్నది. పాశ్చాత్యవిజ్ఞానవేషభాషాభిరుచిచే మన జాతీయజీవనము చాలగా దెబ్బతినినది. నవ్యాంధ్రసాహిత్యాచార్యులు శ్రీరాయప్రోలుసుబ్బారావుగారు అందుకై పరితపించుచున్నారు.

> బువ్వమ్మబంతుల గవ్వించి వయసుకా
> వర ముబ్బ బడుచులు పాడలేరు
> గొబ్బి తట్టెడువేళ గూడ గన్నె సెలంత
> లరమర లేకాడమఱచినారు
> తద్దెపండుగల సైత ముయాల లూగుట
> మోటుగా మగువులు మూసినారు
> రుక్మిణిమొదలుగా రుచిగొన్న బొమ్మల
> పెండిండ్లు బాలలు విడిచినారు
> ఏ నిరపరాధమగు క్రీడ లింతవఱకు
> జాతిముఖకళ లనదగు చానలందు
> బెంచె సౌందర్యసుఖరుచిసంచయమ్ము
> నా శుభము లస్తమించెడు' నరయరేమె !

'ఆ శుభము లస్తమింపకుండ నిలుపుకొనవలసిన బాధ్యత మనపై నున్నది.

రుద్రమదేవి

(7-వ పేజీతరువాయి)

ఆ యగ్రణి యాతనికి తిరిగి నమస్కారమైన జేయడు; కూర్చుండు మనడు దానితో నా నాయకునకు కొంత ధైర్యము సడలి తోడి వారివంక చూచును వారు మరొకవైపు చూతురు. కొంతవడికి వారు మరల కూడబలుకుకొందురు మరల ధైర్యముచేసి యా నాయకుడు ఇంత ద్రవ్యము కావలె నని యగ్రణిని కోరును ఆ యగ్రణి శాంతముగా లోని కేగి పదిలపరచియుంచిన రాగిరేకుల శాసనము బయటికి తెచ్చి యిది సర్వకరపరిహారముగా ఈ మహారాజు మా పెద్దల కిచ్చినా డని చెప్పి దానిపై గల రాజముద్రిక చూపించును అంతటతో సామాన్యముగా నా నాయకుడు తన భట తండముతో తరలిపోవును కాక ఒకానొక డేరా జిచ్చె నని ప్రశ్నించును. అంతట నగ్రణి యిట్లనును

“ఏ రాజయితే నేమి నీకు? ఇది విన్నావా?

‘యథా వ్యాసః

స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసుంధరామ్,
షష్టిర్వర్ష సహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః

బురదలో పురుగులుంటవే, అవి ఎన్నడైనా చూచే ఉందువుగా. అంతకంటె అసహ్యమైన, విష్ఠాయాం, అరవై వేల యేండ్లు పురుగువై పుట్టడము నీకు సమ్మత మయితే మే మంతా మా అగ్నిహోత్రాలు మాత్రము తీసికొని పోతాము. మీరే ఈ అగ్రహార మంతా అనుభవించండిరా, కావలెనంటే భటాచోరా!”

ఆ మాట లనుచుండగనే అగ్రణిముఖములో కోపముతో నొకానొక యగ్ని పుట్టును. ఇట్లన్నందుకు ప్రాణమానములు వదల వలసివచ్చు దినము లాసన్న మయినను అప్పటి కింకను రాలేదు. ఆ వచ్చిన భటులకు వారినాయకునకు నొక్కసారిగా భయ మావహిల్లును. వారు వంగివంగి యా యగ్రణికి నమస్కరించి శాసనపు రేకులు కన్నుల కద్దుకొని క్షమాపణము చెప్పికొని క్రిక్కురు మిక్కురు మనకుండ ఆ గ్రామము దాటి బ్రతికితి మని యావల పడుదురు.

ఒక్కొక్క యెడ నట్టి నాయకుడు గ్రామములోనికి వచ్చి యచ్చట జరుగు సత్కథాకాలక్షేపము వినీతుడై విని యా యగ్రహారమునకు తాను దోచుకొనివచ్చిన ద్రవ్యము కొంత యీయబోవును. అగ్రణి యది చిరునవ్వు నవ్వుచు నంగీకరింపక నిరాకరించును నాయకుడు బలవంతము చేయగా తుద కా యగ్రణి దాని నార్తులై తన యగ్రహారములో తల దాచుకొన వచ్చిన యాగంతుకుల కిప్పించును. అట్లు తమయొద్ద దోచుకోబడిన తమ ద్రవ్యమే తమకు మరల ప్రాప్తించుటయు కద్దు!

ఎక్కడనో కొన్నియెడల అగ్రహారములలో జొరబడి బాధించిన తండములును లేకపోలేదు అట్టివారికి శీఘ్రకాలములో సంకటములు ప్రాప్తించును. అవి యందువల్లనే ప్రాప్తించినవని వారికి నిశ్చయభావము కలుగును అట్టి శాస్తియే కలుగు నని యితరులకు వెరపు పుట్టును. ఈవిధముగా భయమువల్లనేమి, భక్తివల్లనేమి, అగ్రహారములు అలజడులు తప్పించుకొనుచుండెను. ఇట్టి పుణ్య భగవ స్థానములలో నగ్రహారము లుండకున్నా నా కాలమున న

చెలరేగుచువచ్చిన రాచరికపు కల్లోలములతో తూర్పుతీరభూమి నిర్మానుష్యమై యుండెడిది.

ఈ చనుప యట్టి కల్లోలఘూయిష్ఠ మగు ప్రాచీసముద్రతీరము నుండి ఓరుగల్లు చేరికొనెను. అసలు మోసలపురమునుండి యొకటియు మోటుపల్లి నుండి యొకటియు రెండు చనుపలు బయలుదేరి ఉపనదుల చేరికచే సంపుష్టము లగు గంగాయమునానదులవలె పెద్దపెద్దవై అవి రెండును బెజవాడలో కలిసికొని యొకటిగా నేర్పడి యీ రూపము పొందియుండెను

అందులో మోటుపల్లిలో బయలుదేరిన చనుప ధనదుప్రోలు చేరునప్పటికే అచ్చటికి కొప్పెరుంజింగని సైన్యములు దక్షిణమున నుండి త్వరలో రానున్నవని యలజడిగా నుండెను. అప్పటికే శ్రీమల్లికార్జునపండితారాధ్యులవారి యాగ్రహమునకు గురియై యా ధనదుప్రోలు సిరిసంపదలు తూలి కళావిహీనమై యుండెను. దివ్యాయతనములు పాడరియున్నవి. విశాలభవనములలో పెక్కింట అడవి పావురములును గబ్బిలములును నివాసముచేయుచున్నవి. ఉన్నత మంటపములు పండితగోష్ఠులు లేక కేవలముశిలారూపములుగా నున్నవి. వీధులలో జనులు పలుచపలుచగా మాత్ర ముండిరి. శిథిలమైన కోట ఎంత బాగుచేసినను దృఢపడి యుండలేదు. అందున్న చోడరాజుకు కొప్పెరుంజింగని నెదుర్కొను శక్తి గాని ఉద్దేశము కాని లేదు. అతడు ఆ పల్లవరాజు సైన్యములు సమీపించినంతనే లొంగిపోయి పల్లవరాజుకు సాయపడునని జనశ్రుతి ప్రబలెను. సంపన్నులు తమ ధనధాన్యాదు లే మగునో యను భయముతో సాధ్యమైనంతవరకు ధాన్యము దూరమునకును ధనము భూగర్భమునకును చేర్చుచుండిరి వీధిలో కనబడిన కొద్దిమందిముఖములలో నెత్తురు లేదు.

ఇది ఎరిగి యా సార్థవాహాధ్యక్షుడు కలవరపాటుతో నితర సార్థవాహులతో రహస్యముగా సంప్రదించి తన చనుపను గొంటూరుమార్గము వడివడిగా పట్టించెను. ఆ సార్థము చేబ్రోలువరకు చేరునప్పటికి ఆపైన గొంటూరువైపు పోవుట క్షేమము కాదని యందున్న జాయపనాయకుని బంధువులు వారికి చెప్పిరి. వెనుక నూయి, ముందు గోయి! ఆ సార్థవాహాధ్యక్షు డేమి చేయగలడు? వెంటనే అతడు తన సార్థమును కొంచెము వెనకకు త్రిప్పి సమీపముననే గల మంచాలాగ్రహారము చేర్చెను. ఆ యగ్రహారము ప్రాపున సార్థమును విశ్రమింపజేసి యచ్చటి స్థలమార్గములను శోధించెను. తుద కాతడు చక్కగా విచారించి తన చనుపను మరియొక మార్గమున పట్టించి యచ్చట గల తుంగభద్ర యను చిన్ననదిని దాటించెను. అంతట వారట్లో నెమ్మదిగా తెనాలి చేరుకొనిరి. అచ్చటినుండి కొల్లూరు చేరి యక్కడ కృష్ణానది నుత్తరించి శ్రీకాకుళము చేరవలె నని వారి యూహ

కాని యప్పటికే కొప్పెరుంజింగనికి ధనదుప్రోలులోని చోడరాజు దాసు డయ్యె ననియు పల్లవసేన రెండుగా చీలి ఒకటి కొల్లూరువద్దను రెండవది వెల్లటూరువద్దను కృష్ణ నుత్తరింప నుంకించుచున్న వనియే కాక తన సార్థముజాడలు చారులవలన నెప్పటికప్పు డాపల్లవులు తెలిసికొనుచున్నా రనికూడా సార్థవాహాధ్యక్షునికి తెలియవచ్చినది. మరియు పల్లవసేనలు గ్రామములను దోచుకొనచున్నా రనియు వారి కెట్టి దయాదాక్షిణ్యములును లే వనియు గూడ తెలిసినది. సార్థవాహాధ్యక్షుడు కుప్పన కూలిపోయెను. ఎడమప్రక్కను గొంటూరునాగదేవుని దొంగల గుంపులు; కుడి

ప్రక్కను కొప్పెరుంజింగని పల్లవసేనలు; వెనుక ధనద్పురోలులోని పిరికిచోడరాజుబాధ! ఎట్లో ఒక రీతిని కృష్ణానది దాటి బెజవాడ చేరుకొన్ననేగాని తమ సరకులును ప్రాణములును దక్క వని స్పష్ట మయ్యెను.

సార్థవాహాధ్యక్షుడు ముఖ్యు లగు నితరసార్థవాహులతో నాలోచించెను. వారు కూడబలుకుకొని ఉన్న అపాయస్థితి సార్థములోనివారి కందరకు తెలుప నిశ్చయించిరి. అది తెలియ గానే సార్థములో పలువురు తమ సరకులతో తెనాలిలోనను ఆ చుట్టుప్రక్కల గ్రామములను సర్దుకొనిరి. సాహసులైన తక్కిన వారు ఏమైనను ప్రయాణము ముందుకు సాగింపనిశ్చయించిరి. వారు పుష్కలముగా ద్రవ్యము వెచ్చించి యా చుట్టుప్రక్కల గ్రామములనుండి పలువురు భటులను సంపాదించిరి. శీఘ్రగమనమునకై అశ్వములను ఉష్ట్రములను మరికొన్ని విలిచిరి ముత్యములు పవడములు దంతము చందనము కస్తూరి పట్టు నూలు మంజిష్ఠము— ఇత్యాదు లగు నమూల్యవస్తుసంచయముతో బేరము చేయు వారలకు ధనము కేమి కొదువ?

సార్థవాహు లాలోచించుకొని భటుల సమగ్రరక్షణతో శీఘ్రయానమున మధ్యేమార్గముగా ఆ పల్లె చేరి ఉండవల్లి చేరుకొనిరి. అక్కడ పర్వతపార్శ్వమున నొక గొప్ప జైనవసతి కలదు. దిగంబరులు తపస్సు చేసికొనుటకై యందు మూడంతస్థులుగా కొండ శిల్పులచే నద్భుతముగా తొలువబడి గుహలు నిర్మింపబడి యుండెను. ఆ ప్రధానవసతి నావరించి మరి యెన్నియో వసతులును గలవు. వానిలో మహావిద్వాంసు లని దిగంతప్రశస్తి గల దిగంబరభిక్షువులు జైనగ్రంథములు పారప్రవచనములు చేయుచు సిద్ధసాధనము లొనర్చుచుండిరి. జైనదిగంబరు లుండు నివాసములకు ఆ కాలమున 'వసతు' లను నామము సామాన్యముగా ప్రవర్తిల్లుచుండెను.

ఈ సార్థవాహాధ్యక్షుడు గొప్ప జినభక్తుడు. అతడు తనవెంట దంతముతో నిర్మించిన గోమఠవిగ్రహమును సగౌరవముగా తెచ్చుకొనుచు నిత్యము పూజించుచుండెను. ఆ విగ్రహ మాతనికి ప్రాణపద మైనది.

అత డుండవల్లివసతి జేరగనే ముందుగ దలి ప్రధానాచార్యుని సందర్శించెను. ఆచార్యుల కాతడు ప్రణమిల్లుచు తనవెంట తెచ్చిన యమూల్యము లగు రత్నములును కాంచనమును కానుకగా నర్పించెను. ఆచార్యు డవి గ్రహించి యన్నిటిని ఆ వసతి కిచ్చివేసి యాతని నాశీర్వదించెను. కుశలప్రశ్నాదికము జరుగుసందర్భమున సార్థవాహాధ్యక్షు డా యాచార్యులకు తన సార్థమునవస్థ వర్ణించి శరణార్థియై రక్షింప వేడుకొనెను. ఆ యాచార్యు డాలకించి జాలి పొందెను. జాలిపడి యూరకొనక యారాత్రియే యా సార్థమును కృష్ణావేణ్ణానదిని దాటించుటకు నావికుల బిలిపించి సౌకర్యములు కలిగించెను. ఆ జైనవసతి యప్పటి కింకను గొంటూరునాగదేవుని బాధ పడలేదుకాని శీఘ్రముగా నేమి యాపదయైనను రావచ్చు నని యచ్చటి యాచార్యులు భయపడుచుండిరి.

ముందుగా నిర్ణయించినప్రకారము అర్ధరాత్ర మగునప్పటికి సార్థములోనివారు కృష్ణవేణీతీరము చేరుకొని మొదటిజట్టువారు నావ లెక్కిరి. తెల్లవారువరకును ఆ నావలు సార్థము నావలికి దాటించుచుండెను.

తూర్పున తెల్లవారుచున్నది. సార్థములోని వాహనములును భారము లగు సామగ్రులును పడవ లెక్కినవి. ఈ తడవ నావలు దాటినచో సార్థ మంతయు దాటిపోయినట్లే!

పక్షుల కలకలముతోపాటు దక్షిణముగా నొక భయంకర నాదము వినవచ్చెను. తప్పెటలు, తాళములు, శంఖములు, సింహనాదములు! ఏదో సైన్యమే యటునుండి వచ్చుచుండెను ఐదు వందలమంది కల అశ్వికదళము శీఘ్రగతి కృష్ణాతీరము చేరికొనెను

అప్పటికి 'చనుపలోని చివరిభాగమువారి నావలు కృష్ణ వేణిలో సగముదూర మైనను బోలేదు. సేనానాయకు లా నావల వెనుకకు త్రిప్పు డని నావికులను కఠినముగా శాసించిరి సంజ్ఞలు కేకలు భయంకరముగా నుండెను. నావికు లేమిచేయను దోపక వణకుచుండిరి. ఈ సార్థవాహులు రేపటి కావల నెంతదూరమో పోవుదురు. నావికులో, ఇక్కడనే కాపురములు చేయువారు వారి భార్యలు బిడ్డలు ఇక్కడనే కలరు. వారి ఇళ్లు గొడ్లు గోదలు నిచ్చటనే కలవు. సేనల యాజ్ఞలు ధిక్కరించి వారు ఎదురు బెట్లు? సార్థవాహు లెంత ధన మిచ్చినను దాని నేమిచేసికొందురు తాము?

పడవలలోనివారు నావికులను బ్రతిమాలి భంగపడి విశేష బహూకృతులు చేయుదు మని యాశపెట్టిరి సేనలవంక చూడవల దని ప్రార్థించిరి. నావికులకుగూడ నొక భయ మున్నది. ఇప్పుడు వెనుకకు త్రిప్పినను సేనలచే తమకు ప్రహరణములు తప్పవు! ప్రస్తుత మావలియొడ్డు చేరి యందే కొన్నాళ్లున్నచో ననంతరక ర్తవ్య మాలోచించుకొనవచ్చును. ఎట్లైన నేమి? సార్థమంతయు నుత్తరతీరము చేరుకొనెను. అందులోనివారికి మల్లికార్జుననియు కనకదుర్గయు ప్రాపు సంప్రాప్త మయ్యెను.

మరి యిక మోసలపురమున బయలుదేరిన చనుపమాత్ర మింత యవస్థ పడలేదు. ఆ చనుపలోని సార్థవాహులు విదేశములనుండి వచ్చిన సరకులనే కాక యా చుట్టుప్రక్కల పద్మసాలెలు నేసిన సన్నని వలిపెములును చిత్రచిత్రవర్ణములతో నద్దిన మనోజ్ఞవస్త్రములును విశేషముగా తెచ్చుచుండిరి. ఆ వస్త్రములును వలిపములును భారతదేశమం దంతటనే కాక దూరమున నన్న యవనరోమక తురుష్కదేశములగూడ పేరుపడ్డవి. ఆ చనుప ఘంటసాల చేరునప్పటికే దూరమున నలజడులు జరుగుచున్న వార్తలు వచ్చెను అందుచే వారు శీఘ్రగతి కొలనివీడు చేరుకొన దలంచిరి అచ్చటికి చేరుకొన్నచో కొలనిరుద్రుని దుర్నిరీక్ష్యము లగు సేన లుండును. కాని యది వర్షాకాలము! కొల్లేటిలో కలియు బుడమేరు ఇత్యాది నదు లపాయకరములు. వారు సాహసించి శ్రీకాకుళము చేరుకొనిరి. అప్పటి కావలియొడ్డున గల కొల్లూ రను నగ్రహారముసమీపమున కొప్పెరుంజింగని సైన్యములు విడిసియుండి కృష్ణవేణి నుత్తరించు ప్రయత్నములలో నుండె నని వారికి తెలిసినది. వెంటనే ఆ సార్థవాహులు బయలుదేరి పులి వెంటబడుచున్న మృగములవలె రాత్రింబవళ్లు విశ్రమింపక ఎడతెగని ప్రయాణములు చేసి బెజవాడ చేరుకొనిరి.

మోసలపట్టణమునుండి ఓరుగల్లు పోవుమార్గములో బెజవాడ పెద్దకూడలి! అక్కడ బలమైన కాకతిరాజసేనలు ప్రజారక్షణ చేయుగలవు. అక్కడి సేనలను కొలనివీడులోని సేనలను ఎదుర్కొన జంకియే కొప్పెరుంజింగడు తన పల్లవసేనతో దూరదూరమున తూర్పుతీరప్రాంతములనుండి ఈశాన్యముగా దండుపోవుచుండెను

"రెండు చనుపలు నిప్పటికి ఇరువదిరోజులక్రిందట బెజ

వాడలో కలసికొనెను. వాని యధ్యక్షు లిరువురును కలసియే యాపైన పయనము సాగింప నిశ్చయించిరి. వా రిరువురిలో ఎక్కువ యను భవశాలి యగు మోసలపురసార్థవాహాధ్యక్షుడే యాపైని సర్వసార్థాధ్యక్షు డయ్యెను.

వారు బెజవాడలో ధాన్యగ్రాసాదులు సంగ్రహించుకొనిరి. క్రయవిక్రయములు కొన్ని పూర్తిచేసిరి. అంతట వారు బయలుదేరిరి. అచ్చటినుండియైనను మార్గము శాంతముగా లేదు. సేవల బాధ లేకున్నను దోపిడిగాండ్ర బాధ తప్పలేదు. ఆ దోపిడిగాండ్రు సామాన్యులా? వారు సాయుధులు. వారికి వేళ లేదు. నిద్రించుచున్న సార్థజనములపై నొకపరి పడి కొందరిని చంపి ద్రవ్యము కొంత హరించి పారిపోదురు. ఇరుకుమార్గములగుండ వెళ్లు నెడల నెల్ల వారి బాధ తప్పదు. అట్లే పర్వతమార్గములను వనమార్గములను అనుసరించి సార్థమేగునప్పుడెల్ల అపాయము లెదుర్కొనవలసినదే. ఎట్లో వారు జగ్గయ్యపేట చేరుకొనిరి.

అది యనాదిగా పట్టువస్త్రముల నేతకు పేరుపడ్డపేట. అచ్చటి వర్తకు లెందరో ఆ చనుపలో చేరి పయనము సాగించిరి.

అంతట కొన్నిదినములకు వారు పాకాల చేరుకొనిరి. అక్కడ కాకతిరాజన్యుల స్కంధావారము పెద్ద దొకటి కలదు. అక్కడ నున్న పెద్దచెరువు సౌఖ్యదాయకముగా ఉన్నది. ఆ వైపున నెట్టి యలజడియు లేదు. కాని యక్కడ వర్తకులు చెల్లించవలసిన సుంకము లెక్కువ. ఐన నేమి? ఇక్కడనే భయము లేదని సార్థవాహులందరు దీర్ఘనిశ్వాసము వదలిరి. వారు సుంకములు సక్రమముగా నన్నియు జెల్లించిరి. అక్కడనే తమ సరకు లెన్నిటినో పోకడపెట్టిరి. చెల్లించిన సుంకములకంటె శతాధికముగా వా రచ్చట లాభము సంపాదించిరి.

అగ్రహారములు వసతులు ఘంటాపథములకు సామాన్యముగా దూరముగా నుండెడివి. సార్థవాహులు రాజమార్గ మలజడిగా నున్నయెడల నెల్ల సమీపమున గల అగ్రహారముల నాశ్రయించెడివారు. ఇట్లెన్నో కడగండ్లు గడచి యా సార్థము తుదకు ఓరుగల్లు పట్టణము చేరికొని తూర్పుద్వారముముందు నిలిచెను. అచ్చట నప్పటికే సిద్ధముగా నున్న స్థలసుంకాధికారులు శీఘ్రగతి సుంకములు నిర్ణయించిరి. స్థలసుంకాధికారులకును వర్తకులకును భేదాభిప్రాయము రాకుండ నచ్చట శ్రీగణపతిదేవుల శిలాశాసనమే యొకటున్నది.

" ... .
చందనము—తులం ౧ కి ఫలము.
కర్పూరము—వీశ ౧ కి ౨ చిన్నాలు.
జవాది—మాడపరక.
కస్తూరి—౧౦౦ చిన్నాల ౧ కి చిన్నము.
.. . . "

సూర్యు డస్తమించెను. చీకటి పడిపోయెను. సుంకనిర్ణయమును బూర్తికావచ్చుచుండెను.

అంతట ఏకశిలాపురపాలకు డగు మేచయనాయకుడే స్వయముగా పలువురు భటుల సమూహముతో నా చనుపయెదుట ప్రత్యక్షుడై సార్థవాహాధ్యక్షుని బిలిపించి యాతని యధికారపత్రము నడిగెను.

ఆ యధ్యక్షునికి పాకాల చేరినప్పటినుండియు చన భయమును లే దని ధైర్యము నెలకొనెను. రాజధాని చేరుకొన్నప్పటికా ధైర్యము శతగుణ మయ్యెను. అనుభవశాలి యగు నతనికి రాజపురుషు లన్న నెట్టి భయమును లేదు. అందుచే కొంత నిర్లక్ష్యము కలసిన గౌరవముతో నతడు తాను మోసలపురమునుండి తెచ్చిన యధికారపత్రాదులు మేచయ కీయబోయెను. మేచయ యవి స్వయముగా నందుకొనక వెంట నున్న గండని నిర్దేశింప నత డది తీసికొని వెనుక నున్న లేఖకునిచేతి కిచ్చెను. ఆ లేఖకు డవి చదివి వినిపింపబోవుచుండ మేచయనాయకు డాతనిపై తీక్ష్ణదృష్టి ప్రసరింపజేయ నాత డట్లై చదువుట చాలించెను.

ముందుభాగమున నిది జరుగుచున్న సమయముననే యా చనుప వెనుకభాగములో కొంత యలజడి విననయ్యెను. మరుక్షణమున నలుముఖములనుండి కరదీపికలు ధరించిన రాజభటులు లా చనుపను ముట్టడించిరి. ఈ యవినయమునకు సార్థవాహాధ్యక్షుడు నివ్వెరపోయి చూచుచుండెను.

అంతలో రాజభటులు 'వీరు పారిపోవుటకు ప్రయత్నించుచుండిరి' అని చెప్పుచు వెనుక నున్న కొందరు బేహారులను బంధించి తెచ్చి మేచయనాయకు నెదుట నిలిపిరి. మేచయ యా బంధితులను తన తర్జనితో నిర్దేశించుచు సార్థవాహాధ్యక్షుని ప్రశ్నించెను.

"వీ రెవరో ఎరుగుదువా?"

అధ్యక్షుడు వెంటనే యుత్తర మిచ్చెను.

"ఎరుగను. వారితో మాకు సంబంధము లేదు."

మేచయ యా బంధితులవంక తీవ్రముగా తిలకించెను. వారు సార్థవాహాధ్యక్షునివంక ఆశ్చర్యము ప్రకటించు దృష్టులు పరపి మరల మేచయనాయకునివంక వీక్షించిరి.

మేచయ "మీ రేల పారిపోవుచుంటిరి?"

వారిలో నొకడు "రాజభటు లింద రొక్కసారి రాగా చూచి భయపడి పారిపోసాగితిమి."

మేచయ: "రాజశాసనములు సంరక్షించు భటులను జూచిన అనపరాధులు భయపడుదురా?"

మరియొకడు: "ప్రభూ, రాజభటు లందరు శాసనములు రక్షించువారేనా?—మేము దారిలో ఎన్ని కడగండ్లపాలయినాము? అందులో—"

ఇంకొకడు "దొరా, రాజభటులను జూచి భయపడు నిరపరాధులును పలువు రున్నారు."

మేచయ: "ఈ యధ్యక్షునికి తెలియకుండ మీ రీ చనుపలో నేల కలసితిరి?"

మరల వారు బెదరుచు అధ్యక్షునివంక నొకమారు చూచి నాయకునివంక నొకమారు చూచి యొక్క త్రుటికాలము నిరుత్తరులైరి. అంతట నందులో నొకడి ట్లనెను.

"మా పేళ్లు అధ్యక్షుడు లెక్కలలో ఎక్కించుట మరచెను కాబోలు!"

అధ్యక్షుడు ఆకస్మికముగా "దుర్మార్గుడా!" యని యందుకొనెను. అంతవరకును ఆ వర్తకవర్యునకు తన యనుమానాస్పదస్థితి గోచరించలేదు.

మేచయ: "ఈ సరకు లేమి?"

అధ్యక్షుడు ఒకటా? ముత్యములు, పవడములు, దంతములు, జిమ్ముఘము, కప్పురము, జవ్వాది, కస్తూరి, షలిషములు, అద్దకములు, [illegible], పట్టువస్త్రములు—"

మేచయ. "ఇంత విలువగల సరకులయొద్దకు క్రొత్తవారి నెట్లు రానిచ్చితివి?"

అధ్యక్షుడు: "వా రెట్లు వచ్చిరో నాకును విచిత్రముగనే యున్నది—అయినచో మీ సరకు లేవి?" ఈ చివరి ప్రశ్న యాతడా బంధితుల నడిగెను.

బంధితులు పోయి కొన్ని శకటములు చూపి యివి మా వని చూపిరి. అందులో వలిపములును పట్టువస్త్రములును గలవు.

అధ్యక్షుడు నిర్ఘాంతపోయెను.

ఆ బంధితు లంతట నందలి సరకులను వివరముగా వర్ణింప సాగిరి. దానితో నధ్యక్షుడు నోట మాట రాక నిర్విణ్ణుడై చూడ సాగెను.

మేచయ నూత్నముగా నిట్లు పలికెను.

"ఇట్టి సందర్భములలో కొంతకాలము మీ రందరును ఈ సరకులతో సహా రాజభటుల స్వాధీనములో నుండుట యందరకు శ్రేయస్కరము!"

ఆ వర్తకు లందరు నివ్వెరపోయిరి. ఇన్ని గండములు గడచి బయటపడిన మనకు ఓరుగంటి నీగతి పట్టిన దేమని వారు తమ విధిని దూరుచు బయలుదేరిన వేళను నిందించుచుండిరి కొందరు బిగ్గరగా నేడ్వసాగిరి. కాని వా రేమి చేయగలరు?

రాజభటులు వారి నందర జుట్టుముట్టి మోటుతనములేని దృఢమార్గమున గోపురద్వారము దాటించి జాగరూకులై చెరసాలకు నడిపించిరి. బంధితులు ప్రత్యేకముగా గంపని భటుల రక్షతో వేరొక ప్రదేశమునకు గొంపోబడిరి.

ఇది యపూర్వము! ఒక్క సార్థము సార్థము నే యిట్లు రాజభటులు కొంపోవుట యశ్రుతపూర్వము. ఇంతప్రొద్దు వేళ వెన్నెలలో, అనవసరముగా ఇన్ని దివిటీలతో, మేచయనాయకుడే స్వయముగా చెరసాలకు నడిపించుట యూహింపగూడ నలవి కానిది. మేచయనాయకుడు భ్రమపడుటయు ఓరుగంటివారులు భావింప రానిది కాని ఇందరు వర్తకశ్రేష్ఠులు చెరసాలకు నడచుటకూడ దక్షిణదేశమున నే భావింపరానిది!

ఇది యిట్లు జరుగుచుండగనే యారాత్రి రుద్రదేవమహారాజు భద్రదంతావళముపై నధిరోహించి మహావైభవముతో పురవీధుల నూరేగుచు పురకాంత లర్పించు నారతు లందుకొనుచుండెను. చంద్రుని వెన్నెలలు పూలజల్లువలె కురియుచుండెను. సహస్రాధికములగు రతనాల దివిటీల కాంతిలో నా మహోత్సవము చూడ ఏకశిలానగరము, మహేంద్రు డైరావతము నెక్కి పురమేగు నమరనగరిని దలపించుచుండెను.

మన రాష్ట్రం, మన దేశం:

(8 వ-పేజీ తరువాయి)

అంతకుముందు ఢిల్లీ పత్రికా సమావేశంలో ప్రకటించారు. దీన్ని బట్టీ, అదివరలో భారత ప్రభుత్వ ఆంతరంగిక శాఖవారు మద్రాసు ప్రభుత్వానికి పంపిన లేఖనుబట్టీ, జనవరి 26 వ తేదీకి ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించాలనే సంకల్పం భారత ప్రభుత్వానికి లేదని స్పష్టమౌతోంది. ఈ నిర్ణయం ముందే జరిగిపోయిందనీ, విభజనసంఘ నిర్ణయాలవల్ల వారా సంకల్పాన్ని మార్చుకో దల్చ లేదనీ ధృవపడుతోంది.

నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చేలోగా ఆంధ్రరాష్ట్రాన్ని తెచ్చుకోవాలనే ఆత్రంతోనే ఆంధ్రదేశం చెన్నపట్నంపైన హక్కులు విడిచిపెట్టడాని కంగీకరించింది.

1950 జనవరి 26 లోగానే రాష్ట్ర విభజన జరిగిపోవాలనే తొందరతో మద్రాసు ప్రభుత్వ కార్యదర్శులు, విభజన సంఘ సభ్యులు ప్రయాసపడుతూనే, భారత ప్రభుత్వం సంజ్ఞ చెయ్యడం తడవుగా క్షణంలో నూతనరాష్ట్రాన్ని నిర్మించడానికి అన్నిహంగులూ ఏర్పరిచి, విభజన కలాపమంతా ముగించి సంసిద్ధంగా ఉన్నారు. పండిట్ నెహ్రూ ప్రకటనతో కార్యక్రమం అంతా తలక్రిందై పోయింది.

భారతప్రభుత్వం జాప్యం చెయ్యడానికి హేతువులు వారి ఆంతరంగికశాఖ పంపిన లేఖలోనే స్పష్టంగా గోచరిస్తున్నాయి.

అవి 1. ఆర్థికసమస్య 2. కమ్యూనిస్టు ప్రమాదం 3. రాజధానిసమస్య 4 బళ్లారి జిల్లా సమస్య. 5. ఇతర సరిహద్దుల నిర్ణయ సమస్య.

ఈ సమస్యల పరిష్కారంలో అతి జాగ్రత్త వహించాలనీ, జనవరి 26 లోగా విభజన జరిగిపోవాలనే ఆత్రంతో టూకీగా తెమల్చకూడదనీ ఆంతరంగికశాఖా కార్యదర్శి శ్రీ అయ్యంగార్ తమలేఖలో హెచ్చరించారు. కాని జనవరి 26 తరువాతనైతే అనేకచిక్కులకు లోను కావలసి వస్తుందనే భయంతో విభజన సంఘ సభ్యులు మేలో కీడో ఏవో కొన్ని నిర్ణయాలుచేసి అంగీకారానికి వచ్చారు. అల్ప వ్యవధి అదను చూసుకుని తమిళ సభ్యులు తమ చిత్తంవచ్చిన షరతుల్ని విధించి తెలుగు సభ్యులచేత ఒప్పించారు. మూడువిషయాల్లో శ్రీప్రకాశంగారు అభిప్రాయభేదం ప్రకటించడం తప్ప, అన్నిటికీ మిగతా ముగ్గురు సభ్యులూ ఒడిపట్టారు. ఆంధ్రరాష్ట్ర తాత్కాలిక రాజధానివిషయంలో తెలుగు సభ్యులు (ప్రకాశంగారు తప్ప) అరవ సభ్యులు చెప్పిన నీచమైన షరతులకి కూడా అంగీకరించారు. నుంచో ... ే నుంచున్నారు. ... మంటే ... న్నారు.

ఇల్లు కాలిపోతే బొగ్గు లేరుకున్నట్లు కొందరు తెలుగుసభ్యులు ఈ దుస్థితిని అదను తీసుకుని రాయలసీమవారిని కూడగట్టుకుని ప్రధానిపదవికోసం తంత్రాలుపన్నారు. తెలుగు సభ్యుల ఈ దౌర్బల్యాన్ని గ్రహించిన తమిళసభ్యులు రాజధాని విషయంలో అతి నీచంగా ప్రవర్తించారు. ఒకరి అవినీతికి మరొకరి నీచబుద్ధి తోడై ఆంధ్రదేశం ఆత్మగౌరవానికి హాని కలిగించింది అయినా ఈపీడ వొదిలితే చాలని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అర్థమనస్కంగా షరతుల కంగీకరిస్తూ, ఆంధ్రులికి న్యాయంచేకూర్చడానికి భారత ప్రభుత్వమే పరిష్కారాధికారం తీసుకోవలసిందని (ప్రకాశంగారి సూచన ప్రకారం) కోరింది.

ఏవో సాకులు తెచ్చి జనవరి 26 లోగా ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించరాదని ముందే నిర్ణయం చేసుకుని కూచున్న భారత ప్రభుత్వానికి దీనితో మరొకసాకు దొరికింది.

కేంద్రమంత్రివర్గం ఒక నిర్ణయానికి ఇదివరకే వచ్చిందని పండిట్ నెహ్రూ మద్రాసు విమానాశ్రయంలో చెప్పారు ఆంధ్రరాష్ట్రనిర్మాణం జాప్యంకావడానికి ఉండగల హేతువులేవో పండిట్ నెహ్రూ ఢిల్లీ పత్రికా సమావేశంలో సూచించారు అవి ఆర్థికసమస్య, బళ్లారి జిల్లా సమస్యపై అయిదు సమస్యల్లో మిగతా మూడింటినీ (అనగా కమ్యూనిస్టు ప్రమాదం, రాజధాని,

పరిహద్దు సమస్యల్ని) పండిట్ నెహ్రూ సూచించలేదు కాని, అవి అత్యంత ప్రధాన మైనవని భారతప్రభుత్వం పరిగణిస్తున్నట్లు ఊహించడానికి ఆధారం ఉంది కమ్యూనిస్టు ప్రమాదంగురించి చర్చించడానికిగాను భారత ప్రభుత్వ ఆంతరంగికశాఖవారు యావత్తు రాష్ట్రాల సంస్థానాల పోలీసు ప్రధానాధికారుల్ని ఢిల్లీలో సమావేశ పరుస్తున్నారు బెంగాల్, అస్సాం, తెలంగాణా, సర్కారు జిల్లాల్లో కమ్యూనిస్టు ప్రమాదాన్ని ఎలా అణచాలో ఒక కార్యక్రమం నిర్ధారణ కానున్నది ఈసందర్భంలో ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుల్ని అణచడానికి కొత్త ఆంధ్రరాష్ట్రం తట్టుకోగలదా, లేక సమష్టి రాష్ట్రంగానే ఉంటే మంచిదా అనే విషయం చర్చకు రావచ్చును. సమష్టి రాష్ట్రంగా ఉన్నందువల్లనే తెలుగుదేశంలో కమ్యూనిస్టుల్ని అణచడానికి మద్రాసు ప్రభుత్వం తగిన శ్రద్ధవహించలేకపోతున్నదని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌వారి అభిప్రాయం. ఈఅభిప్రాయాన్ని ఢిల్లీసమావేశానికి తెలప వలసిన బాధ్యత మద్రాసు ప్రభుత్వపు పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్‌పైన ఉంది కమ్యూనిస్టు సమస్య దృష్ట్యా ఆంధ్రరాష్ట్ర రాజధాని సమస్యను పరిష్కరించవలసిన అగత్యం ఉందని భారతప్రభుత్వ హోం శాఖవారు గ్రహించినట్లు తెలుస్తోంది ఆంధ్రరాష్ట్రం నిర్మాణమైతే పోలీసుశాఖ ప్రధానకార్యాలయం విజయవాడలో ఉండాలని తమ అభిప్రాయాన్ని మద్రాసుప్రభుత్వానికి తెలియచేశారని కూడా వినికిడి. అందువల్ల విభజనసంఘంవారు ఆంధ్రరాష్ట్ర రాజధాని విషయమై చేసిన నిర్ణయమూ, ఆంధ్రరాష్ట్ర నాయకుల ధోరణీ కేంద్ర ప్రభుత్వానికి నచ్చడంలేదని భావించడానికి అనువిస్తోంది.

ఇంతేకాదు థార్ కమిషన్ విచారించే సమయంలో మద్రాసు ప్రభుత్వం సమర్పించిన లెక్కల ప్రకారం ఆంధ్రరాష్ట్రానికి ఆదాయంకంటె ఖర్చు 6½ కోట్లరూపాయలు అధికం ఉంటుందని తేలగా, ఇప్పుడు మద్రాసు ప్రభుత్వం అది ఆరున్నరకోట్లు కాక కోటిరూపాయల లోపేనని చెప్పడంలో అనుమానం కలక్కపోదు. అందువల్ల విభజనసంఘ నిర్ణయాల్ని మద్రాసుప్రభుత్వ సూచనల్ని సమగ్రంగా పరిశీలిస్తేగాని భారత ప్రభుత్వం ఏనిర్ణయం చెయ్యలేకపోతోందంటే ఆశ్చర్యంలేదు. ఈ పరిస్థితికి ఆంధ్ర రాష్ట్రనాయకుల్నే నిందించుకోవాలి.

భాషారాష్ట్ర విచారణ సమయంలో అరవలు ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి అన్ని విధాలా అవరోధాలు కల్పించడానికి యత్నిస్తుంటే తెలుగు మంత్రులు కిమ్మనకుండా ఊరుకున్నారు. ఇప్పుడు అల్ప వ్యవధి, నవకాశంగా తీసుకుని అరవలు అవమానకరమైన షరతులు ఆంధ్రదేశంపైన రుద్దుతోంటే తెలుగు సభ్యులు కేవలం పదవులే ప్రధానమని తలచి ప్రవర్తించారు. దుస్తంత్రాలకు ఎప్పటికైనా దుష్ఫలితాలే ప్రాప్తంకాక తప్పదు.

జనవరి 26 వ తేదీకి ఆంధ్రరాష్ట్రం నిర్మాణం కాదని స్పష్టపడిపోయింది. కొత్త రాజ్యాంగంప్రకారం ఆంధ్ర రాష్ట్రం నిర్మాణం కావడానికి అనేక ఆటంకాలున్నాయి. జాప్యం కావడానికి కొన్ని ఆటంకాలున్నాయని పండిట్ నెహ్రూ అన్నారో, అంత కనేకరెట్లు ఆటంకాలు రావడమే కాక మళ్ళీ ఎన్నికలఅనంతరంకాని ఈ ప్రసక్తి తీసుకురావడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడవచ్చును. అందువల్ల గవర్నర్ జనరల్ ఆర్డరుద్వారానే ఆంధ్రరాష్ట్రనిర్మాణం కావడం అవసరం. ఈ ఆర్డరుద్వారా జనవరి 26 లోగా నిర్మాణం జరిగితే ఏచిక్కూ ఉండేదికాదు కాని విభజనసంఘనివేదికని భారత ప్రభుత్వపు ఆర్థిక, ఆంతరంగిక (పోలీసు), ఆహారవ్యవసాయ శాఖలు, ప్రాజెక్టులు విద్యుచ్ఛక్తిశాఖలు సమగ్రంగా పరిశీలనచేసి తమ అభిప్రాయాల్ని తెలపడానికి వ్యవధిచాలదని భారతప్రభుత్వం అభిప్రాయమై ఉండవచ్చును. అదీకాక ఏప్రిల్ 1 వ తేదీకి రాష్ట్రనిర్మాణం జరిగితే బడ్జెట్ల తయారీకి సౌకర్యంగా ఉంటుందని ఆడిటర్ జనరల్ ఇచ్చిన సలహాను భారతప్రభుత్వం అనుసరించదలిచిఉండవచ్చును. ఈరీతిగా చెయ్యడానికి ఒక సౌకర్యం ఉంది. ఏప్రిల్ 1వ తేదీకి గాని మరొక తేదీకిగాని ఆంధ్ర రాష్ట్రనిర్మాణానికి జనవరి 26 కి ముందుగానే గవర్నర్ జనరల్ ఉత్తరువు చెయ్యవచ్చును. ఆ ఉత్తరువును అమలు జరుపుతూ పార్లమెంటు సమావేశమయ్యేలోగా (ఫిబ్రవరిలోగా) రిపబ్లిక్ అధ్యక్షుడుఉత్తరువివ్వవచ్చును. ఉత్తరువిచ్చినతరవాత రాష్ట్ర నిర్మాణాని కుపక్రమిస్తే పార్లమెంటులో చర్చల బాధ, కన్నడిగలు మహారా[illegible]ల ఆక్షేపణలబా[illegible] ఉండవు.

అయి[illegible] త[illegible]

శాఖలు త్వరపడవలసిన అవసరం ఉంటుంది ఈసందర్భంలో ఆంధ్రుల కెక్కడెక్కడ అన్యాయం జరిగిందో విభజనసంఘ నివేదికతోపాటు శ్రీప్రకాశంగారు పంపిన ప్రత్యేక పత్రంలోని విషయాల దృష్ట్యా పరిశీలించి భారతప్రభుత్వం పరిష్కారం చెయ్యగలదని ఆశించవచ్చును.

అయితే ఈపరిశీలన కెంత వ్యవధిపట్టుతుంది? పరిశీలనే వాస్తవంగా జాప్యకారణమైతే, రాష్ట్రనిర్మాణం ఏప్రిల్ 1 వ తేదీకైనా జరగడం కష్టం. ఆ తరవాత, అసంభవమనే తలచవచ్చును.. ప్రభుత్వశాఖలు త్వరపడవలసిన అవసరాన్ని



"జనవరి 26 లోగా ఆంధ్రరాష్ట్రనిర్మాణం అసాధ్యం"—మద్రాసులో నెహ్రూ.

గుర్తించినట్లయితే జనవరి మూడోవారానికే పూర్తిచెయ్యడానికి వీలుంది. ఈపక్షంలో జనవరి 26 లోగానే రాష్ట్రనిర్మాణానికి వీలు కలిగించవచ్చును. అన్ని విషయాలపై తృప్తికరమైన నిర్ణయాలు జరిగినప్పటికీ, ఆపైన ఒక్కరోజు కూడా ఆలస్యం చెయ్యబోరని పండిట్ నెహ్రూ భారతప్రభుత్వాభిప్రాయాన్ని తెలిపారు. అంతే భారత ప్రభుత్వశాఖలికీ, మంత్రులకీ సంకల్పమే ఉండాలిగాని తరుణంలో కార్యం ముగించడానికి ఆటంకాలు లేవు. మద్రాసుప్రభుత్వం పక్షంరోజుల్లో విభజనకు సంసిద్ధం కాగలిగినప్పుడు భారతప్రభుత్వం ఎందుకు సిద్ధం కాలేదో తెలియదు (మద్రాసుప్రభుత్వ నిర్ణయాలు అందరికీ తృప్తికరంగా లేనిమాట వేరు) సామాన్య పరిపాలనావిషయాలలో వలెనే భారతప్రభుత్వశాఖలు జోగుతూ తూగుతూ కార్యభారాన్ని ఈడవడం మొదలెడితే ఎక్స్టర్నల్ జనరల్ ఆఫీసులో ఫైల్సుకి పట్టేగతే ఆంధ్రరాష్ట్రాన్ని సంభవిస్తుంది. ఇంక ఏప్రిల్ 1 తేదీకి కాదు గదా, 1951 కైనా రావడం దుర్లభం.

ఆంధ్రరాష్ట్రనిర్మాణం త్వరలో జరక్కపోతే పరిపాలన స్తంభించిపోవడం తథ్యం. ఈవిషయాన్ని పండిట్ నెహ్రూ గ్రహించకపోవడం శోచనీయం. జాప్యం అవుతున్నకొద్దీ ఆంధ్రదేశంలో పరిపాలనాది వ్యవహారాల్లో కల్లోలం తప్పదు. ఇంతకొండ జరిగాక ఇప్పుడు రాష్ట్రం రాదంటే ప్రజల్లో అసంతృప్తి, నాయకుల పట్ల అవిశ్వాసం తప్పక వ్యాపించగలవు.

దేశం కల్లోలభూయిష్టమైపోవడమే, ఆంధ్రరాష్ట్రనిర్మాణం జరిగి తీరాలనీ నిజంగా కాంక్షించేవారయితే, మద్రాసు ప్రభుత్వం ఈక్లిష్టపరిస్థితిని భారతప్రభుత్వానికి తెలపవలసి ఉంది.

ఇంతే కాదు; రాష్ట్రవిభజనసందర్భంలో ఏబలవంతంమీదనో తెచ్చిపెట్టబడిన సామరస్యం, సమాధానం భగ్నమైపోగలవు. చెన్నపట్నంపైనా ఇతరవాదగ్రస్తప్రాంతాలపైనా హక్కుల్ని ఆంధ్రులు తాత్కాలికంగా విడిచిపెట్టారంటే నూతనరాష్ట్రం గంతోపాటు ఆంధ్రరాష్ట్రం తెచ్చుకోవాలనే, ఆత్రంతోనే జనవరి 26 వ తేదీకి రాష్ట్రం రానిపక్షంలో ఆంధ్రులు తమ నిర్ణయాల్ని పునః పరిశీలించుకోవలసివస్తుంది. చెన్నపట్నం భవిష్యత్తునీ ఇతర సరిహద్దుల్నీ ఇప్పుడే శాశ్వతంగా పరిష్కరించాలనే భారతప్రభుత్వం తలుస్తున్నట్లయితే ఆంధ్రులు అన్ని షరతుల్నీ రద్దుపరచవలసివస్తుంది. ఈ విషయాల్ని విభజనసంఘసూచనప్రకారం భవిష్యన్నిర్ణయానికి విడిచిపెట్టాలి. లేనిపక్షంలో ఉభయవర్గాల మధ్యనూ సన్నగిల్లిన భేదాభిప్రాయాలు తిరిగి పెరిగి పెద్దసమస్యలుగా పరిణమించగలవు. ఈవిషయాన్ని భారతప్రభుత్వమూ కేంద్రనాయకులూ గమనించకపోవడం శోచనీయం.

విభజనసంఘ నిర్ణయాలలో ఆంధ్రదేశానికి జరిగిన అన్యాయాన్ని తొలగించి భారతప్రభుత్వం తామే స్వయంగా పరిష్కారంచేసి న్యాయం చేకూర్చదల్చినట్లయితే అది ఆంధ్రులికి ఆనందదాయకమే. జరుగుతున్న అన్యాయాలను కేంద్రనాయకులు గమనించకుండా న్నారని ఆంధ్రదేశంలో ఏర్పడుతున్న అభిప్రాయం తొలగి కాంగ్రెస్ నాయకుల నీతిన్యాయాలపట్ల ఆంధ్రులకు విశ్వాసం కలుగుతుంది కూడా. కాని ఆర్థికసమస్యలు మొదలైన మిషలతో రాష్ట్రనిర్మాణాన్ని వాయిదా వేస్తే ఇప్పుడు జరుగుతున్న అన్యాయం చాలక ఆంధ్రదేశానికి తీరని అపచారం కలగగలదు.

ఫలాని తేదీకి ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించగలరని గవర్నర్ జనరల్ ఆర్డరు ద్వారానైనా జనవరి 26 లోగా ప్రకటించకపోయినట్లయితే ఆంధ్రదేశంలో పరిపాలనా వ్యవహారం స్తంభించిపోగలదు. వాగ్దానాలు, వాగ్దానభంగాలతో విసుగెత్తిపోయిన ఆంధ్రులకు ప్రభుత్వంపట్ల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంది. [సీతారాం]